ఆంధ్ర సారస్వత పరిషత్తు
సప్తతి మహోత్సవ ప్రత్యేక ప్రచురణ

వ్యాసగుళుచ్ఛం

రెండవ భాగం

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్-1

ఆంధ్ర సారస్వత పరిషత్తు
సప్తతి మహోత్సవ ప్రచురణ

వ్యాసగుళుచ్ఛం

రెండవ భాగం

ప్రధాన సంపాదకులు:

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణరెడ్డి

ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు

సంపాదకులు:

డా॥ జె. చెన్నయ్య
ప్రధానకార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆచార్య ఎం. కులశేఖరరావు
ప్రముఖ సాహితీవేత్త, కార్యవర్గ సభ్యులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాద్

VYASA GULUCHACHAM
(A collection of essays)

Part-2

Pages : 142

First Published : May 2013

Copies : 500

Price : Rs. 60/-

For Copies : Andhra Sarasvatha Parishath
Tilak Road, Abids
Hyderabad - 500 001
Ph : 040-24753724

Composed : Manu Graphics
1-8-116/3, Chikkadpally
Hyderabad-500 020
040-27633574

Printed at : Sai Likhitha Printers
Khairatabad
Hyderabad

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా॥సి.నారాయణరెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీమాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, శ్రీలోకనంది శంకరనారాయణరావు వంటి పలువురు సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943లో రూపుదిద్దుకొని, ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా.దేవులపల్లి రామానుజరావుగారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించారు. ఉత్తమాదర్శాలతో, ఆశయాలతో ఆవిర్భవించిన పరిషత్తు కాలానుగుణంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలందుకుంటున్నది. వీటిలో భాషాబోధన, గ్రంథ ప్రచురణ ముఖ్యభూమికలు వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణకళాశాల, స్నాతకోత్తరస్థాయి ప్రాచ్యకళాశాల నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపొందించి నిర్వహించే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్టులు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి వైలక్షణ్యాన్ని చేకూర్చుకున్నాయి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీ లోకం హార్దికంగా స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలువరించింది.

ఈ మహాసంస్థను స్థాపించి 26-05-2013 నాటికి 70 సంవత్సరాలు పూర్తి అయినాయి. పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సప్తతి మహోత్సవ ప్రచురణగా "వ్యాసగుచ్ఛం" రెండవ భాగం వెలువరిస్తున్నాం. పరిషత్తు లోగడ నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలలో ఆయా అంశాలపై నిపుణులు చేసిన ప్రసంగాలను వ్యాసాల రూపంలో సేకరించి ఈ గ్రంథంలో సంకలన పరిచి సాహిత్యలోకానికి అందిస్తున్నాం. విషయ సాంద్రత, అభివ్యక్తి సంక్షిప్తత సంతరించుకున్న ఈ వ్యాసాలు సాధారణ పాఠకులకు, విద్యార్థులకు పరిశోధకులకు, పండితులకు ఉపకరించేవిగా వున్నాయి.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగే అందరి మన్ననలు పొందగలదని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు

26 మే 2013

(డా॥సి.నారాయణరెడ్డి)

డా॥ జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి

ఆంధ్ర సారస్వత పరిషత్తు

ముందుమాట

తెలుగు భాషా సంస్కృతుల సముద్ధరణ కోసం కంకణం కట్టుకొన్న ఆంధ్ర సారస్వతపరిషత్తు గడచిన ఏడు దశాబ్దాల కాలంలో సమున్నతమైన స్థాయిలో లక్ష్యాన్ని నెరవేర్చింది. ఎప్పటికప్పుడు కొత్త బాధ్యతలను నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నది. 1946 మే 26న పరిషత్తు, జ్యోతిని వెలిగించిన పెద్దలు ప్రాతఃస్మరణీయులు. అత్యంత ప్రముఖంగా పేర్కొనదగినవారిలో లోకనంది శంకరనారాయణరావు, సురవరం ప్రతాపరెడ్డి, భాస్కరభట్ల కృష్ణారావు, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రంగనాథరావు, దేవులపల్లి రామానుజరావు, గడియారం రామకృష్ణశర్మ.... ఇంకా చాలామంది పెద్దలు పరిషత్తు జ్యోతి వెలుగులో తెలుగును వెలిగించారు.

పరిషత్తు నెలకొల్పి సరిగా ఏడు దశాబ్దాలైంది. జ్ఞానపీఠ పురస్కృతులు డా.సి.నారాయణరెడ్డిగారు అధ్యక్షులుగా తమ ఆలోచనలతో, కార్యప్రణాళికా రూపకల్పనలో పరిషత్తుకు, ఎప్పటికప్పుడు నూతనోత్తేజం కల్పిస్తున్నారు.

ఈ తరుణంలోనే పరిషత్తు సప్తతి వచ్చింది. సప్తతి మహోత్సవం సందర్భంగా 'తెలంగాణ విలక్షణ జానపద కళారూపాల ప్రదర్శనలు, ప్రసంగాలు', 'తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం', 'కవి సమ్మేళనం' వంటి కొన్ని మంచి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంలోనే కొన్ని ప్రత్యేక ప్రచురణలు కూడా వెలువరించాలని అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు నిర్ణయించారు.

ఈ గ్రంథానికి డి.టి.పి. చేసిన భాస్కర్‌కు, ప్రూఫులు చూసిన ప్రాచ్యకళాశాల అధ్యాపకుడు డా.సిల్మానాయక్‌గారికి, ముద్రించిన సాయి లిఖిత ప్రింటర్స్ వారికి కృతజ్ఞతలు. ఇతరత్రా సహకారం అందించిన మా కార్యనిర్వహణాధికారులు యాదగిరిరావు, గోపాలరెడ్డిగార్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

హైదరాబాద్
మే 26, 2013

ప్రధాన కార్యదర్శి

విషయ సూచిక

ప్రాచీన తెలుగు సాహిత్యంలో శిల్పకళ

-రాపాక ఏకాంబరాచార్యులు

ఉపోద్ఘాతము:

మానవుడు ఈ చరాచరమైన విశ్వమునందు జీవం పోసుకొన్నది మొదలు తన మనుగడకు కావలసిన కూడు, గూడు, గుడ్డల సముపార్జన కోసం నిరంతరమైన ప్రయత్నములు చేయుచు తన చేతలో కళాత్మక దృక్పథమును ప్రదర్శించుచు వచ్చినాడు. కాలగమనంలో తాను నాగరికతా విలసితమై భౌతికానందము పొందిన పిమ్మట మానసికానందము కొఱకు కళా దృక్పథమును తన చేతులలో అలవరచుకొన్నాడు. కళాత్మకంగా ఉండడమే కాకుండా చిత్రలేఖనము, శిల్పము, సంగీతము, నృత్యము (నృత్తము, నాట్యము) సాహిత్యము అను లలిత కళలలను అభివృద్ధి పరచుకొని వాటితోపాటు హస్త కళా కౌశలము గాంచి చతుష్షష్టి కళలలో నిష్ణాతుడగుట జగద్విదితము.

కళా నిర్వచనము:

ప్రాచీన కాలమునుండి ప్రాచ్య, పాశ్చాత్య దేశముల పండితులు కళకు నిర్వచనము చేయు ప్రయత్నము చేయుచునే యున్నారు. స్థూలముగా కళ అనుమాటకు స్థితి శీలమగు భావమును గతి శీలమగు భావముగ రూపొందించుటను కళ అని నిర్వచించవచ్చును. గతి అనగా కదలిక, స్థితి (నిలకడ) అని అర్థములు. కదలిక కనిపించు వానిని గతి శీలములనీ, కదలిక కనిపించని వానిని స్థితి శీలములని మనము చెబుతున్నాము. వ్యవహార జగత్తులో వ్యక్తగతిని గతి అనియు, అవ్యక్తగతిని స్థితి అంటున్నాము. గతి అనునది భవము (వికృతి) స్థితి అనునది భావము (ప్రకృతి). "భావము అనబడు ముడి పదార్థమును భవము అను నిర్మిత రూపములోనికి మార్పొందించుటయే కళ. కళ అనునది శీలము, భవము, కళ అనునది వికృతి, కళ అనునది నిర్మిత రూపము సృజన. ప్రకృతి వికృతిలోనికి మార్పు చెందుటయే కళ. మానవ మనోముద్రను అభివ్యక్తిని ఇచ్చుట కూడా కళయే" (విజ్ఞాన సర్వస్వము 14వ సంపుట లలిత కళలు - కళా నిర్వచనం - పుట-1)

కళ - ప్రకృతి:

బాహ్యప్రకృతి, అంతర్జగత్తుల సమ్మేళనమే కళ. కళ అంటే వాస్తవం, కల్పనల సమ్మేళనం. వాస్తవ వాదంలో కళ ప్రారంభింపబడుతుంది. ఆదర్శవాదంలో వికసిస్తుంది. కల్పనా వాదంలో పరిణతి చెందుతుంది. ప్రకృతిలోని రూపములను, వర్ణములను, నాదములును, గతులును కళలో సృష్టింపబడుచున్నవి. ఇవన్నీ కళకు ప్రతిబింబములు. ప్రకృతిలోలేని పూర్ణత కళలో కనిపిస్తుంది.

మానవునకు ప్రకృతిని జయించవలెనను కోరిక నేటికిని నెరవేరలేదు.

సమాజము కళపై ప్రభావము చూపగలదు. ప్రకృతిలో అందముగ నుండని వస్తువులను కూడా చిత్రకారుడు అందముగ రూపొందించగలడు.

కళ - జీవితము :

ఇతర కార్యకలాపములు మానవునకు ఎంత అవసరమో కళా కలాపాలు కూడా అతనికి అంతే. కళతో సంబంధమున్న జీవితములో ఆనంద దీప్తి ఉంటుంది. మంచి చిత్రరచన, శిల్ప నిర్మాణము, నాట్యము, గానము, సాహిత్యము సమాజమునకు మంచి మేలు చేస్తాయి.

శుద్ధకళ - నైతిక కళ:

నీతి, అవినీతి బోధించడం కళయొక్క ధర్మం కాదని, శుద్ధ రసానందాన్ని అందించేదే శుద్ధ కళ. కేవలం రసానందాన్ని అందించడమే పరమావధి కాదు. తోడుగ నైతిక సందేశమును అందించే ఉత్తమ కళ అవుతుందని నైతిక వాదులుచెబుతారు. నైతిక వాదులు కళాకృతిలోని విషయ వస్తువునకు ప్రాధాన్యము ఇవ్వగా శుద్ధ కళావాదులు నిర్మాణ కౌశలానికి ప్రాధాన్యము ఇస్తారు. కళాకృతిలో విషయవస్తువు, నిర్మాణ కౌశలము ఉత్తమముగా ఉండాలి. ఇంద్రియములద్వారా శ్రోతకు, ప్రేక్షకునకు పాఠకునకు రసానందమును కలిగించి హితము చెప్పునది ఉత్తకళ అని చెప్పవచ్చును. కళా కృతులను సృష్టించుట, వానిని విని, చూచి ఆనందించుట కళోపాసన క్రిందికి వస్తుంది. అందువలననే 'రసోవైసః' (రసమే బ్రహ్మము) అని అన్నారు. మానవుడు ఇంద్రియముల ద్వారా పొందే ఆనందమే తుదకు అతీంద్రియానందమునకు దారి తీయును. ఇది కళల ద్వారా సాధ్యమగునని విజ్ఞుల భావన.

కళలను నిర్వచించిన ప్రముఖ విద్వాంసులు :

హేమచంద్రుడు కళకు శిల్పమని, విజ్ఞానమని అర్థముచెప్పినాడు. వాత్స్యాయనుడు తాను రచించిన కామసూత్రము నందు 'కళ' యను దానికి విద్యయని 'తి చతుఃషష్టి

రంగ విద్యాకామసూత్ర స్యావయవిన్యః" అని నుడివినాడు. అమరకోశకర్త కళయనగా శిల్పమని చెప్పినాడు.

ఋగ్వేదములో 'కళ' అను మాటకు పదునారవ భాగమని అర్థము చెప్పబడింది. ఋగ్వేదమున గల కళకు దేవరాజ పండితుడు 'ప్రకళావిద్ ప్రకర్షేణ కళాః మనోన్మాన ప్రతిమానాది విషయాః ప్రకృష్టాశ్వ గణిరత్న పరీక్షాదికా వేద విజానాతి"అని వ్యాఖ్యానించెను. పై నిర్వచనములను, వ్యాఖ్యానములను బట్టి కళయనగా శిల్పమనీ, విజ్ఞానమనీ, విద్యయని పండితులు వివిధ రీతులలో కళకు అర్థము చెప్పినారు.

కళల వర్గీకరణము:

మహాభారతమునందు శివుని వలన గర్గ అరువది నాలుగు (64) కళలు ఉపదేశము పొందినట్లు తెలియుచున్నది. సాందీపుడను దేశికోత్తముని వద్ద రాముడు, గోవిందుడు 64 విద్యలు నేర్చినట్లు భాగవతమునందలి దశమ స్కంధములోని ఈ క్రింది పద్యము తెలియజేయుచున్నది.

కం॥ అరువది నాలుగు విద్యలు
అరువది నాలుగు దినంబులం తనవారవ్
నెరపాదులైన కతమున
నెఱి నొక్కొక్క నాటి వినికి నేర్చిరివేశా"

"గ్రంథ సంజ్ఞా దర్పణమ్" అను గ్రంథములో ఈ అరువది నాలుగు కళలలు తెలియజేయబడినవి.

మానవుడు ప్రతిభ, నైపుణ్యములతో చేయు పనులే కళలనవచ్చును. ఈ కళలలో కొన్ని మానవునకు శరీర సౌఖ్యము, మరికొన్ని హృదయానందమును, మానసికానందమును కలుగజేయును.

లలిత కళలు:

కళలు లలితకళలని, హస్తకళలని, యాంత్రిక కళలని, జానపద కళలని విభజించవచ్చును.

కళలు ప్రధానముగా రెండు రకాలుగా పేర్కొన వచ్చును. అవి రసప్రధానమైన కళలు, ఉపయోగితా ప్రధానమైన కళలు అని చెప్పవచ్చును.

రసప్రధానమైనవి లలితకళలుగాను, ఉపయోగితా ప్రధానమైనవి హస్తకళలుగాను లేదా చేతి పనులుగాను పేర్కొనవచ్చును. చిత్రలేఖనము, శిల్పము, సంగీతము, నృత్యము,

కవిత్వము, నాటకము అనునవవి రసప్రధానమైన లలిత కళలు. లలిత కళలలో కొన్ని శ్రవ్యకళలు, మరికొన్ని దృశ్యకళలు, మరికొన్ని మిశ్రమ కళలుగా పేర్కొన వచ్చును. లలితకళలో సంగీతము శ్రవ్యకళ, నృత్యము, చిత్రలేఖనము, శిల్పము మున్నగునవి దృశ్యకళల క్రింద చెప్పవచ్చును. నాటకము శ్రవ్యము, దృశ్యము క్రింద పేర్కొనబడు మిశ్రమ కళగా పేర్కొన వచ్చు.

శిల్పకళ:

శిల్ప, రాయిలో కాని, ధాతువులోకాని, మట్టిలోకాని, లోహములోకాని, మరియే ఇతర మాధ్యమంలోకాని నిర్మింపబడిన దృశ్యరూపం. శిల్పం చూడబడేది, స్పర్శింపబడేది కూడా. శిల్పం స్పర్శకు మెరకలు, పల్లాలు తెలుస్తాయి. శిల్పం మూడు ఆయతనాలు కలది. శిల్పం రెండు విధాలు – గుండ్రటి శిల్పం, శిల్ప ఫలకం. గుండ్రటి శిల్పం ముందువైపు, వెనుకవైపు కూడా చూడవచ్చు. చదునైన రాతిపై చెక్కుడును శిల్ప ఫలకం అంటారు. శిల్ప ఫలకాలు – ఉన్నత శిల్ప ఫలకం (Alto Relief) అనియు, నిమ్న శిల్పఫలకం (Bas Relief) అని రెండు విధాలు. ఉన్నత శిలాఫలకాలలో మూర్తులు ఎత్తుగా ఉంటాయి. నిమ్న శిల్ప ఫలకాలలో మూర్తులు అంత ఎత్తుగా ఉండవు.

దేవాలయం శిల్పంపై విశేషమైన పరిశోధన గావించిన వారు ఆచార్య మారేమండ రామారావుగా. వారు శిల్పం గురించి చెబుతూ శిల్పం వాస్తు శిల్పమని, విగ్రహ శిల్పమని రెండు విధములుగా నుండునని దేవాలయ శిల్పములు అను వ్యాసంలో ఈ విధంగా వ్రాశారు.

"శిల్పం – వాస్తు శిల్పము, విగ్రహ శిల్పము అను రెండు విధములు. వాస్తు శిల్పము ఆలయములయందును, చైత్యములమీదను ఉండును. మనదేశ చరిత్రమున ప్రతి మతశాఖకును పురాణములు, గాథలును అనేకములు కలవు. శివపురాణములు, విష్ణుపురాణములు, శాక్త పురాణములు, రామాయణ, భారత, భాగవతములు ఇట్టివే. హిందువుల వలెనే బౌద్ధులు బుద్ధుని జీవితమునందలి వివిధ సంఘటనలను గూర్చి గాథలను నిర్మించుకొనిరి.

ఈ గాథలు ఆలయములలో శిల్పరూపమున నున్నవి. ఈ శిల్పములలో దశావతారములు, కృష్ణలీలలు, క్షీరసాగర మథనము, వాలి సుగ్రీవుల యుద్ధము, సీతా సందర్శనము, రామ రావణ యుద్ధము తరచుగా కనిపించును. అట్లే బౌద్ధ శిల్పము నందు గౌతముని జననము, గృహ పరిత్యాగము, సంబుద్ధి, ధర్మ చక్ర ప్రవర్తనము తఱచుగ కనిపించును.

మన దేశమునందు అనేక దేవతా విగ్రహములు నిర్మింపబడినవి. ప్రతి దేవతను గూర్చియు కొన్ని నియమములుండును. వాని ననుసరించియే ఈ విగ్రహములు నిర్మింపబడును. వానిలో ఒక్కొక్కదానికి కొన్ని చిహ్నములను, కొన్ని సంకేతములుండును. ఈ విగ్రహము విడివిడిగ చెక్కబడి ఆలయములలో ప్రతిష్ఠింపబడి ఆరాధింపబడును. విగ్రహ శిల్పము దేవాలయములలో దేవతా మూర్తుల రూపములోను, వాహనముల రూపములోను, మానవ, జంతు, తిర్యగ్జాల రూపములో గోచరించును.

వాస్తు, విగ్రహ రూపములే కాక, అలంకార శిల్పమని శిల్పమున మరియు యొక భేదము కలదు. ఈ అలంకార శిల్పము రేఖలు, వలయములు, కోణములు, పుష్పములు, స్వస్తిక, త్రిరత్నము, వ్యాళీ, మకరము, పుష్పదామము మున్నగు బహురూపముల నుండును. ఇట్టి శిల్పము ద్వారము నిలువు కమ్ముల మీదను, గాథా శిల్పముల అంచులను, స్తంభముల మీదను గాంచనగును.

ఇట్లు దేవాలయములతోపాటు శిల్పము, అభివృద్ధి నందినది. ఆయలములకు అద్భుతమగు శోభను కూర్చినది. అక్షర జ్ఞానము లేని వారికి మతమును బోధించుట కిది సులభ మార్గమైనది. సౌందర్య పిపాసువులకు దేవాలయము కళాలయమైనది".

శిల్పి సృష్టికి తన ప్రతిభా నైపుణ్యములతో ప్రతిసృష్టి చేయగలడు. శిల, దారువు, దంతము, మట్టి, లోహములతో మనోహరమైన శిల్పములను రూపొందించును. శిల్పి యొక్క ప్రతిభ, నైపుణ్యములను జాషువ ఈ విధముగా కీర్తించినాడు.

తే॥గీ సున్నితంబైన నీ చేతి సుత్తినుండి
బయలువడె నెన్నియెన్ని దేవస్థలములు
సార్థకముగాని యెన్ని పాషాణములకు
గలిగె నీనాడు పసుపు కుంకుమల పూజ.

తే॥గీ కవి కలంబున గల యలంకార రచన
కలదు కలదోయి శిల్పి నీ యులి ముఖమున
గాక పోయిన బెనురీతి కంబములకు
గుసుమ వల్లరు లేరీతి గ్రుచ్చినావు?
ఱాల నిద్రించు ప్రతిమలమేలు కొలిపి
యులిని సోకించి బయటికి బిలిచి నావు
వెలికి రానేర్చి, నీ పేరు నిలుపకున్నె
శాశ్వతుడవోయి, నీవు నిశ్చయముగాను.

శిల్పమునకు రెండు ప్రధాన గుణములు కలవు. అందొకటి స్థిరత్వము, రెండవది శిల్పము హృదయమును ఆకర్షించును. రసానందములో హృదయమును ముంచి రంజింపజేయును.

శిల్పకళకు మాతృక చిత్రకళ:

పురాణాలలో చిత్రకళకు ఆదిపురుషుడు – ఊర్వశిని సృష్టించిన ఆది నారాయణుడు దేవశిల్పి యైన విశ్వకర్మ అని వ్రాయబడినది. 19వ శతాబ్దంలో నిర్వహింపబడిన పురావస్తు త్రవ్వకాల వలన 25 వేల సంవత్సరాలకు పూర్వం నుంచి చిత్ర రచన ఉన్నట్లు గుర్తింపబడినది. ఆదిమమానవుడు జంతువులను వేటాడు చున్నట్లు గుహలలో చిత్రాలు గీచారు.

భారతీయ శిల్పకళ వికాసములో 1) సింధునాగరికతా యుగము, 2) ఆర్యాగమనయుగము 3) వైదిక యుగము 4) మౌర్య యుగము 5) గాంధార శిల్ప యుగము 6) ఆంధ్ర యుగము 7) గుప్తయుగము 8) కాకతీయయుగము 9) విజయనగర రాజయుగము అనే యుగములుగా విభజించ వచ్చును.

ఆంధ్రశిల్పం భారతీయ శిల్పంలోను, ప్రపంచ శిల్పంలోను భాగాలే. ఆంధ్రశిల్పంలో ముఖ్యమైనవి – శాతవాహన శిల్పం, ఇక్ష్వాకుల శిల్పం, కాకతీయ శిల్పం, విజయనగర శిల్పం మొదలైనవి.

ఆదిమ శిల్పం వదిలితే – శాతవాహన శిల్పంతో ఆంధ్ర శిల్పం ప్రారంభమౌతుంది. శాతవాహన రాజులు ముప్పైమంది సుమారు 450 సంవత్సరాలు పాలించారు. శాతవాహనరాజులు ఆంధ్రదేశంలో అమరావతి, శ్రీకాకుళం రాజధానులుగా ఆంధ్రదేశాన్ని పాలించిన సంగతి విదితమే. వీరి కాలంలో అమరావతి శిల్పం (బౌద్ధ శిల్పం) బాగా వృద్ధి చెందింది. బౌద్ధంలో హీనయాన, మహాయన శాఖలకు చెందిన శిల్పాలు మనకు అమరావతిలోను, ఇతర స్థలాలలోను గోచరిస్తాయి.

హీనయానంలో బుద్ధుని విగ్రహరూపంలో ఆరాధించడం లేదు. బుద్ధుడు తన జీవితకాలంలో తనను కాని, తన విగ్రహాన్ని కాని ఆరాధించవద్దని చెప్పినాడు. అందువలన అతని మరణానంతరం అతని అనుచరులైన బౌద్ధమతస్థులు – బుద్ధుని విగ్రహ రూపంలోకాక ప్రతీక రూపంలో శిల్పాలను మలిచారు. బుద్ధుని రూపంలేకుండా ఆయన జీవితంలోని నాలుగు ప్రధాన ఘట్టాలను అనగా (1) జననం 2) మహాసంబోధి 3) ప్రథమ ధర్మోపన్యాసం 4) మహాపరినిర్వాణం శిల్పించారు. శిల్పులు బుద్ధుని జననాన్ని ఒక పాత్రనుండి తామరతీగలు పైకి లేస్తున్నట్లు, మహాసంబోధికి ఒక చెట్టు క్రింద

సింహాసనాన్ని, పాదముద్రలను, ప్రథమ ధర్మోపన్యాసాన్ని స్తంభం మీద ఒక చక్రాన్ని, మహాపరినిర్వాణాన్ని స్తూపం రూపంలోను దాని దగ్గర బుద్ధుని ఆరాధకులు కూర్చొని ఉన్నట్లు శిల్పించారు. ఈ విధంగా హీనయానంలో బుద్ధుని జీవితాన్ని చూపకుండానే బుద్ధుని జీవితాన్ని అందంగా శిల్పించారు. ఆనాటి శాతవాహన రాజుల కాలం నాటి సాంచీ తోరణ శిల్పాలలో కొన్ని ఆంధ్రశిల్పులు రూపొందించవే.

క్రీ.శ. 2వ శతాబ్దంలో మహాయాన బౌద్ధమతం ప్రారంభమయ్యింది. మహాయాన బౌద్ధమతంలో బుద్ధుని ప్రతిమను ఆరాధించడం జరిగింది. బుద్ధ ప్రతిమలు గాంధారంలోను, మధురలోను చేయబడ్డాయి. ఉత్తరాది శిల్పులను అనుసరించి ఆంధ్రశిల్పులు కూడా బుద్ధప్రతిమలు తయారు చేయడం ప్రారంభించారు.

అమరావతి ధాన్యకటక రాజధాని. ఇక్కడ మహాదేవ భిక్షువు అనే శిల్పి బౌద్ధ స్తూపాన్ని నిర్మించాడు. ఇక్కడ స్తూపాలు, చైత్యాలు వెలశాయి. మహాబౌద్ధ సంఘారామంగా ఇది రూపొందింది. ధాన్యకటకం, విజయపురిలలో నిర్మింపబడిన శిల్పాలు మాచెర్ల సమీపంలోని పెందోట శిల్పులు నిర్మించినవే. ఇది విజయపురికి 10 మైళ్ల దూరంలో ఉన్నది. పెందోటకు చెందిన శిల్పి, చరిత్రకందిన మొదటి శిల్పి ఆనందుడు. ఇతడు గౌతమీపుత్ర శ్రీశాతకర్ణి ఆస్థాన శిల్పి. రెండవ మహాశిల్పి పెందోటకు చెందినవాడు బోధిసత్వ నాగార్జునాచార్యులు.

శాతవాహన శిల్పాలలో ప్రసిద్ధినందినది అమరావతీ స్తూపం. ఇది క్రీ.పూ. 200 సం. నుండి క్రీ.వ. 150 వరకు వన్నెలు చిన్నెలు సమకూర్చుకొన్నది. అమరావతి శిల్పాలు రాతిలో కవితలు అని కొందరు వర్ణించారు. అమరావతి శిల్పఫలకంలో ఒక చోట స్త్రీ బుద్ధుని ఆరాధిస్తున్నట్లు, మరొక దానిలో అలంకరణ చేసుకొన్నట్లు ఉన్న శిల్పాలు చాలా ప్రఖ్యాతి గాంచాయి. అలంకరణ శిల్పం ఘంటసాల, నాగార్జునకొండ, ఉగమ్మడిదుర్రు, గోలి మున్నగుచోట్ల బహురమ్యంగా కనిపిస్తుంది. ఈ అమరావతి స్తూపంలో నాగ ప్రతిమలు, యక్షీ, యక్షమూర్తులు, పద్మచిత్రములు, (బుద్ధుని జననం) మహాభి నిష్క్రమణము, (బుద్ధుడు కపిలవస్తు విడచుట) బోధివృక్షము (జ్ఞానోదయము) ధర్మచక్రము (ధర్మప్రచారము) మహా పరి నిర్వాణము (మరణము)మనకు విశేషంగా గోచరిస్తాయి.

అమరావతీ శిల్పంలో ఆనాటి వస్త్రధారణ పద్ధతులు, కేశాలంకార విధానాలు, నాట్యకళా భంగిమలు, గృహోపకరణాలు విశదమౌతాయి. ధాన్యకటక స్తూప నిర్మాత బోధిసత్వ నాగార్జునాచార్యులు. అమరావతీ శిల్పకళను గ్రీకు, గాంధార శిల్పకళ ప్రభావితం చేసిందని కొందరు చెబుతారు. గ్రీకు-గాంధార శిల్పంలోజీవకళ తక్కువ, బాహ్యసౌందర్యపు తీరు ఎక్కువ. ఆంధ్రశిల్పంలో ఆత్మసౌందర్యం రసభావ లావణ్య చిత్రణలు ఎక్కువ.

భారత దేశంలో వెలసిన శిల్పశైలులలో ఆంధ్రశిల్ప శైలి లేదా అమరావతీ శైలి ఒకటి అని ఇ.బి. హావెల్ మొదలైన పాశ్చాత్య కళా విదులు కళావిమర్శకులు, ఆనందకుమార స్వామి, గంగూలీ, అడివి బాపిరాజు మొదలైన ప్రాచ్యశిల్పకళా విమర్శకులు సుస్పష్టం చేశారు.

శాతవాహన శిల్పాలు రెండు విధాలుగా ఉన్నాయి. మొదటివి క్రీస్తు పూర్వానివి. ఈ శిల్పాలలో ఆడంబరాలు, ఆభరణాలు మనకు కనిపించవు. అవి సాదాగా ఉంటాయి. ఇవి అమరావతి, జగ్గయ్యపేట, కార్లీ, నాసిక్ మొదలైన చోట్ల కనిపిస్తాయి. రెండవ తెగని క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందినవి. ఇందులో కదపుష్టి, బలం, సౌకమార్యం గోచరిస్తాయి. ఇవి కార్లీ, నాసిక్, జగ్గయ్యపేట, గుంటుపల్లి మొదలైన చోట్ల లభించాయి.

గుహాలయాల నిర్మాణం శాతవాహనాంధ్రులు ప్రారంభించినవే. అజంతా గుహలలో 9,10 సఖ్య గుహలు, కార్లీ, నాసిక్, నానాఘాట్ గుహాలయాలు, ఔరంగాబాదు గుహాలయాలు శాతవాహనుల కాలంలో నిర్మింపబడినవి.

చిత్తూరు జిల్లాలోని గుడిమల్లంలో పరశురామేశ్వరాలయంలోని పరశురామేశ్వర లింగం శాతవాహనుల నాటి నిర్మాణమే. ఇక్కడ లింగాకృతిలో పురుషమూర్తి చెక్కబడింది. ఇది క్రీ.పూ. 1,2 శతాబ్దాల నాటిది. శాతవాహనులు నాటి లింగాకృతికి మాత్రం ఇది ఒక చిహ్నమని భావించ వచ్చు.

అమరావతి తరువాత నాగార్జున కొండ శిల్పం వన్నెకెక్కింది. శాతవాహనులకు సామంతులైన ఇక్ష్వాకుల కాలంలో నాగార్జున కొండ శిల్పారామంగా విలసిల్లింది. రాజులు యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించగా అతఃపుర స్త్రీలు బౌద్ధమతాన్ని ఆదరించి స్తూపాలు, చైత్యాలు, బౌద్ధ విహారాలు నిర్మించారు. అమరావతి శిల్పాలు నాగార్జున కొండలో కూడా కనిపిస్తాయి. ఒక సుందరి తన ప్రియునకు మధుపాత్ర అందిస్తున్నట్లు, ప్రణయ స్థితిలో ఒక మిధునాన్ని, సుందరి ఎడమ మణికట్టుపై ఒక చిలుక ఉన్నట్లు శిల్పించిన ఆ చిత్రాలు నేత్రానందాన్ని కలిగిస్తాయి.

పల్లవుల శిల్పాలు పౌరాణికములు. ఇవి గుహాలయాలు, రాతి రథాలు, దేవాలయాల రూపాలలో ఉన్నాయి. మహాబలిపురంలో పాండవుల రథాలు, సముద్రతీర దేవాలయం, కంచిలో కైలాసనాథ దేవాలయం, భైరవుని కోనలో గుహాలయాలు ఉన్నవి.

బాదామి చాళుక్యుల దేవాలయాలు బాదామి కొండపై శివాలయం, అలంపురంలో నవబ్రహ్మ దేవాలయాలు, విగ్రహ శిల్పాలైన మహిషాసురమర్దనులు, నటరాజు మొదలైనవి ఉన్నాయి.

విష్ణుకుండినులకు సంబంధించి బెజవాడ దగ్గరి మొగల్రాజపురంలోను, ఉండవల్లిలోను పౌరాణికాంశాలకు సంబంధించిన గుహాలయాలు ఉన్నవి. ఉండవల్లి గుహలలో నరసింహమూర్తి, గోవర్ధనధారి కృష్ణుడు అనంతశయనమూర్తి, మొదలైన పౌరాణిక శిల్పాలున్నాయి. ఇవి మాధవవర్మకాలానికి చెందినవి.

తూర్పు చాళుక్యులకు సంబంధించిన శిల్పాలు. దక్షారామము, పాలకొల్లు, గుణుపూడి భీమవరం, కోటిపల్లి, ర్యాలి, రాజమహేంద్రవరం మున్నగుచోట్లలో ఉన్నాయి. బిక్కవోలు (తూ.గో. జిల్లా)లోని గోలింగేశ్వరాదుల ఆలయ శిల్పాలు ఉన్నాయి. సింహాచలంలోని శ్రీ వరాహ నృసింహాలయం, దశావతారాలు, 33 రకాలు నరసింహ మూర్తులు ఉన్నాయి.

కాకతీయ శిల్పం ప్రఖ్యాతినందింది. గణపతిదేవుడు, రుద్రమదేవి, రెండవ ప్రతాపరుద్రుల కాలంలో వరంగల్లు, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవాలయాలు కాకతీయుల కాలంలో వన్నెకెక్కాయి. పిల్లలమర్రి, పాలంపేట (రామప్పదేవాయలం) వరంగల్లు, హనుమకొండలలో నిర్మింపబడిన కాకతీయుల దేవాలయాలు ఎంతో ఖ్యాతి నార్జించాయి. గతిశీలత కాకతీయశిల్పం యొక్క ప్రధాన లక్షణం. కాకతీయ శిల్పాలు నల్లరాతితో చేయబడ్డాయి. దేవుళ్లు, దేవతలు, పురుషులు, స్త్రీలు, నృత్యాలు, అలంకరణ, నగిషీలు కాకతీయ శిల్పాలలో మనోహరంగా గోచరిస్తాయి. కాకతీయ శిల్పం వస్తువులోను, నిర్మాణంలోను మార్గశిల్పం. దేశీయ శిల్పాల సరసన సమ్మేళనం, సమన్వయం అని చెప్పాలి.

కాకతీయుల తరువాత విజయనగర రాజుల కాలంలో నున్న శిల్పం ప్రఖ్యాతిగాంచింది. కాకతీయ శిల్పం మార్దవానికి ప్రతీకయైతే అమరావతి, నాగార్జునకొండ శిల్పాలు భావాభివ్యక్తి కలవి యైతే విజయనగర శిల్పం బలాన్ని ప్రదర్శించే గొప్ప ఆకారాలు కలిగిన శిల్పాలు. విరూపాక్ష దేవాలయం, హజారారామస్వామి దేవాలయం, ఉగ్రనరసింహ స్వామి విగ్రహాలు శక్తినీ, గాంభీర్యాన్ని ప్రదర్శిస్తాయి.

తెలుగులో కావ్యరచన నన్నయ భట్టు మహాభారత అనువాదంతో ప్రారంభమయ్యింది. అందులో సభాపర్వంలో మయసభను గూర్చిన ప్రస్థావన ఉన్నది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో శిల్పకథ గురించిన విషయము నన్నయ గారి భారతంతో ప్రారంభమయ్యిందని చెప్పవచ్చును. తరువాత పలువురు తెలుగు కవులు శిల్పమును గూర్చి వారి వారి కావ్యాలలో గద్య, పద్యాలు రూపంలో తెలిపియున్నారు.

మయసభ:

అగ్ని దేవుడు ఖాండవ వనాన్ని దహించినపుడు అచట నున్న మయుడు అర్జుని వద్దకు వచ్చి తనను రక్షించుమని కోరగా అర్జునుడు అతనిని రక్షించినాడు. దానికి ప్రతి ఫలంగా మయుడు అర్జునుని "నీకు ఇష్టమైన దేదో చేయాలని నాకు కోరికగా ఉన్నదనీ, నేను దానవ శిల్పిని వివిధ కళలో నేర్పరిని, మీ కిష్టమైన దాన్ని నిర్మించి ఇస్తాను, ఆజ్ఞాపించండి అని మయుడు అర్జునుని అడిగాడు. అప్పుడు అర్జునులు శ్రీకృష్ణుని ముఖం వైపు కూచి ఆజ్ఞాపించండి అనగా శ్రీకృష్ణుడు మయునితో నీ శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా ఒక మహాసభను నిర్మించి తీసుకొని రమ్మని చెప్పాడు. ఆ సందర్భంలోని పద్యము:

చం॥ కురుపతికిన్ యుదిష్ఠిరునకున్ సకల క్షితిపాలసేవ్యసు
స్థిర విభవాభిరామున కతి ప్రమదంబుగ రత్నరాజి సుం
దరమగుదాని నొక్క సభ ధాత్రి కపూర్వముగా నొనర్చి చె
చ్చెర గొని రమ్ము నీదయిన శిల్పకలాకుశలత్వమేర్పడన్"

(శ్రీ మదాంధ్ర మహాభారతము సభా పర్వము. ప్రథమాశ్వాసము పద్యము-5).

(తాత్పర్యం : ధర్మరాజు కురువంశ ప్రభువు. అంతేకాదు, అందరు రాజులు సేవించదగిన శాశ్వత వైభవంతో విరాజిల్లే ప్రభువు. అలాంటి ధర్మరాజుకు ఆనందదాయకంగా, నానా విధ రత్న సమూహాలతో అందంగా లోకానికే అపూర్వంగా నీ శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనంగా ఒక మహాసభను నిర్మించి వెంటనే తీసికొని రావలసినదని కోరడమైనది).

దానినిపై మయుడు శ్రీకృష్ణునితో ఈ విధంగా పలికాడు.

ఉ॥ ఇమ్మనుజేంద్రుడింద్ర దనుజేంద్రులకంటె మహా విలాస సౌ
ఖ్యమ్ములఁ బెద్దయిద్ధరణిఁ గావున, నీతని పేర్మికిం దగన్
నెమ్మినొనర్చెదన్ సభ మణి ప్రభ నొప్పగ, దేవతా విమా
నమ్ములు నిట్టివేయని, జనమ్ములు దానిని మెచ్చి చూడగన్"

(సభా పర్వము ప్రథమాశ్వాసము - పద్యం 7)

(తాత్పర్యం: వైభవంలో భోగానుభవంలో, దేవేంద్ర, రాక్షసేంద్రుల కంటె మనుజేంద్రుడైన ధర్మరాజే ఈ ధరమీద మిన్న. ఆయన గొప్పదనానికి తగ్గట్లు, దేవతల

మేడలైనా ఇంత బాగుంటాయి అని జనులంతా దానినే మెచ్చి చూచేటట్టు, మణుల కాంతితో మెరిసే ఒక మహా సభను నిర్మించి ఇస్తాను)

పిమ్మట మయుడు పూర్వము వృషపర్వుడను రాక్షస రాజుకు ఒక సభను నిర్మించుటకు బిందుసరం అనే సరోవరంలో భద్రపరచిన సామగ్రిని ఉపయోగించి చిత్ర, విచిత్రమైన సభను నిర్మించి ఇస్తానని దానిని ధర్మరాజుకు బహూకరిస్తానని చెప్పి ఈశాన్య దిశగా ప్రయానించి కైలాస పర్వతానికి ఉత్తరాన మైనాక పర్వతం మీది హరిణ్య శిఖరాన్ని చేరుకొన్నాడు. భౌమాదిత్యుడనే రాజర్షి తన దగ్గర ఉంచిన గదా శంఖాలు గద భీమునకు, దేవదత్త శంఖాన్ని అర్జునకు ఇస్తానని మయుడు చెప్పాడు.

మయుడు నిర్మల మణిమయమైన దూలాలతో, స్తంభాలతో, గోడలతో అరుగులతో, రాతి కట్టడపు ప్రదేశాలతో, ప్రహరీ గోడలతో ఎంతో అందమైన సభను నిర్మించాడు.

ఆ సభ – ఇంద్రనీలమణుల కిరణాలనే నీళ్ళతో, పద్మరాగ మణులతో చెక్కిన ఎర్రని పద్మాలతో, వెండితో చేసిన తెల్లతామరలతో, రాజహంసలతో మేలిమి బంగారుతో పోతపోసిన తాబేళ్ళతో, మనోహర వైడూర్యాలతో మలచిన కలువలతో, వజ్రాలతో చేసిన చేపలతో, ముత్యాలతో కల్పించిన క్రొంగొత్త నురుగులతో, మరకతాలతో రూపొందిన నాచులతో ప్రకాశించే మణిమయ ప్రదేశాలు చూచి అవి నీటి మడుగులని – స్ఫటికపురాళ్ళ గోడల కాంతులు కప్పడం చేత నీళ్ళుండే చోట్లను చూచి నీళ్ళులేని చోట్లనీ జనులు భ్రమపడేటట్లుగా మయుడు సభను నిర్మించాడు. మయుడు ఈ సభను బిందుసరం దగ్గర 14 నెలలు పరిశ్రమించి నిర్మించాడు. పెద్ద శరీరాలతో అమిత వేగంతో అత్యధిక బలంతో ఆకాశాన సంచరించే ఎనిమిది వేల మంది రాక్షస భటుల చేత ఆ భవనాన్ని మోయించి తెచ్చి ధర్మరాజుకు ఇచ్చాడు. భీమునికి గద, అర్జునునకి దేవదత్త శంఖాన్ని మయుడు అందించాడు. మయుణ్ణి ధర్మరాజు సన్మానించాడు.

ఒక రోజు దుర్యోధనుడు మయసభ అపూర్వ సౌందర్యాన్ని చూచుటకు అందు ప్రవేశించాడు. సభ తిరిగి చూడడం ప్రారంభించాడు. ఒక చోట తెరచిన ద్వారాన్ని మూసిన దానినిగా తలచి ముందుకు వెళ్లక వెనుదిరిగాడు. మరొక చోట మూసిన ద్వారాన్ని తెరచిన దానినిగా తలచి ముందుకు పోబోయి నొసలు కొట్టుకొన్నాడు. సమతల ప్రదేశాన్ని ఎత్తైన స్థలంగా తలచి ఎక్కబోయాడు. ఒక చోట నీలపు రాళ్ల కాంతులు కప్పిన మణిమయ ప్రదేశాన్ని నీటి మడుగుగా భ్రమించి కట్టుకొన్న బట్టలు ఎగబట్టుకొని నడిచాడు. మరొక చోట స్ఫటికపు రాళ్ళ కాంతులు కప్పిన నీటి మడుగును నేలగా తలచి ముందుకు నడిచి కట్టుబట్టలు తడుపుకొని వెనుదిరిగాడు.

ఆ అద్భుతమైన మయసభను చూచి దుర్యోధనుడు విచారము పొందగా ఎందుకు విచారము పొందుచున్నావని శకుని అడుగగా ఈ విధంగా పలికాడు.

ఉ॥ నీవును జూచి, తట్టి సభనేని వినంబడ దేయుగంబులన్;
భూ వలయంబులో నది యపూర్వము సర్వమనోజ్ఞమిష్టభో
గావహ మేక్రియం బడసెనయ్య? మహాత్ముడు దాన నేమి!
సంభావిత భాగ్యుడ్యైను బ్రభాకర తేజుఁడు ధర్మజుండిన్.

(సభాపర్వము - ద్వితీయాశ్వాసము 95వ పద్యము)

(తాత్పర్యం : నీవు (శకుని) కూడా చూచావుకదా! ఏ యుగంలో కూడా అలాంటి సభ ఉన్నట్లే వినలేదు. భూ మండలంలో అది అపూర్వం. అన్ని విధాల రమణీయం కోరిన సుఖాలన్నీ ఇచ్చే సభను, ఆ మహాత్ముడు ధర్మరాజు ఏవిధంగా పొందాడో కదా! సూర్యతేజుడైన ధర్మరాజు దాన్ని పొంది ఈ లోకంలో ఎంత గౌరవం పొందిన భాగ్యం కలవాడయ్యాడు!)

ద్రౌపది వివాహ సమయమున ద్రుపద రాజు యొక్క కళ్యాణ మంటపము ఈ విధంగా వర్ణింపబడింది:

"నిరంతర క్రముక కదళీ స్తంబ శుంభత్సంభృత నవామ్లాశ్వత్థ పల్లవ మూలాలంకృత ద్వారా తోరణంబులకు జందనోదక సంసిక్త ప్రాంగణ రంగవల్లీ కృత కర్పూర మౌక్తిక ప్రకరంబులను, గౌతు కోత్సవ మంగళ శృంగార వారాంగనా ప్రవర్త్యమాన స్వనియోగ కృత్యంబులను, నుత్సవ సందర్శనాగతానేక రాజన్య సుహృద్బాంధవ బ్రాహ్మణ సంకులంబుననుంజేసి యొప్పుచున్న ద్రుపద రాజ మందిరంబునం బూర్వోత్తర దిగ్భాగంబున విచిత్ర నేత్ర వితత వితాన ముక్తమౌక్తిక కుసుమ మూలాలంబ నాభిరామంబును సమీచీన చీనాంశుక విరచిత స్తంభ వేష్టనంబును, బ్రత్యగ్ర పల్లవ శాల్య క్షతాంచిత కాంచన పూర్ణకలశోప శోభితంబును లాజాజ్య సంపూర్ణ సౌవర్ణ పాత్ర నవ సౌరభ బహు విధ పుష్ప సమిత్కుశాశ్మ శమ్యాభి రమ్యంబును నవ గోమయ శ్యామ మరకత మణి ప్రభా పటల విలిప్త హిరణ్మయ వేదీమధ్య సమిద్ధాగ్ని కుండ మండి తంబును సర్వాలంకార సుందరంబు నయిన వివాహంటపంబునకు కుంజని ... (1-7-283)

శ్రీనాథుడు:

శ్రీనాథుడు రచించిచిన భీమేశ్వర పురాణములో పలు పుణ్యక్షేత్రములు దేవాలయాలు ఉన్నాయి. శ్రీనాథుడు పంచారామాలలో దక్షారామము, కుమారామము,

సోమారామము, క్షీరారామము, అమరారామము, కోవెపల్లి సోమేశ్వరుడు, రాజమహేంద్రవర మార్కండేయ స్వామి, పట్టిసము వీరభద్రుడు, పిఠాపురమునందలి కుక్కుటేశ్వర స్వామి, సర్పవర భావనారాయణ స్వామి, తాపేశ్వరము సంగమేశ్వరుడు, పలివెల ఈశ్వరుడు, మొదలైన దేవాలయములు పేర్కొనబడ్డాయి.

బెండపూడి అన్నమంత్రి (వేమ, వీరభద్రారెడ్డిల మంత్రి) ధార్మిక కీత్యములు. శ్రీనాధుడు భీమాశ్వర పురానములో ఈ విధముగా వివరించినాడు

సీ ॥ రాజమహేంద్ర దుర్గమున గావించ శ్రీ
వీరభద్రునకుఁ బ్రాకార లేఖ
నిలిపె మార్కండేయ నీలకంఠుని మ్రోల
రామేశుఁ దమ తల్లి నామకముగ
సంగమేశ్వర ద్విశంభు లింగమునకుఁ
గల్పించెఁ గళ్యాణ గర్భ గృహము
దక్షవాటిక యందుఁ దరుణేందు మౌళికి
మొగలి వాకిట ధామమును ధరించె
బ్రాగ్దిశా వప్రగోపుర ప్రాంగణమున
సప్తముని సింధు సోపాన సరణికేలనఁ
దీర్చె భవనంబు భీమయదేవునగర
మంత్రి దేవయ యన్నయామాత్యవరుడు 1-76

శ్రీనాధుని కాలము నాటి భీమేశ్వరుని విభవము ఈ పద్యమున తెలుపబడినది.

సీ॥ ఒకవేళ దరియించు యవనాశ్వుఁడిచ్చిన
కట్టాని ముత్యాల కంఠమాల
మాంధాతృఁడిచ్చిన మానిక్య కచితకే
యూరంబు ధరియించు నొక్కవేళ
ఘన చక్రవర్తి యిచ్చిన ప్రవాళంబుల
యొడ్డాణము ధరించు నొక్కవేళ
వేడ్కధరియించు నొక్కొకవేళయందు
భరత దుష్యంతరంతి నాభాగానహుష

నల భగీరథ నృగ మహేనాథదత్త

హేమమణి భూషముల భీమేశ్వరుండు

-భీమఖండము 1-117

శృంగార నైషధ కావ్యంలో - నలునకు - మామ (భీమరాజు) మాణిక్యముల పెట్టెను బహూకరించిన సందర్భములోని పద్యము

"మలచి యే కాండముగ నొక్క మానికయిన

వేడ్క నెద్దామని నిర్మించె విశ్వకర్మ

యట్టి దేవేంద్రదత్త మహోర్ఘనూత్న (తాంబూలపు పెట్టె)

వీటికాపేటి మామ భూ విభునకొసగె॥ 6-98

తాత్పర్యం అతుకులులేని ఒక మాణిక్య పుత్రాంబూలపుపెట్టెను వేడ్కతో విశ్వకర్మ తయారు చేసి దేవేంద్రున కీయగా దానిని దమయంతి స్వయం వరసమయములో భీమరాజు కీయగా ఆయన తన అల్లుడైన నలునకు కానుకగా యిచ్చాడు.

మనుచరిత్ర:

అలంపురములోని విశ్వబ్రహ్మదేవాలయ గోడపైన గంగావతరణము శిల్పము క్రింద వరూధినీ ప్రవరాఖ్యుల గాథ చిత్రతమైనది. ఇది పెద్దనగారి మనుచరిత్ర రచన ప్రేరకమైనదని కొందరి భావన.

ప్రాంచద్భూషణ బహుమూలరుచితోఁ బాలిండ్లు పొంగారఁ బై

యంచుల్ మోనఁగ్రఁ గౌగిలించి యధరం బాసింప 'హా! శ్రీహరీ'

యంచున్ బ్రాహ్మణు డోరమోమిడి తదీయాంస ద్వయం బంటి పో

మ్మంచున్ ద్రోచెఁ గలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్"

(మను చరిత్ర - ద్వితీయాశ్వాసము - 68వ పద్యం)

కళా పూర్ణోదయము:

కాలకలాదు డింతయును గాంచన రేణువు ప్రత్యగాశనాఁ

గ్రోలెడు క్రోవి గూర్చి కరగంగఁ బ్రర్ధన మొందు జాళువార

మేలిమి పూదెనాఁబొలుపు మీఱె నినుం,డదిగాక, యార్ప గీ

లాల నిమజ్జితం బయిని లాగున॥ గ్రుంకెను బశ్చిమాంబుధిన్॥

(కళా పూర్ణోదయము - అష్టమాశ్వాసము 9వ పద్యము 413 పుట)

(భావము : సూర్యాస్థమయ సమయమున పడమటి దిక్కుననున్న సూర్యుని కాంతి స్వర్ణశిల్పి చేతిలోని బంగారపు రేణువుల (రజము) వలెనున్నది. దానిని కాలమను శిల్పి ఆ రేణువును ముద్దగా చేయడానికి (పూజ) పడమటి దిక్కు అనే మూసలో పెట్టి కరిగించాడు. అప్పుడు ఏర్పడిన బంగారపు ముద్దవలె సూర్యబింబము ఎఱ్ఱగా కనిపిస్తున్నది. ఆ ముద్దను చల్లార్చడం కోసం శిల్పి నీటిలో ముంచినట్లుగా ఆ సూర్యబింబము పడమటి సముద్రములోనికి కృంగింది.

నిరంకుశోపాఖ్యానము:

కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానంలో తన రత్న పరీక్షా శాస్త్రపటిమ వ్యక్తమయ్యేటట్టు పురవర్ణన (మణిపురము) లోకోత్తరంగా చేశాడు.

సీ॥ వైడూర్య కల్పిత ద్వారా దీప్తులు పుష్య
రాగ కవాటజ ప్రభలఁ బెనుప
మరకత కుడ్యసంపాత దీధితి మహా
నీలవేదిశ్రీకి నెనరుఁ జూపఁ
బద్మరాగోజ్జ్వల ప్రాసాద రుచి విద్రు
మస్తంభ కాంతుల మమతఁ బ్రోవ
వజ్రకుట్టిమ శోభ వరమౌక్తిక స్యంద
నచ్ఛాయ కే ప్రొద్దు నట్టు సేయ
తే॥ దీప్రగోపుర గోమేధిక ప్రకాశ
మనుదినంబును దనకుఁ దోడభిలషించు
నిఖిల మణి సంపదలు నందు నెరయు కతన
మణిపురం బంద్రు దాని నామము నృపాల.

(– నిరంకుశోపాఖ్యానము – ప్రథమాశ్వాసము – 45వ పద్యము)

(భావము : నవరత్నమయమైన ఆ పట్టణంలోని మేడల యొక్క ద్వారబంధములు వైడూర్యములతో చేయబడి ప్రకాశించుచూ పుష్యరాగములచే నిర్మింపబడిన తులుపుల యొక్క కాంతులను వృద్ధి చేయుచున్నవి. గరుడ పచ్చలతో చిత్రించిన గోడల యొక్క శోభ ఇంద్ర నీలములతో అమర్చబడిన అరుగుల తేజమును పెంపొందించు చున్నవి. పద్మరాగములతో సృజింపబడిన రాజ భవనముల యొక్క దీప్తి పగడపు స్తంభముల యొక్క

కాంతులను అభివృద్ధి చేయుచున్నది. వజ్రములతో రచింమపబడిన శిరోగృహముల ప్రకాశవమే ముత్యపు తేరుల యొక్క తేజమును అతిశయింప జేయుచున్నది. పట్టణ ద్వారముల నున్న గోమేధికములు నిజగుణముతోనే విరాజిల్లు చున్నవి. ఇట్లు నవరత్నములచేత ఒప్పుచుండుటచే ఆ పురము మణిపురము అని పిలువసాగిరి).

రత్నశాస్త్రము యొక్క రహస్యము తెలిసిన వాడు కనుక రుద్రకవి వైడూర్యములు, పుష్యరాగములు ఒక చోట ఉంటే కాంతి ద్విగుణీకృతమౌతుంది. అదే విధంగా మరకతాలు, నీలాలు ఒక చోట, పద్దరాగాలు పగడాలు (విద్రుమాలు) ఒకచోట వజ్రాలు, మౌక్తికాలు ఒకచోట ఉంటే కాంతులు ద్విగుణీకృతము లౌతాయి. రుద్రకవి రచనలో స్వభావోక్తి స్ఫుటంగా కనిపిస్తుంది. కావ్యాన్ని కౌశిక వృత్తాలలో రచించాడు. యక్షగాన కవితా పితామహుడు రుద్రకవి.

కాశీఖండము

తే॥గీ॥ కలిగెఁ బదియాఱువన్నె బంగారమునకుఁ
బద్మరాగంబు తోడి సంపర్కలబ్ధి
కాశీకాఖండ మను మహాగ్రంథమునకు
నాయకుడు వీరభద్ర భూనాథుఁడగుట

(–కాశీఖండము – పీఠిక 17వ పద్యము)

(భావము : కాశీఖండము అను మహాగ్రంథమునకు అల్లాడ వీరభద్రా రెడ్డి కృతి భర్త అవ్వడం ఏ విధంగా ఉన్నదంటే పదహారు వన్నెల బంగారానికి పద్మరాగము (మాణిక్యము – కెంపు)తో సంపర్కము పొందినట్లున్నది)

ఇక్కడ కాశీఖండము పదహారు వన్నెల బంగారముగా నున్నది. దానిని వీరభద్రా రెడ్డి కృతి భర్తగా స్వీకరించడం పదహారు వన్నెల బంగారానికి మాణిక్యముతో సంపర్కము కలిగినట్లున్నది అని శ్రీనాధుడు చక్కగా పలికాడు.

రాజశేఖర చరిత్రము:

మాదయ్యగారి మల్లన రచించిన రాజశేఖర చరిత్రమున పెండ్లి యైన పిమ్మట నాగవల్లి సమయమున నవరత్నములతో ఆలంకరణ – ముగ్గు పెట్టిన సమయములోని పద్యము:

సీ॥ ఆణిముత్తియము లొక్కంతగా నొండొండ
మేలేర్చి, నిండారఁగీలు కొలిపి
నేలలేని ప్రాతిపచ్చలు దెచ్చి దోయిళ్ళ
నించి, దట్టంబుగా నెఱపి నెఱపి
నెఱరంగు గల జాతి నీలాలు గుదిగ్రుచ్చి
యేనుగన్ చక్కగా నేర్పరించి
యెదిరి కన్గొనరాని ముదురుఁ గెంపులు వోసి,
తెఱపిఁగానికలు క్రిక్కిరియఁ బఱపి

గీ॥ కలయఁ జొక్కంపు గోమేధికములు నింపి
పంచవన్నెలు మ్రుగ్గురు పరిఢవిల్ల
బ్రోలు దీర్చిరి, చూడ్కి కింపులు ఘటింపఁ
బడఁతు లత్తరి బసిడి కీల్ప్రతిమలనగ

(–రాజశేఖర చరిత్ర–తృతీయాశ్వాసము–175వ పద్యము)

"తెలంగాణ మాండలికం"

–డా॥మలయశ్రీ

ఏనాటిది మన తెలుగు? రెండువేలేండ్లది! వెయ్యేండ్లది మన కావ్య సాహిత్యం. ఎంతో సుందరమైనది మన తెలుగు భాష.

"ద్రవిడ మూల భాషను జనియించి
సంస్కృతమున సారమును గ్రహించి
అనిన రసనలను వినిన వీనులను
తనియించే తీయని మన తెనుగే – అమృతము॥"

ఓ వెయ్యేండ్లు రాజ సన్మానం పొందినది పద్యకవిత్వం. అది వందేండ్ల నుంచి ఆధునికత పేరున గేయమై, వచన కవిత్వమై, క్రమంగా గద్యంగా మారిపోతున్నది. "దేశ భాషలందు తెలుగు లెస్స" అని నుతులందుకున్న మన మాతృభాష తెలుగు ఇప్పుడు ఆంగ్ల మాధ్యమం చదువుల ముందు వెలవెలపోతున్నది. అదీ మన దేశం స్వతంత్రం పొందిన తర్వాతనే. విదేశాల ఉద్యోగాల ఆశతోని పరభాషా వ్యామోహం పెరిగి పోయింది. అదీ ఓ పదిరవై యేడ్లనుంచి ఈ విధానం మరీ ఎక్కువైంది. ఇది ఇట్లనే కొనసాగితే క్రమంగా ఈ మన తెలుగుభాష అంతర్ధానమై పోయే పరిస్థితి వస్తుందనే భయం మన మాతృభాషాభిమానులకు ఏర్పడింది. మాతృభాషా పరిరక్షణోద్యమాలు కూడా మొదలైనవి. అది అవసరం కూడా. ఎందుకంటే

"అమ్మపాలవంటి తీపి
ఆవుపాలకంటె తీపి
అపురూపమైన తీపి మాతృభాషది
అదే మన తెలుగుది –
మన తెలుగు మధురమైనది
మనమెపుడు మరువరానిది
అంటే ఆనందమైతది

వింటే సంగీతమైతది
పరభాషలపై వ్యామోహం పనికిరానిది
స్వభాషాభిమానమె మనకు సరియైనది,
పరభాషలపై వ్యామోహం పరిమితం హితం
స్వభాషాభిమానమె మనకు ఉంటే సమ్మతం॥

"తెలుగదేల యన్న దేశంబు తెలుగేను!" అది మన తల్లి పలుకు మన నుడికడలి. మన భావ సంపద నిక్షిప్తమైన వాఙ్మయనిధి! ఇంటా బయట ఇంచుమించు పదిహేను కోట్ల మందిమి తెలుగు మాట్లాడే వాళ్ళం ఉన్నం. భారతదేశంల దీనిది రెండవ స్థానం, ప్రపంచంల పదిలోపు. మన భాషను కాపాడుకుందాం. భాషతో పాటు మన తెలుగు మాండలికాలనూ కాపాడుకుందాం.

తెలుగుభాషా భేదాలు :

గ్రాంథికం, వ్యావహారికం, గ్రామ్యం - అని ఇది మూడు రకాలు. జానపద వాఙ్మయాన్ని మధుర కవితలను పక్కకు పెడితే, తెలుగు సాహిత్యరంగాన నన్నయ నుంచి చిన్నయ దాక గ్రాంథిక భాషదే పెత్తనం సాగింది. అయితే ఆ భాష ఏనాడూ జనవ్యవహారంల లేదు. కావ్యరచనకు తప్ప కవి పండితులైనా గ్రాంథిక భాషల మాట్లాడి ఉండరు. గ్రంథ రచనకు మాత్రమే ఉపయోగించేది కనుక దానికి 'గ్రాంథిక భాష' అని పేరు వచ్చింది. ఇది నిజం. అందుకు మన నాటి శాసనాలు, పలు దేశికవితలు నిదర్శనం.

విద్యావంతులు మాట్లాడేది వ్యావహారిక భాష. చదువుకోని శ్రామిక జనం మాట్లాడేది గ్రామ్యం.

ఈ వ్యావహారిక భాషా వాదం మొదలైంది అంతా వందేళ్ళ నుంచే. 19వ శతాబ్ది చివర గిడుగు రామమూర్తిగారు అందుకు పూనుకున్నారు. దాన్ని బలపరచి రచనలు చేసింది గురజాడ అప్పారావుగారు.

గ్రాంధిక భాష వ్యాప్తియందున్న కాలాన నన్నయ, తిక్కన, నన్నెచోడ, సోమన, శ్రీనాథ, పోతన... మొ॥ అన్ని -ప్రాంతాల మన తెలుగు కవులకు - కావ్యాలకు సమానాదరం లభించింది. ఈ వ్యావహారిక భాషావాదంతోనే కోస్తామాండలికం అందలమెక్కి, తెలంగాణ మాండలికం నిరాదరణకు గురి అయ్యింది.

20వ, శతాబ్ది మధ్యకాలం వరకు దాదాపుగా ఇక్కడి పత్రికలు పుస్తకాలు అన్నీ గ్రాంధిక భాషవే. నైజాం విముక్తికి (1948) పూర్వం ఇక్కడ పట్టికోట ఆళ్వారు స్వామి

నవలలు, మన మాజీ ప్రధాని కీ.శే. పి.వి. నరసింహారావుగారి 'రామి' కథ మొ॥ కొందరి రచనలు ఈ మాండలికంల వచ్చినై.

ఆంధ్రప్రదేశ్ అవతరణ (1956) తర్వాత సైతం డా॥పి. యశోదారెడ్డి, సురమౌళి, గూడూరి సీతారాం... ఇక్కడి మాండలికంల రచనలు చేసినా, పత్రికల – పబ్లిషర్ల పుణ్యమా అని క్రమంగా అది కనుమరుగై, కోస్తా తెలుగు మాండలికమే విజృంభించింది. అందుకు రాజకీయాధికారమూ తోడయింది. సినిమా – రేడియోలు సహకరించినై.

మాండలిక భాష అంటే ఏమిటి?

ఒకే భాషకు ప్రాంతీయ భేదం మాండలికం. కొన్ని స్థానిక పదాలు. పదాల –క్రియల పలికే ప్రత్యేక రూపాలను మాండలికం అనవచ్చు. మన ఆంధ్రప్రదేశ్ తెలుగుభాషా రూప భేదాలను కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ – మూడు మాండలికాలని పేర్కొన్నా ఇది స్థూల విభజన మాత్రమే. ఉత్తరాంధ్ర, దక్షిణాంధ్ర భాషల మధ్య ఎంతో వ్యత్యాసం ఉన్నది. ఇప్పుడు వ్యాప్తియందున్న పత్రికల వ్యవహార భాష కాళోజీ అన్నట్టు మధ్యకోస్తా మూడు జిల్లాలదే. తొలి పత్రికలు రచయితలు అక్కడినుండి వచ్చి ఆ మాండలికానికే ప్రాచుర్యం లభించి, పాఠ్యపుస్తకాలకు సైతం ఎక్కింది. సినిమాల్ల కూడా అదే. ఇతర ప్రాంతాల మాండలికాలు ముఖ్యంగా తెలంగాణా తెలుగు ఉపేక్షింపబడుతున్నది. కొన్ని సినిమాలు దీన్ని వాడినా అది హాస్యానికి, పనివాళ్ళకు గూండాలకూ వాడుతూ చేసే అపహాస్యానికే.

పత్రికలు అప్పుడప్పుడు ఈ మాండలిక రచనలు కొన్ని ప్రచురిస్తున్నవి. పాఠ్యపుస్తకాలైతే దీన్ని ముటుకుంటూనే లేవు. అబ్బే! అదేం భాష – అనే నిరసన భావమే ప్రవాసాంధ్రులకు ఉంది. ఇక్కడి భాష మాట్లాడేవారంటే వెగటు. ఎందుకిట్లా? తెలంగాణ తెలుగు ఈ మాండలిక భాష మంచిగలేదా!

కోస్తాంధ్ర మాండలికానికి తెలంగాణ మాండలికానికి మధ్య గల కొన్ని ముఖ్యమైన భేదాలు:

స్థానిక – మాండలిక పదాలను వదలితే ఈ రెండు ప్రాంతాల క్రియాపదాల నడుమ చాలా తేడా ఉంది.

వచ్చాడు – కోస్తా, వచ్చినాడు – రాయలసీమ, వచ్చిండు – తెలంగాణ

బహువచనం – వచ్చారు, వచ్చినారు, వచ్చిన్రు/వచ్చింన్రు, వచ్చింది – స్త్రీ వాచకం అందరికీ ఒక్కటే.

సీమ – వచ్చినాడు శిష్టవ్యావహారికం, కోస్తా – వచ్చాడు ఆధునికం, తెలంగాణ – వచ్చిండు అనాగరికమట. ఇందేమి వివక్ష?!

"వచ్చియున్నవాండు వచ్చినాయ్యింది,
వరుసగా వచ్చినడు వచ్చిండు అయ్యింది;
వచ్చాడు మీదెట్ల వచ్చె? ఇంక
వచ్చేసి నాడెట్ల వచ్చె!"

వచ్చియున్న వాండు శాసన భాష. వచ్చినవాడు – ఫల్గుణుడు అని మహాభారత ప్రయోగం. వచ్చినాడు అని రాయలసీమ వ్యవహారం. అది తెలంగాణ పల్లెపాటలలో ఇప్పటికీ ఉంది.

"బావా బల్లెన్నకాదు
రెండు పాలపిట్టలు తెచ్చినాడు"
"ఒక్క వెయ్యి గంధపు చెక్క – ఓ రాసగుమ్మడీ
ఏ రాజు పంపినాడూ–" ఇట్లా.
వచ్చినాడు? అంటే ఇటు ప్రశ్నకూడా.

ఇక, వచ్చినడు వచ్చిండు తెలంగాన క్రియలు. ఇది పద క్రమ పరిణామం. వందనరే అని తొలి ద్రవిడ క్రియా పద రూపం ఇందుల – ఇంద్ల తప్పేముంది? మరి, కోస్తాంధ్ర 'వచ్చాడు' ఎట్లా వచ్చె? వచ్చినాడులోని 'న' ఎగిరిపోయి 'వచ్చాడు' అయ్యింది, అని అంటారు కావచ్చు. అది కాదు అందుకు సరియైన కారణం. అసలు సంగతి ఇది.

నైజాం ఆసఫ్జాహి ముస్లిం పాలకులు రాజకీయ కారణాల వల్ల 18వ, శతాబ్దిల రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలను బ్రిటిస్ వారికి ధారాదత్తం చేసిన్రు కదా. అప్పటినుంచి కోస్త్రాంధ్ర కుంఫిని పాలన క్రింద ఉంది. మద్రాసు రాజధాని. అక్కడి తమిళ భాషా క్రియా పదాల పలుకుబడి ప్రభావంతోని కోస్తా తెలుగు క్రియల రూపాలు మారినై. వందాన్ – వచ్చాను. వందేన్ – వచ్చేను, ఇట్లా. వచ్చేశాను శబ్దపల్లవం హిందీ దేఖ్‌లియావలె.

ఆ అసహజ పదరూపాలు ఒప్పట. సహజంగా మారిన ఇక్కడి క్రియా రూపాలు తప్పట. తప్పని అంటా టేరు. అట్లనే చేస్తున్నరు. పత్రికల్ల ఈ భాష వాడరు. ఇక్కడ భాషల లేఖలు రాసినా అక్కడి భాషల మార్చి ప్రచురిస్తున్నారు. అదీ సంగతి.

ఇక్కడి పల్లెటూళ్ళ భాష ఇక్కడి మాండలికంలనే ఉన్నది బస్తీల్ల ఉంటున్న చదువుకున్నోల్ల భాష మాత్రం కోస్తా యాసకు మారింది. అది నాగరికమట.

ఇక్కడి రచయితలు కొందరు ఈ మాండలికాన్ని అభిమానించి రాస్తున్నా ఏకవచన క్రియ 'వచ్చిందు' వరకు పర్వాలేదు. వచ్చింగ్రు అనే బహువచన క్రియాపద ప్రయోగానికి మాత్రం వెనుకాడుతున్నరు. కొందరు తెలంగాణా కోస్తా మాండలికాల కలగలిపి రాస్తున్నారు. ఎందుకోమరి. బహువచన క్రియ వచ్చింగ్రు మోటుగా ధ్వనిస్తదట. అయితే, వాంగ్రు, తంగ్రి, తీంగ్రము, గాంగ్రించు, ఉంగ్రాళ్ళు, కోడంగ్రు మొ॥ పదాల మాటేమిటి? పైగా – అవి గ్రాంధిక పదాలు కూడా.

ఈ వచ్చింగ్రు పద రూపం, వచ్చిందు అనే ఏక వచన క్రియకు బహువచన ప్రత్యయం 'రు' వచ్చి చేరింది కాదు. అట్లయితే అది 'డు' పోయి 'వచ్చింరు/వచ్చిరు' కావాలె. కాలేదు. వచ్చిర్రు అని ఉన్నా అది ఇక్కడి గ్రామ్యం. వచ్చినరు కుదింపు వచ్చిన్రు. దీని ధ్వని సామ్యత తోని వచ్చింది – వచ్చింగ్రు.

తెలంగాణ మాండలికంల 'లో' తృతియా విభక్తి ప్రత్యయం 'ల' అవుతున్నది. ఇంటిలో ఇంటిల – ఇంట్ల. ఇంక అది 'లె' కూడా అవుతది – అయ్యింది. ఇంట్లె, బండ్లె ఇట్లా.

కోస్తా పదాల దీర్ఘాలు ఇక్కడ లేవు:

ఉ॥ అన్నాడు – అన్నడు, చేశాం– చేసినం, వచ్చాం – వచ్చినం, వస్తున్నాం – వస్తున్నం. ఏక వచనం వస్తున్న. దీన్ని కోస్తావాళ్ళు వస్తున్నా – అని అంటున్నారు. అయితే దానికి వస్తున్నప్పటికీ అనే అర్థం వస్తది కదా. అన్నాడు. అంటే ఇక్కడ ప్రశ్నార్థకం. అన్నడు అంటెనే సరి – భూతకాల వాచి. ఆ+నాడు=ఆన్నాడు అని త్రిక సంధి. అది పండితులే వాడుతులేరు. ఇక సామాన్యులకెక్కడ.

హల్లు స్థానంల అచ్చు

వచ్చు – వచ్చుతది – వస్తది. అది వత్తది కూడా అయింది. అదే ఒత్తది – అత్తది. కోస్తా వ–ఒ అయితే, తెలంగాణల అది అ అయింది.

వచ్చిన + వాడు = వచ్చినాడు, వచ్చినాడు – వచ్చాడు అయినప్పుడు అక్కడ వ, అ–గానే మారింది. అది క్రియా పదం. వచ్చినోడు అంటే వ్యక్తి. ఇది వ – ఒ అయిన పదరూపం. సరే అని వీళ్ళు మొగోడు అంటే, వాళ్ళు అది కాదని మగాడు అనిరి. ఇదేం తిరకాసు? ఆంగ్లంల డైరెక్టును డిరెక్టు, విటమిన్‌ను వైటమిన్ అనాలే అన్నట్టేనా ఇది!

మరో ముఖ్యమైన భేదం టం, డం ల ప్రయోగం

చూచుట, చేయుట మొదలైన పదాలను చూడటం, చేయడం అని కోస్తావాళ్ళు వ్యవహరిస్తే చూసుడు చేసుడు అని తెలంగాణ వాళ్ళు అంటరు. చూట్టం, చూడ్డం అత్యాధునికం. చూసుడు వంటి క్రియా పద రూపాలు బొమ్మకంటి వారి నిఘంటువుల సైతం ఉన్నవి.

కొన్ని సాధారణ పదాల తేడా

1. అనవలయును, అనవలెను, అనవలె – గ్రాంథికం

   అనాలె – తెలంగాణ, అనాలి – అనాల కోస్తా. ఏది సరి. కాస్త ఆలోచించి చెప్పండి.

2. రోడ్ల వెంట పడి, రోడ్ల వెంబడి కి – రోడ్లెంబడి ఇటు, రోడ్లమ్మట అటు

3. ప్రొద్దస్తమానం – అస్తమానూ అట! దాని అర్థమే మారింది. ఆ మ ఆట ఇటు లేదు.

4. –పొద్దు క్రుంకే/కూకే దాక అనే అంటరు. తెలియదు – తెలువదు/ది, తెలీదు అటు

5. బాగుండదు – బాగుండది అని తెలుంగాణ ఉంటే, బాగోదు, బావోదు, బావుండదు అట అటు. ఆలోచించండి సరి రూపాలేవో. బాలేదు కూడా.

ఈ పదాల వ్యుత్పత్తిని చూడండి

1. గోరు(కు) అంటు ఆకు – గోరంటాకు. ఇదే రూపం ఇటుంది. అది, గోరెంటాకు, గోరింటాకు అని కోస్తా పదాలు.

2. గొౝరెంక – శారిక, గొౝరెల వెంబడించి పోయేవని ఆ పదం రావచ్చు. ఇది తెలంగాణల ఆ పిట్ట వాడుక పేరు.

   'చిలుకా గోరెంక, కులికే పకా పకా' పాట

   'చిలుకా గోరువంకల వలె' సామెత.

   గోరెంక, గోరువంక, గోర్వంక కోస్తా పదాలు.

   చిలుక గోళ్ళకంటె వంకర మాత్రం దాని గోళ్ళు ఉండవు.

3. పప్పులు – బేడలు. ఇది రాయలసీమ వాడుక మాట. పావలాకు రెండు బేడలు. ఇది ఒక చిన్న నాణెం. నైజాం ప్రాంతాన హాలీరూపాయలు

(1953) చలామణిల ఉన్న కాలాన వాడబడినవి. ఇప్పుడవి లేవు. కన్నడ భాషల పప్పును బేళె అని అంతారు. అదే పదం సమీప ప్రాంతం కాబట్టి (కర్నాటక) రాయలసీమల వ్యాప్తి అయ్యింది. ళడయోరభేధః

పదాది పరుసాలకు సరళాక్షరాల ప్రయోగం ఇటు లేదు.

గడప, దోవ, బొక్క... అని పత్రిక భాష. వాటిని తెలంగాణ వాళ్ళు కడప, తోవ, పొక్క... అని అంటున్నరు. ద్రుతం తర్వాత వచ్చే పదాది పరుషాలు సరళాలు అవుతవి. ఇది సరళాదేశ సంధి సూత్రం. అయితే అవే సరియైన రూపాలనుకొని విడిగా వాడితే ఎట్లా? త్రోవ – తోవ అయితది గని దోవ కాదు కదా. కడప, పొక్క అంతే. కడప పేర ఒక పట్టణం ఉంది. బొక్క అంటే ఇటు ఎముక. బొమిక నుంచి వచ్చింది. కనుక, కాబట్టి అనే అంటం తప్ప, గనుక, గావున అని వాక్యాలను ఆరంభించుతూ లేమనే నిజాన్ని గ్రహించాలె.

పదాల యాస పలుకుబడి

అద్ది, రొద్ది, జుత్తు, నెప్పి, నుంచుని, కుంకం, శెలవ, వియ్యంకుడు ఇవే ఇప్పుడు బహుళ వ్యాప్తి పొందిన పదాలు. వాటికి సరియైన పదాలు వరుసగా – అద్దె, రొట్టె, జుట్టు, నొప్పి, నిల్చుని, కుంకుమ, సెలవు, వియ్యంపుడు. ఇవే తెలంగాణ వాడుకల ఉన్నవి. మొదటివి కోస్తావి. వక్క అంటే ఒక్కనట. పోక వక్క, వక్క అంటె ముక్క వక్కళ్ళూ – ఒక్కడూ, నాంగోరూ – నాన్నగారు, వక్కలెక్కా చయ్యలేదండీ – ఒక్క లెక్కా చేయలేదని, ఏం భాష ఇది? ఎందుకీ యాసగోస. వంటి – ఒంటాయె. ఒళ్ళు వళ్ళాయె. బడి – వడి. ఇదేం నుడీ – కారం! ఇక ఇప్పటి కాన్వెంటు చదువుల వట్ఛు, పిలట్లా, అనట్లా పదాల వింగడించలేం. ఎటు పోతుందో మన 'టెలుగు'. శకారం శ్మశానంలనే పోయి స్మశానం అయింది. ఆంగ్ల భాషా విధేయులై అసోక, విస్వామిత్ర అని అన వట్టిరి. గణేశ్, సుభాస్ పోయి గణేష్, సుభాష్ ఆయె. ఈ రెండు పేర్లతో సినిమాలు కూడా వచ్చినై. సరత్, శరత్తట! శ ను శె అని అన్నా స – అని మాత్రం ఇటు అనరు. శెకుంతల అని వినిపించినా అసోక అని మాత్రం వినబడదు.

కృతజ్ఞత కృతఘ్నుతా?

జ్ఞ అనే సంయుక్తాక్షర పదాలు కోస్తాంధ్రులకు కొందరికి పలుకరాదట. విజ్ఞానంను విగ్నానం అని అంటున్నరు. అట్లనే రాస్తున్నరు కూడ. ఇది ఇంగ్లీషు భాష వల్ల వచ్చిన తంటా. ఆంగ్లంల అక్షరాలు తక్కువ. అందుకే మన తెలుగు అక్షరాల ధ్వనులన్నీ ఆ భాషల పలుకవు. విజ్ఞానం – Vignanam అనే అనే ఆంగ్లంల రాస్తే, దాన్ని తెలుగు

సంస్కృతం తెలియని వాళ్ళు ఉచ్చరిస్తే 'విగ్నానం' అని. అవునా? అదే మన కోస్తా మిత్రులకు అలవాటు అయినట్లుంది. తమిళ సావాసమాయె.

జ్ఞానం జ్ఞానమే తెలంగాణల. ఆ పదం పలుకరాని ఇక్కడి జానపదులు గ్యానం అంటరు తప్ప గ్నానం అని అనరు. విజ్ఞాననంను విగ్నానం అంనేవాళ్ళు, కృతజ్ఞతను కృతఘ్నత అనే అంటరు మరి – అంటున్నరు. ఎంత భేషో? అర్థమే విలోమం!

అక్క – అప్ప

అటు వలె అక్కను అప్ప అని ఇటు అనరు

అప్పాసెల్లెంద్రు – అప్పాసెల్లెలు (కోస్తా)

అక్కా చెల్లెలు – అక్కాసెల్లె (తెలంగాణ)

ఇంకా – చెల్లి, చెల్లాయి పదాలున్నయ్

ఈ చెల్లి 'చెల్లియొ చెల్లకో' కాదు

'నా చిట్టి చెల్లి, బంగారు తల్లి' చెల్లె.

'చెల్లాయి పెళ్ళికూతురాయెనే'

ఆయి అంటే తల్లి. మరాఠీ పదం. చెల్లాయి అంటే చెల్లె తల్లి – చెల్లె అమ్మ, చెల్లమ్మ అన్నట్టు. అట్లునే అమ్మాయి (అమ్మ+ఆయి) అమ్మతల్లి. దాని ప్రభావంతో వచ్చింది. అబ్బాయి. ఇవి హైదరాబాద్ ముస్లిం పాలనల పుట్టిన పదాలైనా తెలంగాణ కంటే ఆంధ్రప్రాంతంలనే వీటి వాడుక ఎక్కువగా ఉంది.

అక్క – అప్ప ఇట్లయిందో తెలియదు. అప్ప అంటే కర్నాటకల అయ్యా. నిజలింగప్ప ప్రముఖ కాంగ్రెసు నాయకుని పేరు. రామప్ప గుడి వరంగల్ కాకతీయుల కాలపుది. 'కప్పను గని ఫణిరాజు గడ తడ వణికెన్' సమస్యాపూరణం మన పూర్వకవి చేసింది 'వెంకప్ప'ను గని – అనే.

అన్నను అన్నగారు అని గౌరవంగా పిలువకున్నా తెలంగాణ వాళ్ళు, కోస్తాంధ్రుల వలె 'ఒరే అన్నయ్యా' అనే ఘోరానికి మాత్రం పాల్పడరు.

మామా కోడళ్ళ పెళ్ళిల్లూ ఇటులేవు. మేనరికం అంటే మేనమామ కూతురును పెళ్ళి చేసుకొనడు. బావా మరదళ్ళ సరసాలే ఇటు. అక్కడి మామా కోడళ్ళ వలపులొలికించే జానపద – సినిమా పాటలు వింటే ఇక్కడి మామలకు గుండెదడ. కోడండ్లకు గుబులు

కోడలు–లు, కోడంద్రు ఎట్లయ్యిందోగని, వాండు – వాంద్రు, వాండ్లు కూడ అయ్యిందట. రలయోరబేధః. బాలలు – బాలురు. పైదానికిది విలోమ.

బూతుపదాల -ప్రయోగానికి జంకులేదాయె

కొల్లి, బుల్లి, పిచ్చ, బొచ్చు మొ॥ పదాలు కోస్తావాళ్ళు యదేచ్ఛగా వాడుతున్నారు. అవి ఇటు అచ్చమైన బూతు పదాలు. ఇది వారికి పట్టదు – పట్టించుకోరు.

మొదటి పదం 'గొ'తో అంటేనే వాళ్ళకు తప్పట. ఇదీ సరళాదేశమే రెండవది ఉర్దూ మాటని తెలువదేమో. చిన్న అంటే సరిపోతది కదా. మిగిలినవి పిచ్చి, ఉన్ని.

ఉభయ – ప్రాంతాల సమానార్థక పదాలు కొన్ని

సంత–అంగడి, బొమ్మ – సినిమా, కుళాయి – నల్లా, గెనుసు – కంద, దుంప – గడ్డ, సంకటి – గడుక, గుగ్గిళ్ళు – గుడాలు, వడలు – గారెలు, వీసెడు – తక్కెడు, డబ్బులు – పైసలు, దుడ్డు – కొత్త, దబ్బున – జెప్పన, దప్పి – దూప, గేదె – బర్రె, తువ్వాయి – లేగదూడ, నేరుగా – సూటిగా, తిన్నగా–మెల్లగా, బిరాన – వేగంగా, కబుర్లు – ముచ్చట్లు, గుమ్మం – దర్వాజ, కర్ర – కట్టె, విడాకులు – విడుపుకాయిందం, పెళ్ళి – పెండ్లి, మగడు/మొగుడు – మొగడు, పెటాకులు – పెడాకులు, గోంగూర – పుంటికూర, పచ్చడి – తొక్కు, తోటకూర – పచ్చకూర, టెంకాయ – కొబ్బరికాయ, కారం – మిరం, మజ్జిగ – చట్ట, గది – అర్ర, కంచె – దడి/ఎనుగు, గునపం – గడ్డపార, అరక – నాగలి, ఊర్పులు – నాట్లు, కల్లాపి – అలుకు, పేడ – పెండ, జిగురు – బంక, లాగు -- గుంజు, స్తంభం – కంబం/గుంజు/మొగురం, తొక్క – తోలు మొదటివి కోస్తా పదాలు, తర్వాతవి తెలంగాణవి.

బొమ్మ ఇంగ్లీష్ పిక్చర్‌కు అనువాదం. కుళాయి తమిళం. గెనుసు కన్నడం, గుగ్గిరి గోండీ భాష మాట. నేరుగా – నేరాహా అనే తమిళ పదం. టెంకాయ తమిళ తేంగాయ్. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు సాహిత్య పరిశోధన శీర్షికలలో కొన్నిసార్లు 'వరివస్య' అనే పదం ఉంది. అది ఒరియా పదం కావచ్చు. పై తెలంగాణ మాటల్లోపల నల్లా, దర్వాజా ఉర్దూవి.

మన తెలుగు తమిళ, కన్నడ, మరాఠీ, హిందీ, ఒరియా పదాలు సరిహద్దు రాష్ట్రాలైనందున కల్సినై. పాలకుల కారణంగా ఉర్దూ ఇంగ్లీషు పదాలు కల్సినై. సంస్కృత ప్రాకృతాలు క్రీ.పూ. నుంచే కల్సినై.

ఇరుగు పొరుగు రాష్ట్రాల అన్యభాషాపదాలు ఏ భాషలోనైనా కొన్ని కలుస్తునే ఉంటవి. పరభాషల వారి సహ చర్యంవల్ల కూడా భాషలు కల్తీ అవుతుంటవి. అదేం తప్పుకాదు, కాని ఇప్పటి ఇంగ్లీషు భాషా ప్రియులవలె సొంత భాష పదాలను వదిలివేయకూడదు.

తెలంగాన మాండలిక పదాలు

లొల్లి, గాయి, సడితి, చాంతాడు. పిలగాడు, ఉక్కిస, పోరి, యారాలు, యాట, ఆగం, తన్లాట, ఇగురం, బిత్తిరి, బరివాత, బొంది, పెయి, నేములు, కొత్తలు, కుచ్చం, లగ్నం..

ఇక్కడి కొన్ని మాండలిక పదాల వ్యుత్పత్తి విరణ

ఓనగాయ – వానగాయ,

పుంటి కూర – పుల్లంటి కూర

వతు – వత్ (సంస్కృతం)

యాది – యాద్ (ఉర్దూ)

నల్లా – నల హిందీ, ఇంగ్లీషులో టాప్ (TAP)

బొక్క (ఎముక) – బొమిక మారింది.

పుల్లెందుల (బాధ) – పులి లొందల పడ్డట్టు అని

పెంక – పెంచుక

పెంకాసు – పెంచుక కాసు

యాట– వేట

ఆగం (గజిబిజి) – యాగం

మబ్బుల (మసకలో) – ఉదయం

ఒకే పదానికి అర్థ భేదం

ముచ్చట – అటు అందం, ఇటు మాట్లాడుట

బొక్క – రంధ్రం, ఎముక

కంచె – దడి, గడ్డిపెరిగిన చెల్క

చెక్కు – పై పొట్టు, చెక్కు/జొనుపు

అప్ప – అక్క, పిండివంట (అప్పాలు)

పోవు – చచ్చు, వెళ్ళు

గిద్దె – చేరెడు, ఎనిమిది కుంచాలు

ఉగ్గు – ఆముదం (నూనె), గుజ్జన్నం

అవునుకు కాదనుటా?

అన్నిటికంటె వింతైన విషయమిది. కోస్తాంధ్ర నవలా రచయితలతో మొదలై ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ విద్యావంతులు ఇంచుమించు అందరూ వాడుతున్నది. అదేమంటే – అవునుకు కాదని అని, అవునని అన్నట్లే భావించుట – భ్రమించుట.

ఉ॥ అమ్మ తినమంది. నాన్న నిన్ను పిలవమన్నారు. సరే – వీటికి తినకపోనీ. ఎందుకు పిలువరు? అనే కదా జవాబు కాని, ఆ వాక్యాలు వ్యతిరేకార్థకాలు కావు. అభ్యర్థన – ఆదేశం ! అయితే అవి, తినుమంది – పిలువుమన్నారు అని కదా ఉండాలె. ఉంటులేవు. అట్ల అంటాలేరు. అది అతి స్టయిల్, అలసత, అశ్రద్ధ! అర్థం మారేదీ గమనించరు. ఇప్పుడు అన్ని ప్రాంతాల జనాలు/రచయితలు ఈ తప్పుడు ప్రయోగాలు నిరభ్యంతరంగా చేస్తున్నరు – రాస్తున్నరు. ఈ అనుచిత విధానం మారేదెన్నటికో. మన పండిత రచయితల ధ్యాస ఇంకా అటు పోలేదు. కాని, మనం మాత్రం ఈ అలవాటుల పొరపాటును మానుకోవలె. అట్లయితేనే భాష అర్థవంతంగా ఉంటుంది.

తప్పు సామెతలు

1. రామాయణంలో పిడకల వేట – అది పీడకల, వేట. దశరథుని పీడకల, వేటకు వెళ్ళి పొరపాటున శ్రవణ కుమారుని చంపుట కథను మార్చిన ప్రధాన ఘట్టాలని పై సామెత వచ్చింది. మన 'దశరా మశరా' మహాపండితుల కారణంగా అప్రస్తుత ప్రసంగం అనే అర్థంల కూర్చుంది.
2. కాళ్ళకు బలపాలు కట్టుకొని – ఎవరూ అవి కట్టుకోరు. కాళ్ళు బలపాలు కట్టగా / గట్టి పడగా అని భావం.
3. బెల్లం కొట్టిన రాయి – బెల్లానికి కొట్టిన రాయి అని. ఈ సామెత పుట్టిన కాలాన బంక బెల్లం. ఆ రాయి కదలదు. ఉమ్మినపడ్డ ఈగ అన్నట్టే ఇది.
4. చచ్చినోడి పెళ్లికి వచ్చినంతే మంది – మంది కాదు, అది మనది.
5. గాడిదగుడ్డు, కంకర పీసు – గాడ్ (ఈజ్) ద గుడ్, కాంకర్ పీస్!

   తొలి తరం క్రైస్తవ మత ప్రచారకుల ఆంగ్లవాక్యాలు గ్రామీణులు పలుకుబడిలో అట్ల మారినై.
6. పప్పుల కాలు వేయు – అది 'తప్పుల కాలు వేసింది'!

మాండలిక భాష అంటే గ్రామ్యం కాదు

వ్యాకరణ లక్షణ విరుద్ధమైన భాష గ్రామ్యం. ఇది ప్రయోగార్హం కాదు – అని పరవస్తు చిన్నయసూరి 'బాల వ్యాకరణము' అన్నది. అందుకు అతడు ఉదాహరణగా చూపి గ్రామ్య పదాలు వస్తాడు, తెస్తాడు. మరి, అవే ఇప్పుడు వ్యావహారిక భాష పేర ప్రామాణికాలైనవి. భవిష్యత్తులో ఇంకేమైనా కానీండి, ఇప్పుడు మాత్రం మన భాష మాండలిక పద స్వరూపాన్ని – సౌందర్యాన్ని మనం కాపాడుకుందాం. ఎందుకంటే –

గ్రామ్యం అనేక రకాలు. ఒక్కొక్క పదానికి పలు రూపాలు. పైగా అవి ఎక్కువగా గ్రాంథిక – వ్యావహారిక పదాలకు అపభ్రంశాలు. ఈ క్రింది పదాలు చూడండి.

ఇచ్చేంతురం – విచిత్రం, ఇపశారం – విపరీత ఆచారం,

నిలారం – నిరాహారం, దగ్గిర/దగ్గెర – దగ్గర,

నెరవు – మిరప, లీల్లు – నీళ్ళు, జెయం – జయం,

అగ్గజాం – వేగిలిజాము, అద్దుమనాత్తిరి – అర్ధరాత్రి,

ఓ లచ్చగుమ్మడీ – ఓ రాచ గుమ్మడి, ప్రత్యేకం – పతేకం

శూర్పణఖ – సుప్పనాతి...

ఇవి ప్రామాణికమంటే ఎట్లా? ఇంకా ఇంతకు వింత రూపాలున్నయి. ఉ॥ నయ్యే – నావే, మమ్మ – మా అమ్మ, గంచొంటోనివి – అటువంటి వానివి, సైతం – సతెం/ సుతెం, నిబద్ధంగా – నివద్దిగ, అబద్ధానికి వ్యతిరేకం.

ఇవి పదాల నిజస్వరూపాలు తెలియని పామరులు చేసే పొరపాట్లు. నాగరిక విద్యావంతులూ ఇందుకు మినహాయింపు కారు. తమ పరిశుభ్రత భాషణ ప్రత్యేకత చాటుకునేటందుకు వాళ్ళు కూడ పదాల మారుస్తున్నరు, ఇట్లా.

భంగారం, ఇసువంటి, సుబ్బరంగా, సుద్దరోళ్ళు (శూద్రులు), పెరుమాండ్లు (పెరుమాళ్ళు), దారుధ్యం మొ॥వి. ఏదో సిమెంట్ ప్రకటన ఈ మధ్య 'ధృడంగా' అని కనిపిస్తున్నది!

విద్యావంతులు మాట్లాడేది ప్రాంతీయ మాండలిక భాష అని గ్రహించాలె – అంగీకరించాలె.

ఇక్కడొక మాట గుర్తుకు వస్తున్నది. మొన్న ఈ మధ్యనే మన హైదరాబాద్ 'త్యాగరాజగానసభ'ల ఈ నాటి ఈ 'తెలుగు మాండలికాలు – స్వరూప చర్చ' సభాధ్యక్షులు పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డిగారు, ఈ నాటి నా సహవక్త డా॥ ద్వా.నా. శాస్త్రిగారి

"గురు శిరోమణి, తూమాటి దొణప్ప" పుస్తకాన్ని ఆవిష్కరించినరు. ఆనాటి ఆ సభాధ్యక్షులు ప్రముఖ భాషావేత్త 'చేరా' గారు డా॥దొణప్పగారి స్వభావాన్ని వివరిస్తూ "వారు వ్యావహారిక భాషా వాది. అయినా భాషా దోషాలను సహించే వారు కాదు" అని అన్నరు. ఎంతో మంచి మాట అది. మనం కూడా అంతే కావాలె – అట్లనే ఉండాలె. అయితేనే భాషా రూపం – అందం, మారదు – చెడదు.

ప్రామాణిక భాష

ఈ నాటి పత్రికల భాష ప్రామాణిక తెలుగు వ్యావహారిక భాష అనే అభిప్రాయం కొందరికి ఉంది. కాని, అది సరియైన భావం కాదు. అది మధ్యకోస్తా మాండలికం మాత్రమే.

'తెలుగు భాషోద్యమ సమాఖ్య' 2003 నవంబర్ 1వ తేదీన 'అమరావతి'లో 'తెలుగు మాండలిక భాషల చర్చా సదస్సు' నిర్వహించింది. ఆ సభలో నేను, కత్తి పద్మారావు, దేవరాజు మహారాజు, చిలుకూరి దేవపుత్ర మొ॥ వాళ్ళం వక్తలం. సి. ధర్మారావు, సామలరమేశ్‌బాబు, వావిలాల సుబ్బారావు (సభా నిర్వాహకులు) తీర్మానించింది ఏమంటే, ఇప్పటి పత్రికల భాష ప్రామాణిక వ్యవహార భాష కాదు. మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల మాండలికాల సమైక్య రూపంగా మన తెలుగు ప్రామాణిక భాష ఏర్పడవల్సిన అవసరం ఉంది –అని. నా భావనా అదే.

మన ప్రముఖ కథా – నవలా రచయితలు/రచయిత్రులు నాయికా నాయకులకు కోస్తా భాష పెట్టి, పని మనుసులకు గూండాలకు రౌడీలకు తెలంగాణ మాండలికం వాడితే ఇక్కడి వాళ్ళకు అది ఎట్ల సమ్మతమైతది చెప్పుండి. బాధగా ఉండదా – కోపం రాదా. ఇక్కడి పండితులు – పామరులు, భూస్వాములు – కూలివాళ్ళు అందరూ ఇక్కడి మాండలికమే మాట్లాడతరు కొంత భేదమున్నా.

ఆ సినిమా రచయితలు ఇక్కడి వాళ్ళు కారు. వారికి ఈ తెలంగాణ భాష రాదు. అవసరం కోసం హైదరాబాద్ పాతబస్తీ బజారు భాషను తెలంగాణ మాండలికం పేర రాస్తున్నరు. కృతక పదాలు సృష్టిస్తున్నరు. ఇది తగని పని.

మాండలిక భాషల అవసరం ఏమిటి?

గ్రాంథికానికి వ్యావహారిక భాషకు ఉన్న భేదమే వ్యావహారిక భాషకూ మాండలిక భాషకూ వుంటది. వ్యావహారిక భాష ప్రాంతీయ భేదాలే మాండలికాలు అని మనకు తెలుసు. అందుకని మాండలికమే జనానికి సన్నిహితం అని చెప్పవచ్చు. మాండలిక భాషల మాట్లాడితే రాస్తే అది వారికి ఆత్మీయంగా ఉంటది, త్వరగా అర్థం అవుతుది. అంతేకాక అధిక ప్రయోజనం కలిగిస్తది.

ఈ విషయం మనకు అందరికీ తెలుసు. అయినా ఏ బలీయమైన శక్తో మన కోరికలను అదిమిపెట్టి పెత్తనం సాగిస్తున్నది.

ముఖ్యంగా ఈనాడు తెలంగాణ భాష ఈ అణచి వేతకు గురి అయింది. లేకపోతే, పత్రికలు – పాఠ్యపుస్తకాలు సినిమాలు, కవిత్వం – కథల పుస్తకాలు మాత్రమే కాక, ఇక్కడి బాలశిక్షలు, వయోజన విద్యాపుస్తకాలు కూడా కోస్తా భాషల ఉండుడేమిటి చెప్పండి.

ఇటు పిల్లలు కాని, అటు పెద్దలు కాని, ఆ కొత్త భాషను చూసి, తాము ఇన్నాళ్ళు వింటున్న మాట్లాడుతున్న తమ భాష సరియైనది కాదనే అనుమానానికి లోనుకారా? దానితోని ఆత్మన్యూనత పాలవుతరు – అవుతున్నరు. అందుకే మా 'నవ్య సాహిత్య పరిషత్– కరీంనగర్' సంస్థ 2000 సం॥ అక్టోబర్‌ల 'తెలంగాణ తెలుగు మాండలిక చర్చా సదస్సు' పెట్టి ఆనాటి 17 ప్రసంగ వ్యాసాలను 'మా తెలుగు పలుకు' పేరుతో (శ్లేష) ఒక సంకలనం ప్రచురించింది. అధికార భాషా సంఘ మాజీ అధ్యక్షురాలు డా॥ పి. యశోదారెడ్డిగారి 'సుధర్మ' భవనంలో, డా. సి.నా.రె, డా॥ ఎం. కులశేఖరరావు, డా॥ నాయని కృష్ణకుమారి, తెలుగు ప్రొఫెసర్లు, రీడర్లు, ప్రముఖ రచయితలు – రచయిత్రులు పాల్గొన్న ఆ సాహిత్యసభలో మా 'మాతెలుగు పలుకు' వ్యాస సంకలనాన్ని సహృదయ సాహితీవేత్త డా॥ ఎల్లూరి శివారెడ్డిగారు ఆవిష్కరించిన్రు. అది మరపురాని అపూర్వ మధుర ఘట్టం.

ఆ పుస్తక ముఖపత్రం మీద మేము ఉటంకించిన మాటలు – ప్రముఖ దినపత్రికల జిల్లా సంచికలు ఆయా జిల్లాల మాండలిక భాషల్లనే ఉండాలె. బాల శిక్షలు – వయోజన విద్యాపుస్తకాలు ప్రాంతీయ మాండలికంలనే రాయాలె – అని ఇది ఏ ఒక్క రోజుననో ఏ కొందరితోనో సాధ్యం అయ్యే పనికాదు. అందుకు ఎందరో ముందుకు వస్తే ఈ సత్ సంకల్పం సఫలం అవుతది.

ఒక అనుభవం

ఆంధ్రప్రదేశ్ 'సాక్షరతా భవన్' వయోజనులకు వాచకాలు, కథల పుస్తకాలు ప్రచురిస్తున్నది. నేను, డా॥కాలువ మల్లయ్య, డా॥ బోయ జంగయ్య, కోట్ల వెంకటేశ్వర రెడ్డి మొ॥ వాళ్ళ తెలంగాణ నుంచి ఆ కథల వర్క్‌షాపుల్ల పాల్గొన్నం. ఇక్కడి వాళ్ళకు మేలని మేం తెలంగాన మాండలికంల రాస్తమంటే అధికారులు ఒప్పుకోలేదు. అవి రాష్ట్రమంతటా పంపిణీ అయ్యే పుస్తకాలు. అటువాళ్ళు ఇక్కడి భాష చదువలేరు కదా అని వారి ఆక్షేపణ. ఇక్కడి వాళ్ళు మాత్రం ఆ భాష పుస్తకాలు చదువాలె. విధి లేదు మరి. అదీ సంగతి.

ఇప్పుడు మిత్రులు ప్రముఖ సాంకేతిక విద్యావేత్త ఐఐటి చుక్కారామయ్యగారు పల్లెపిల్లలకు ఇంటింటికి భాషల విద్యాబోధన జరుగనున్న నే వాదన లేవనెత్తిన్రు. అది ఎట్ల సాధిస్తరో ఎన్నిరకాల పుస్తకాలు ముద్రించుతరో తెలువదు.

మానవ వనరుల శాఖ 'సాక్షరతా భవన్' వంటి పెద్ద సంస్థ కోస్తా, సీమ, తెలంగాణ కనీసం మూడు మాండలికాల పుస్తకాలు ప్రత్యేకంగా / విడివిడిగా ప్రచురించలేక పోతున్నది.

డా॥ జయధీర్ తిరుమలరావుగారు ఆంగ్లంవలె సంస్కృతం కూడా పరాయి భాషే. అందుకని మాతృభాష అనక తల్లిభాష అనాలె అంటున్నరు. మరో విద్యావేత్త 'భాష' కూడా సంస్కృతమే – తల్లినుడి అనుమన్నరు. ఏమిటో అంతా మనకు ఏ భీష్మ ప్రతిజ్ఞలు వద్దు. గొంతెమ్మ కోర్కెలు వద్దు. మన తెలుగును – తెలుగు మాండలికాలను కాపాడుకుందాం. అనివార్యమైతేనే తప్ప ఇతర భాషల పదాల వదిలేద్దాం. అట్లయితేనే మన తెలుగు పదాలు బతుకుతవి.

పత్రికలు

కోస్తాంధ్ర యాజమాన్య పత్రికల సంపాదకుల సంగతి వదిలేద్దాం. తెలంగాణా ప్రాంతం నుండి వెలువడుతున్న 'ప్రజాతంత్ర' 'నేటినిజం' పత్రికలు ఇక్కడివాళ్ళు నడుపుతున్నవే కదా. ఇవైనా ఇక్కడి మాండలికాన్ని, తెలంగాణ భాషను పట్టించుకోవాలె కదా. తెలంగాణ జిల్లాల పత్రికలు కూడ కోస్తా భాషల వెలువడుతున్నవి. ఇందెంత విడ్డూరం. భాషవల్ల ఎవరి ప్రయోజనం, ప్రముఖ పత్రికల జిల్లా ఎడిషన్లు కూడా అటేసయ్యే, ఇదేం బలవంతపు రుద్దుడు?

విదేశ – విజాతి పాలకులు భాష తెలువని అధికారుల నియమించి స్థానిక ప్రజల భయపెట్టి అదిమి పట్టి పాలించినట్టే కదా ఇది. ఆ రాచరిక విధానం మనకెందుకు? మనది ప్రజా స్వామ్యం.

ఇక్కడి రచయితలు

ఇప్పుడు తెలంగాణ రచయితలు చాలా మంది ఇక్కడి మాండలిక భాషల రచనలు బాగనే రాస్తున్నరు. కథల – కవితల పుస్తకాలు కూడా వెలువరిస్తున్నరు. ఇది మంచి మార్పు. కాని, కొందరు ఇక్కడి భాషల కోస్తామాండలికాన్ని కలగలుపుతున్నరు. మరి కొందరు గ్రామ్యాన్ని నెత్తికెత్తుకుంటున్నరు. సంస్కృత నాటకాల ప్రాకృత సంభాషణల వలె గ్రామ్య భాష స్వీకరింప తగిందే. అయితే, అదే మాండలిక భాష నిజస్వరూపం కాదు వ్యవహార భాష విద్యావంతులది – నాగరికులది. జానపదులది మాండలిక గ్రామ్యం.

మాండలికంపేర - రాలేదుకు నిజామాబాద్ 'రాకచ్చిండు', నీ దగ్గరకు నల్గొండ నీతాన, అన్నాడుకు అనంతపురం అన్యాడు, వచ్చియున్నాడుకు నెల్లూరు వచ్చి ఉండాడు, నేనుకు శ్రీకాకుళం నాను, ఎప్పుడొచ్చావుకు విజయవాడ ఎప్పుడొచ్చా (నువ్వానేనో) మాటలను ప్రామాణికం అనలేం కదా.

సహజత - సౌందర్యం, భావం - బహుళ జన ప్రయోజనం ఆధారంగా మనం మన మాండలిక భాషను వ్యాప్తికి తేవలె.

తెలంగాణ చరిత్ర - సంస్కృతి - వారసత్వం

చరిత్రకు పూర్వకాలం నుంచే ఇది జనావాస భూ/ప్రాంతం రాతియుగ ఆదిమానవులు నివసించిన నిదర్శనాలున్నవి. లోహ యుగారంభ బృహచ్ఛిలా సమాధులు అనేకం కనిపించినై. రామాయణ కాలాన ఇది దండాకాటవి. షోడశ మహాజనపదాలలో ఇది అశ్మక రాజ్యం. బౌద్ధుల కాలాన అంధాపథం. నాగులు - ముదిబాలు స్థానిక పూర్వ పాలకులు. మెగస్తనీస్ వర్ణించిన ఆంధ్రుల 30 కోటల్ల కరీంనగర్ జిల్లా కోటిలింగాల, ధూళికట్ట రెండు.

శాతవాహనుల తొలి రాజధాని కోటిలింగాల. అక్కడ సిముఖుని నాణాలు దొరికినై. గుణాఢ్యుడు నడయాడిన నగరం మెదకు జిల్లా కొండాపురం.

కన్నడ భారతం రాసిన పంపమహాకవి, కథాసరిత్ సాగరం రాసిన సంస్కృత కవి సోమదేవ సూరి... ఇక్కడివాళ్ళు.

"మా కాకతీయులు మహా చక్రవర్తులు
మహదాంధ్ర దేశాన్ని పాలించినారు,
వేంగి చాళుక్యులిట ఏలలేదు - కృష్ణ
దేవారాయలు కూడ రానులేదు.
అటు కవిత్రయము భారతమును రచియిస్తె
ఇటు భాగవతము రామాయణం వచ్చినై,
తిక్కన శ్రీనాధులిటు వచ్చిపోతె - ఆ
దిక్కు పోలేదు మన సోమన్న పోతన్న.
త్యాగరాజుకు ముందు రామదాసున్నడు
తిరుపతికి మొదలె మన కాళేశ్వరుండు,

గోలకొండకు మించు కోట మరి యేదుంది?
ఉన్నదొక్కటి అది మన ఓరుగల్లు!
కష్టజీవుల గడ్డ, కదనాల తొలిబిడ్డ
వాసిలో తెలగాణకున్న – మన పూర్వ
వైభవము స్మరియించు మన్న.

సాహిత్యం

రెండువేల అయిదు వందలేండ్లకు పూర్వమే అశ్మకరాజ్య గోదావరి తీర బావరి ముని (బాదనకుర్తి) శిష్యులు 16గురు శ్రావస్తికి వెళ్ళి గౌతమ బుద్ధునితో సంభాషించినట్లు బౌద్ధగాథ ఉంది.

క్రీ.పూ. 2,3 వందలేండ్ల నాటి ఆంధ్ర రాజు – సామగోప, మొదటి శాతవాహన చక్రవర్తి – సిముఖుని నాణాలు, 'కోటిలింగాల'ల దొరికినై. భారతదేశాన ఇవే మొదటి నాణేలని చరిత్ర పరిశోధకుల నిర్ణయం.

రెండు వేలేండ్ల పూర్వం పైశాచీ భాషల 'బృహత్కథ' రచించిన గుణాఢ్యునిది మెదకు జిల్లా కొండాపురం.

శ్రీరాముని భద్రాచల – పర్ణశాల నివాస గాథ ఏమైనా, కాళిదాసు – మేఘదూతం యక్షునితో కరీంనగర్ 'రమాగిరి' ముడిపడి ఉంది.

నాగార్జునాచార్యకు ప్రజ్ఞాపారమిత గ్రంథాన్నిచ్చిన బౌద్ధ రాజు 'నాగముచిళింద' నిర్మాణం ధూళికట్ట స్తూపం.

10వ శతాబ్ది పంపకవి, సోమదేవ ప్రభులేములవాడ నివాసులు. వారు కన్నడ, సంస్కృత భాషల్ల మహాకవులు – జైనులు.

మొదటి కందపద్యం పుట్టుక ఇక్కడ – జినవల్లభుని కురిక్యాల శాసనం క్రీ.శ. 946.

మొదటి స్వతంత్ర కావ్యం – పాల్కురికి సోమ 'బసవ పురాణం'

మొదటి ద్విపద కావ్యం – పాల్కురికి 'పండితారాధ్య చరిత్ర'

మొదటి శతకం – పాల్కురికి 'వృషాధిప'. 12వ, శతాబ్ది

మొదటి రాజకవి – కాకతి రుద్రదేవుడు 'నీతి శాస్త్రం'

మొదటి అలంకార శాస్త్రం – విద్యానాథ 'ప్రతాప రుద్ర యశోభూషణం

మొదటి నాట్యశాస్త్రం – జాయపసేనాని 'నృత్తరత్నాకరం 13శ

మొదటి ద్విపద రామాయం–గోన బుద్ధారెడ్డి,

'రంగనాథ రామాయణం'13–14 శ

మొదటి సంకలన కావ్యం – మడికి సింగన్న 'సకల నీతి సమ్మతం' 14వ శతాబ్ది

మొదటి భాగవతం – పోతన అనువాదం, బమ్మెర – 15 శ.

మొదటి యక్షగానం – కందుకూరి రుద్రకవి, 'సుగ్రీవ విజయం'

మొదటి అచ్చతెలుగు ప్రబంధం – పొన్నిగంటి తెలగన 'యయాతి చరిత్రం'

చివరి రెండు 'గోలకొండ' ముస్లింపాలకుల కాలానివి.

ఇంతెందుకు? గత శతాబ్దిలో జ్ఞానపీఠ పురస్కారాలు అందుకున్న ఇద్దరిలో ఒకరు డా॥ సి. నారాయణ రెడ్డిగారిది కరీంనగర్ జిల్లా హనుమాజి పేట. మరొకరు కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారిది విజయవాడ అయినా ఆదరించినది కరీంనగర్.

ఇంకా మన ఏకైక తెలుగు ప్రధాని కీ.శే. పి.వి. నరసింహ రావుగారిది, వార్ దళపతి గణపతిది తెలంగాణా. ఆరెసెస్ వ్యవస్థాపకులు హెగ్డేవార్‌ది మెదక్ జిల్లా

జానపదం

తెలంగాణ జానపదుల శ్రామిక గీతాలు, భిక్షుకుల పాటల, కథా గేయాలు బండ్లకెత్తవచ్చు. ఇప్పటికీ ఇక్కడి పల్లె పడతుల పాటల పేటికలు. పాల్కురికి సోమనాథుడు పేర్కొన్న దేశికవితల రూపాలన్నీ ఈ ప్రాంతపువే. ఇక్కడి బతుకమ్మపాటలు, కాముని పున్నమి పాటలు – పదరస భావరమ్యాలు. మచ్చుకు ఒకటి రెండు పదాలుచూడండి.

1. ఇద్దరక్క చెల్లెండ్ల వుయ్యాలో
ఒక్కూర్తి కిత్తె వుయ్యాలో
వొక్కడే మాయన్న వుయ్యాలో
వచ్చున్న పోదు వుయ్యాలో
ఎట్లత్తు చెల్లెలా వుయ్యాలో
యేరులడ్డమాయె వుయ్యాలో...

2. అలు జిల్లిటుజిల్లె వరలో
గుందంల జిల్లె వరలో
గుందంల నీల్లన్ని వరలో

కుంకుమ్మాలాయె వరలో
రాలిన కుంకుమ్మావరలో
రచ్చలు గట్టించీ వరలో
మిగిలిన కుంకుమ్మావరలో
మిద్దెలు కట్టించి వరలో
దాని మీదున్నట్టి వరలో
జానాలెవరమ్మా వరలో...

3. శ్రీరాముడు సీతాకోల్, ఆరుణ్యంపోంగా కోల్
కట్టకాళ్ళా పెనిగె కోల్, జిబ్రేగు ముల్లు కోల్
ముల్దియి కా/రాముడా కోల్, ముల్దీయవయ్యా కోల్
ముల్లెట్ల దీత్తునే కోల్, ఈ ముల్కల్లోనా కోల్...

ఇంకా – కోయిలా, తుమ్మెదా, చెలియా, చందమామ, తందాన, రాచగుమ్మడి మొ॥ వంతపదాల పాలటున్నవి అవన్నీ సంబోధనలు. కోల్ – కోల!

నాచని సోముడు పేర్కొన్న జాదుర – జాజిరి పాటలు కూడ ఇక్కడున్నవి. ఉదాహరణకు ఒకటి

"ఆ గుండీ గుండిత్తడి గుండు
గుండు పోయి గుండు పోయి మోతలు పెట్టు
మోతె రాజు పోయి తాడూరెక్కె
తాడూరంత దండై నిలిచె
నిలచి కొట్టెరా నీలపురాయి
తలచి కొట్టెరా తాళపు బుర్ర
జాజిరి జాజిరి జాజిరి దాదా–"
(జాజిరాదుదాం జమకూడుందా॥)

ఇది ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటి చారిత్రక జానపదగేయం. 'కొండవీడు మనదేరా?' కృష్ణదేవరాయల జైత్రయాత్ర గేయం 16వ, శతాబ్ది. పైపాట 12వ, శతాబ్ది పూర్వార్థానిది. కల్యాణి చాళుక్య సామంతుడు కాకతి రెండవ ప్రోలరాజు, చక్రవర్తికి

అవిధేయుడైన మంధని గుండరాజు పైకి దండునడిపి ఓడించి తల నరికినప్పుడు ఈ గేయం/పాట.

పిల్లల ఆటల పాటలు అనేకం. తెలంగాణా పేదరైతుల ఈ దయార్ద్ర గీతం వినండి

"ఏటికేతంపెట్టి ఎయిపుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరుగనన్నా – నేను
గంజిలో మెతుకెరుగరన్నా.."

ఇది కల్తీభాషట

ఆ మాటకు వస్తే నిజమాలోచిస్తే ఏ ప్రాంతం భాష కల్తీది కాదు? అంతా అంతే. ఇక్కడి తెలుగుల ఉర్దూపదాలను ఎక్కువ మిలాయించుతరు అని అక్కడి వాళ్ళ వాదన. అది పూర్వంల, అదీ విద్యావంతులకే పరిమితం. ఇప్పుడు చాలా తగ్గింది. హైద్రాబాద్ పాతబస్తీ వీధుల్లో వినిపించే భాష వలె తెలంగాణ పల్లెల భాషలేదు. ఇక్కడి గ్రామీణ భాష అచ్చతెలుగు, పచ్చిపాల తేట. గ్రాంథికానికి దగ్గర.

ఉర్దూ పదాలు కోస్తా భాషల లేవనేదేం లేదు. పైగా వాళ్లు ఇంగ్లీషు మాటలు ఎక్కువ మిక్స్ చేస్తరు కదా.

"అరవ కన్నడ ఒరియ ఆంగ్లమ్ము కలగలిపి
అందమా ఆ ఆంధ్రకులుకు?
అచ్చ తెలుగుకు సొంత ఉర్దూ కలిస్తేనే
నచ్చదా తెలగాణ పలుకు!"

అది, ఇది మొదలైన పదాల మొదటి అచ్చులు గది, గిది అని ఇక్కడ అంటరని మరో ఆక్షేపణ. అవును నిజమే అదుగదుగో పదబంధం అనుచిత విభజన ఫలితం అది, మన నక్కలు, ఈగలు అంతేకదా. నరి, ఈ – ద్రవిడ బాష ఏకవచనాలు. గళు బహువచన ప్రత్యయం. నక్క, ఈగ, అనుచిత విభాగం వల్లనే మనకు 'లు' బహువచన ప్రథమా విభక్తి ప్రత్యయమైంది. గది, గిది అని కొందరన్నా గేది అని మాత్రం ఎవ్వరూ అనరు. అదుగదుగో – చందమామ! అని ఉందిగని, ఏది గేది? అనేది లేదు కదా. అది 'ఏదేది' అంతే ఇకార సంది. ఈ పదాది గకారం కూడ క్రమంగా ఇక్కడ మాయం అవుతున్నది.

ఇక్కడి మాండలిక పదాలు వందలు, వేలు, అపురూపాలు, అర్థవంతాలు – అనే నిజం తెల్సి ఆదరించాలె. ఇక, ఇప్పుడు ఇక్కడి విద్యాధికులు కొందరు 'మూలవాసుల' భాషే అచ్చమైన తెలుగు అనే వాదన లేవదీస్తున్నరు. అది పాక్షిక సత్యం మాత్రమే. ప్రస్తుతం ఆ వివరాలకు పోను.

ముగింపు

భాష ఒక జాతి జీవనాడి. మాండలిక భాష ఆ ప్రాంత ప్రత్యేకత – అది దాని అస్తిత్వానికి గుర్తు. తెలంగాణ భాష అందమైనది – అర్థ వంతమైనది. ఇది పురాతన తెలుగు గ్రాంథిక భాషకు సక్రమ పరిణామం చెందిన రూపం. అదేమిటో మనవాళ్ళకు ఇదంటే ఉపేక్ష – చులకన భావం.

అక్కడివారికి ఇది పట్టదు. ఇక్కడి ప్రవాసాంధ్రులు ఈ భాషను ఆదరిస్తూలేరు. ఈ మాండలికం మాట్లాడరు, రాయరు. పత్రిక – పుస్తక ప్రచురణ కర్తల పుణ్యమా అని ఇక్కడి రచయితలు – పాఠకులు కోస్తా బాషకే అలవాటు పడుతున్నరు. ఈ మాండలికం కేవలం ఇక్కడి పల్లీయులకు పరిమితం అవుతున్నది. మరో తరం గడిస్తే గ్రామీణులూ విద్యావంతులైతే ఈ మాండలికం కనుమరుగు కావచ్చు. అంటే ఒక జాతి అంతరించిపోయినట్లే అది.

ఇది ఒక భాష మాండలిక అస్తిత్వ సమస్య మాత్రమే కాదు. ఈ తెలంగాణ జాతి ఆత్మగౌరవ సమస్య.

నవ నాగరికత పేర మన దుస్తులు మారినై, యంత్రాల పురోగమనం కారణంగా వస్తువులు మారినై, సంస్కృతికి చిహ్నాలైన పర్వదినాలమీద విద్యావంతులకు ఆసక్తి తగ్గింది. ఇక ఈ జాతి గుర్తుగా మిగిలిన ఈ మాండలిక భాష మారితే – మాయమైతే, తెలంగాన జాతి అదృశ్యం అయిపోతది. వ్యక్తులు ఉన్నా, తమ ప్రత్యేకతను కోల్పోయి, మతాంతరీకరణ పొందిన మన వాళ్ళవలె మరో రూపంగా ఉంటరు. ఇది సంభావ్యం కాదు.

తెలుగు అన్ని మాండలికాలను ఆదరించుదాం, అవి జీవించి ఉండాలె. మన తెలంగాణ మాండలిక తెలుగు భాసను – యాసను కాపాడుకుందాం!

చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా!
గతమెంతొ ఘనకీర్తి కలవాడా॥
"నా తెలంగాణ కోటి రతనాల వీణ"
"మందార మకరంద మాధుర్యమున తేలు
తెలగాణ తావి – మన తెలుగు పలుకు॥"

భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం (1857) - తెలుగు సాహిత్యంపై ప్రభావం

నాటకాలు - ఇతర సాహిత్య ప్రక్రియలు

- గండవరం సుబ్బరామి రెడ్డి

పరాయి పాలనలో ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా చితికిపోయి, అభద్రతా భావంతో దైన్యావస్థలో కొట్టుమిట్టాడుతున్న భారత జాతికి, కసితో అగ్నిపర్వతంలా, లోలోపల రగిలిపోతున్న జాతికి నాలుగు సంఘటనలు కనువిప్పుకలిగించి దిశానిర్దేశం చేశాయి. 1857లో మీరట్‌లో ప్రారంభమై ఢిల్లీ, లక్నో, కాన్పూర్, అలహాబాద్ పాట్నా, అయోధ్య తదితర ప్రాంతాలలో జరిగిన సిపాయీల తిరుగుబాటు వైఫల్యం, దత్తత చెల్లదని ఝాన్సీ రాజ్యాన్ని బ్రిటిష్ పాలకులు కబళించడం, ఝాన్సీ లక్ష్మీబాయి వీరోచిత పోరాటం, విషాదమరణం ఆంగ్లేయుల పట్ల అంతులేని క్రోధాన్ని, ప్రతీకారేచ్ఛను పెంపు చేశాయి. 1905 నాటి బెంగాల్ విభజన మాతృభూమిపై ప్రజల్లో మమకారాన్ని పెంచింది. అప్పుడు మొదలైన వందేమాతరం ఉద్యమం దేశంలో అన్ని మూలలకు ప్రాకి బ్రిటీష్ ప్రభుత్వాన్ని గంగవెర్రులెత్తించింది. భారత ప్రజల హక్కులను పూర్తిగా హరిస్తూ 1919లో బ్రిటీష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రౌలట్ చట్టం' భారత ప్రజల తీవ్రనిరసనకు, ప్రతిఘటనకు ఆజ్యం పోసింది. ఈ విషయమై పంజాబులో జలియన్‌వాలాబాగ్‌లో సమావేశమైన ప్రజలమీద డయ్యర్ ఆదేశంతో, పోలీసులు జరిపిన కాల్పుల్లో వందలాది భారతీయులు నేల కొరిగారు. ఈ మారణకాండ దేశంలో పెను సంచలనం కలిగించింది. ఆ సంఘనకు భారతీయులు ఆగ్రహోదగ్రులై బ్రిటిష్‌పాలనకు శాశ్వతంగా చరమగీతం పాడాలని దృఢ సంకల్పంతో కర్తవ్యోన్ముఖులయ్యారు. ఇదే జాతీయోద్యమంగా రూపుదాల్చింది. 1920లో మహాత్మాగాంధీ ఉద్యమసారథ్యం వహించటంతో రాజకీయరంగంలో అపూర్వమైన మార్పులు చోటు చేసుకున్నాయి. సత్యాహింసలను ఆయుధాలుగా చేసుకొని భారతజాతిని ఒక త్రాటిపైనడిపించారు. 1947లో భారతావనికి సిద్ధించిన స్వాతంత్ర్యం వెనుక కొన్ని లక్షల మంది దేశభక్తుల

నిస్వార్థ సేవానిరతి, త్యాగసంపద దాగి ఉన్నాయి. ఇదంతా జాతీయ స్థాయిలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ చరిత్ర కాగా ఒక రీతిలో ఉండగా ఆంధ్రదేశంలో సాగిన స్వాతంత్ర్యోద్యమ పోకడ కొంత భిన్నంగా కనిపిస్తుంది. ఈ ఉద్యమం ఆంధ్రదేశంలో మూడు పాయలుగా ప్రవహించింది. అవి : సంస్కరణోద్యమం, ఆంధ్రోద్యమం, జాతీయోద్యమం, ఈ జాతీయోద్యమమే సహాయ నిరాకరణోద్యమ సమయంలో స్వాతంత్ర్యోద్యమంగా పరివర్తన చెందింది. ఈ ఉద్యమాలన్నింటికీ భారతప్రథమ స్వాతంత్ర్య సమరం స్ఫూర్తి నిచ్చిందనటం గమనార్హం. ఈ ఉద్యమాలన్నింటిలోనూ తెలుగు నాటకం ప్రయోజనాత్మకమైన, శక్తిమంతమైన పాత్ర నిర్వహించింది.

సంస్కరణాత్మక నాటకాలు :

స్వారాజ్యసముపార్జనకు ముందు సమాజాన్ని చక్కదిద్ది, స్వాతంత్ర్యాభిముఖంగా ప్రజలను సంసిద్ధం చేయాల్సిన అవసరం ఏర్పడింది. అర్థం లేని ఆచారాలతో, మూఢ నమ్మకాలతో, కాలదోషంపట్టిన సంప్రదాయాలతో లుకలుకమందుటన్న సమాజాన్ని మార్చాలని కొందరు మహనీయులు సంకల్పించారు. ఈ దిశలో కృషి చేసిన కవులు, నాటకకర్తలలో ప్రథమగణ్యుడు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా సంఘ సంస్కరణ వైపే ఆయన దృష్టి సారించారు. 'బ్రాహ్మవివాహం' (1880) నాటకంలో ఆనాటి వివాహ వ్యవస్థలో కొనసాగుతున్న అవాంఛనీయ ధోరణులను హాస్యస్ఫోరకంగా విమర్శించారు. 'వ్యవహార ధర్మబోధిని' (1880)లో న్యాయవ్యవస్థలో లంచగొండితనాన్ని, అన్యాయాలను బట్టబయలు చేశారు. 'తిర్యగ్విద్వన్మహా సభ' అనే ప్రహసనంలో కుల వ్యవస్థలోని డొల్లతనాన్ని తూర్పారబట్టారు. అతి బాల్య వివాహాలను ఖండిస్తూ, స్త్రీ పునర్వివాహాన్ని సమర్థిస్తూ అనేక వ్యాసాలు రాశారు. గురజాడ వెంకట అప్పారావు గారి 'కన్యాశుల్కం' నాటకం జగద్విదితం. కన్యాశుల్కం అనే దురాచారాన్ని ఆ నాటకంలో శక్తిమంతంగా ఖండించారు. కాళ్ళకూరి నారాయణరావుగారు రచించిన మూడు సాంఘిక నాటకాలు సంస్కరణాత్మకాలు కావడం విశేషం. 'చింతామణి' (1921)లో వేశ్యాసంపర్కాన్ని 'మధుసేవ' (1926)లో మధుపానాన్ని, 'వరవిక్రయం' (1921) నాటకంలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ నిర్మాణాత్మకంగా ఆ నాటకాల్లో హితబోధ చేశారు. గాంధేయవాదానికి కట్టుబడిన దేశభక్తుడుగా, సంస్కారవంతుడుగా 'వరవిక్రయం'లో చిత్రించిన పురుషోత్తమరావు పాత్ర కాళ్ళకూరి వారిలో నిక్షిప్తమైవున్న జాతీయ ఉద్యమ స్ఫూర్తిని వ్యక్తీకరిస్తుంది. రాట్నంతో నూలు వడకడం వంటి సన్నివేశాలు ఆనాటి జాతీయోద్యమ వాతావరణాన్ని తలపింపజేస్తాయి. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి 'వృద్ధవివాహం'(1910), బళ్ళారి రాఘవ రచించిన, సరిపడని

సంగతులు (1933) సంఘ సంస్కరణ కోసం ఉద్దేశించిన నాటకాలే! ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటకాలలో కూడా జాతీయోద్యమ ప్రభావం ఉందనడానికి ఆయన రచించిన అజామిళ, చంద్రహాస, ప్రమీలార్జునీయం నాటకాలు సాక్షీభూతంగా నిలుస్తాయి. రజస్వలా వివాహాన్ని సమస్యగా తీసుకొని 'అజామీళ' నాటకాన్ని వ్రాయడం ఆనాటి సమాజంలో సాహసకార్యమే. 'చంద్రహాస' నాటకంలో ఉప్పు పన్ను మీద ఉపన్యాసం, 'ప్రమీలార్జునీయం' (1905) నాటకంలో స్త్రీ విద్యను గురించి చర్చించటం జాతీయోద్యమ ప్రభావ ఫలితమేనని దృఢంగా చెప్పవచ్చు.

ఆంధ్రోద్యమ నాటకాలు :

బెంగాల్ రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ఒకే భాష మాట్లాడే ప్రజలకు ఒకే రాష్ట్రం ఉండాలి అనే భావనకు తావిచ్చింది. 1911లో బెంగాలు, అస్సామ్, బీహారు రాష్ట్రాలు భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా అవతరించాయి. అంతటితో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర వాంఛ ఆంధ్రుల్లో అంకురించి ప్రబలమైంది. అవిభక్త మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలని ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమానికి కవులు, నాటకకర్తలు తమ రచనలతో తోడ్పాటు అందించారు. గ్రంధి వెంకటరాయగుప్త గారి 'ఆంధ్రమాత' (1921) నాటకం వెలువడింది. ఇందులో రాజకీయ సంబంధి అంశాలనేకాక, విధవకేశ ఖండనాది పెక్కు సాంఘిక సమస్యలు కూడా చర్చించబడినాయి. గుళ్ళపల్లి నారాయణమూర్తిగారి 'ఆంధ్రజ్యోతి' (1941) నాటకంలో దేశసేవ, దేశసేవకు వచ్చే అడ్డంకులు, వాటిని అధిగమించి విజయం సాధించటం ఇతివృత్తం. కవులూరి హనుమంతరావు రచించిన 'ఆంధ్ర పతాకము' (1939) నాటకంలో ఆంధ్రరాష్ట్ర సంపాదనకు ఆంధ్రుల దీక్ష, తమిళుల, రాయలసీమ వారల వ్యతిరేకత, చివరగా ఆంధ్ర పతాక ప్రతిష్ట సన్నివేశపరంగా వివరించడం జరిగింది. 'ఆంధ్రపతాకము' (1921) పేరుతో ద్రోణంరాజు సీతారామరావు రచించిన నాటకం కూడా ఈ కాలంలోనే వెలువడింది. నండూరి బంగారయ్యగారి 'ఆంధ్రతేజము' (1939) మొదలైనవి ఆంధ్రరాష్ట్రోద్యమాన్ని ఆలంబనగా చేసుకొని రాసిన నాటకాలే. ఎంతో ఉధృతంగా నడచిన ఆంధ్రోద్యమం, జాతీయస్థాయిలో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభమైన కారణంగా, నిలిచిపోయింది. ఆంధ్రప్రజలు జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు.

జాతీయోద్యమ నాటకాలు :

స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో, ప్రజలలో స్వరాజ్యకాంక్షను జాగృతం చేస్తూ కవులు, నాటకకర్తలు ఉద్యమానికి బాసటగా నిలిచి, దేశాభిమానాన్ని, దేశభక్తిని ప్రోదిచేసే

శక్తిమంతమైన నాటకాలు రావారు. వాటిని కళాకారులు వాడవాడలా ప్రదర్శించి ఉద్యమానికి కొండంత బలాన్ని చేకూర్చారు. జాతీయోద్యమ నాటకాలు రాసిన వారిలో ప్రథములు రామరాజు పుండరీకాక్షుడుగారు. వీరు రచించిన స్వరాజ్యసోపానం (1920) ఆంధ్రదేశంలో విస్తృతంగా ప్రదర్శింపబడి బహుళజనామోదం పొందింది. తిలక్ నిర్యాణంతో గాంధీజీ రాజకీయ రంగంలో ప్రవేశించడంతో మొదలై నాగపూరు కాంగ్రెస్ మహాసభలో గాంధీజీ ప్రతిపాదించిన స్వాతంత్ర్య తీర్మానం ఆమోదింపబడటంతో అంతమౌతుంది. తిలక్, మహాత్మాగాంధి, నెహ్రూ, సి.ఆర్.దాస్, అలీసోదరులు మొదలైన జాతీయ నాయకులను పాత్రలుగా చేసి, ఆనాటి రాజకీయ ఘట్టాలను నాటకాలలో పొందుపరచి నిండైన నాటకీయతతో ఔత్సుక్య స్ఫోరకంగా నాటకాలు రాయడం రామరాజుకే చెల్లింది. రామరాజు గారి నాటకాలు చోదకశక్తులై జాతీయోద్యమాన్ని నడిపించటం చూసి భయభ్రాంతులై బ్రిటిష్ పాలకులు స్వరాజ్య సోపానం నాటకాన్ని నిషేధించారు. పుండరీకాక్షుడు పట్టువదలని విక్రమార్కుడై అదే నాటకాన్ని విస్తరించి మూడు నాటకాలుగా రచించాడు. గాంధీ మహోదయం, గాంధీ విజయం, పాంచాల పరాభవం అనే పేర్లతో ఆ నాటకాలు ప్రజల్లోకి దూసుకువెళ్ళాయి. పాంచాల పరాభవం జలియన్ వాలాబాగ్‌లో జరిగిన దారుణ మారణకాండ గురించిన నాటకం. అత్యంత ప్రజాదరణ పొందింది. ప్రభుత్వం ఈ నాటకాలన్నిటిపైనా నిషేధాజ్ఞలు జారి చేసి రచయితకు కారాగార శిక్ష విధించింది. ఈ రకమైన రాజకీయనాటకాలు భారతదేశంలో ఏ భాషలోనూ వెలువడలేదు. అదే తెలుగులో జాతీయోద్యమ నాటకాల ప్రత్యేకత. ఈ కాలంలోనే సోమరాజు రామానుజరావు గారి 'స్వరాజ్యరథం' (1921) తలికురాయబారము (1921) వెలుగుచూశాయి. శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారు రచించిన గాంధీజీ విజయధ్వజ నాటకము (1921) తిలకు మహారాజు నాటకం (1921) రంగస్థలం మీద ప్రదర్శితమై ప్రశంసలందుకున్నాయి. ప్రత్తిగొడుపు రాఘవరాజు రాసిన 'క్విట్ ఇండియా విప్లవం' (1948) ఢిల్లీకోట (1946) దువ్వూరి రామిరెడ్డిగారి 'కాంగ్రెస్ వాలా' నాటిక, ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారి 'భారతమాత' (1913) మొదలైనవి స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో వెలుగు చూసిన నాటకపరంపరలో చేరినవే! అది పద్య నాటకాల యుగం కనుక అప్పటి జాతీయోద్యమ నాటకాలలో అత్యధిక భాగం పద్యగద్యాత్మకాలు కావడం గమనించదగిన అంశం. చాలా నాటకాల్లో వస్తు గౌరవం మినహా సాహితీ విలువల జాడ కనబడేది కాదు. అయినా, ఉద్యమ స్ఫూర్తితో నాటకాన్ని ప్రజలు ఆహ్వానించేవారు; ఆదరించేవారు. జాతీయోద్యమ నాటకాలు తెలుగులో సుమారు 60 దాకా ఉన్నట్టు తెలుస్తోంది.

రాజకీయ నాటకాలకు సమాంతరంగా చారిత్రక నాటకాలు కూడా స్వాతంత్ర్యోద్యమ నాటక పంక్తిలో చేరి ఉద్యమాన్ని మరింత సుసంపన్నం చేశాయి. గతకాలపు పునాది రాళ్లపై నిలిచి సమకాలిక సమాజానికి స్ఫూర్తినిచ్చే చారిత్రక నాటకాలు భారతీయోద్యమంలో ప్రముఖపాత్ర వహించాయి. సగటు మనిషిలో దేశభక్తిని, జాతీయభావాన్ని ప్రోది చెయ్యడంలో అప్పటి నాటకాలు నిర్వహించిన పాత్ర అనుపమానం. స్వాతంత్ర్యాభిలాషకు ప్రాణ వాయువులూదే క్రమంలో 1920-30 సంవత్సరాల మధ్య విరివిగా చారిత్రక నాటకాలు వెలుగుచూశాయి. స్వాతంత్ర్యానికి పూర్వమేగాక, స్వాతంత్ర్యానంతరం కూడా కొన్ని నాటకాలు రాకపోలేదు. చరిత్ర మడతల్లో నలిగి, జ్ఞాపకాల పొరల్లో దాగిన త్యాగధనులైన వీరపుత్రుల సాహసగాథలను త్రవ్వి మన నాటక కవులు నాటకాలుగా రూపొందించారు. 'చంద్రగుప్త' 'అశోక రాజ్యము' వంటి మౌర్యవీరుల నాటకాలు, 'నాయకురాలు' 'పల్నాటి వీరచరిత్ర', 'బొబ్బిలియుద్ధం' వంటి ఆంధ్రవీరుల నాటకాలు, 'పృధ్వీసంయుక్త' 'రసపుత్ర కదనం' 'రాణాప్రతాపసింహ' వంటి రసపుత్ర వీరుల నాటకాలు, 'శివాజి' 'శంభాజీ' 'పీష్వానారాయణరావు' వంటి మరాఠీ 'శివాజీ' 'శంభాజీ' 'పీష్వానారాయణరావు' వంటి మరాఠీ వీరుల నాటకాలు స్వాతంత్రోద్యమానికి దోహదం చేశాయి.

తెలుగులో వచ్చిన మొట్టమొదటి చారిత్రక నాటకం వేదం వెంకటరాయశాస్త్రిగారి 'ప్రతాప రుద్రీయం' (1897). ఆ తర్వాత చారిత్రక నాటక వాఙ్మయంలో సుమారు 200 నాటకాలు చోటుచేసుకున్నాయి. వీటిలో 130 పద్యనాటకాలు కాగా, 40 వచన నాటకాలు, 30 నాటికలు. పద్యనాటకాలు రాసిన వారిలో వేదం, శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి, కొప్పరపు, రామరాజు, శ్రీపాద కామేశ్వరరావు, కోలాచలం శ్రీనివాసరావు, గుండిమెడ వెంకట సుబ్బారావు, సోమరాజు రామానుజరావు తదితరులు ముఖ్యులు. శ్రీయుతులు ఆచార్య ఆత్రేయ, కొండముది గోపాలరాయశర్మ, నార్లచిరంజీవి, కోస్రూరు శ్రీరామమూర్తి మొదలైనవారు వచన నాటకాలు రచించారు. అలాగే వచన చారిత్రక నాటికలు రాసిన వారిలో ఆమంచర్ల గోపాలరావు, బుచ్చిబాయి, డా॥ముదిగొండ శివప్రసాద్, డా॥ సి.నారాయణరెడ్డి ప్రభృతులు ముఖ్యులు.

చారిత్రక నాటకాలలో సుమారు 40 నాటకాలు విస్తృతంగా ప్రదర్శించబడి జనరంకమయ్యాయి. వాటిలో రామరాజు (1920), ఖిల్జీరాజ్యపతనము (1931), రాణాప్రతాప్ (1927), చంద్రగుప్త (1926) పల్నాటి వీరచరిత్ర (1915) బొబ్బిలియుద్ధం (1908), రసపుత్ర విజయము (1910) రోషనార (1921) ఝాన్సీరాణి (1948) మొదలైన నాటకాలు వందలాది ప్రదర్శనలకు నోచుకొని పండిత పామరుల ప్రశంసలు

అందుకొన్నాయి. నిజాం నిరంకుశ క్రూర పాలనలో రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు అనుభవిస్తున్న నరకయాతన నుండి విముక్తి కలిగించాలనే తపనతో సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర రావులు రచించిన 'ముందడుగు' (1945) 'మాభూమి' (1947) నాటకాలు ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని, సంఘటిత శక్తినీ, అన్యాయాల్ని అక్రమాల్ని ప్రతిఘటించగల ఆత్మస్థైర్యాన్ని సంపాదించి పెట్టాయి. అయితే ఈ రెండు నాటకాలు ప్రభుత్వ నిషేధానికి గురి అయ్యాయి.

గబ్బిట వెంకటరావు రచించిన 'అల్లూరి సీతారామరాజు' (1954) పత్తిగొడుపు రాఘవరాజుగారి 'ఝాన్సీరాణి' (1948) వల్లభనేని కాశీ విశ్వనాథ్ రచన సర్దార్ భగత్సింగ్ (1952) మద్దూరి అన్నపూర్ణయ్య 'చిచ్చులపిడుగు' (1929) స్వాతంత్ర్యసమర ప్రభావ జనిత నాటకాలు కావడం స్మరణీయం. 1920-47 మధ్యకాలంలో 33 నాటకాలు నిషేధాజ్ఞల బలిపీఠాన్ని అలంకరించాయి. ప్రభుత్వం పెట్టే బాధలు భరిస్తూ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలు కన్నీళ్లనూ నెదుర్కొంటూ, భారతమాత దాస్య విమోచన కోసం రాజీలేని పోరాటం సాగించిన త్యాగమూర్తులైన ఆ నాటక కర్తల విశిష్ట సేవలకు భారతజాతి ఎంతో ఋణపడి ఉంది. అది ఎప్పటికీ తీరలేని ఋణం!

ఇక ఇతర సాహిత్య ప్రక్రియల విషయానికి వస్తే - భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ ప్రభావం నవలా సాహిత్యంపై కూడా గణనీయంగా ఉందని చెప్పాలి. ప్రజల్లో దేశభక్తిని పాదుకొల్పాలన్న సదాశయంతో మాతృ భూమి సంరక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరుల శౌర్య పరాక్రమాలను, త్యాగనిరతిని గురించిన కథలను, చరిత్రలను నవలలుగా రూపొందించి ప్రకటించారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి, 'హేమలత' అహల్యా బాయి, నవలలు, భోగరాజు నారాయణమమూర్తి రచించిన 'విమలాదేవి' వేలాల సుబ్బారావు 'రాణీసంయుక్త' దుగ్గిరాల రామచంద్రయ్య 'విజయనగర సామ్రాజ్యము' కేతవరపు వెంకటశాస్త్రి 'రాయచూరు యుద్ధము' ప్రారంభదశలో వెలువడిన చారిత్రక నవలలు. 1932 ప్రాంతాలలో వెలువడిన విశ్వనాథ సత్యనారాయణగారి 'బద్దన్నసేనాని' ఆనాటి చారిత్రక నవలల్లో పేరెన్నికగన్నది. అడవి బాపిరాజు గారి 'గోనగన్నారెడ్డి' కాకతీయ రుద్రాంబ కాలానికి సంబంధించిన నవల. ఆంతరంగిక విప్లవాలను అణచి, మహా రాష్ట్రుల దండయాత్రలను యుద్ధనైపుణ్యంతో రుద్రాంబ ప్రతిఘటించటం ఈ నవలలో మనోజ్ఞంగా చిత్రించబడింది. నోరి నరసింహశాస్త్రి రచించిన 'రుద్రమదేవి' నవలకు రాజధర్మానికి, వ్యక్తి ధర్మానికి రుద్రమలో ఘర్షణ ఉదయించటం, చివరికి ఆమె దోషి అయిన భర్తను కాదని రాజధర్మాన్ని పాటించడం ఈ నవలలో ఉత్కంఠ భరితంగా చిత్రించటం జరిగింది.

1922లో ఉన్నవ లక్ష్మీ నారాయణగారి 'మాలపల్లి' ఆవిర్భావం తెలుగు నవలా సాహిత్య వికాసంలో చాలా ముఖ్యమైన ఘట్టం. మహాత్మాగాంధీ ప్రబోధ నేపథ్యం నుంచి వెలువడ్డ దేశభక్తి రచనే అయినా ప్రచార ధోరణిలోకాక పరిస్థితులను కళ్ళకు కట్టేట్టు చూపించేదిగా అవతరించింది. వర్గ వ్యవస్థ పునాదులు ఆందోళన చెందేంత పటిష్టంగా రచన జరిగింది. ఆర్థిక దుస్థితి నుంచి, సామూహిక అసమానతల నుంచి, మానసిక అవస్థల నుంచి బాగుపడటం, బ్రతకటం ఏమిటో చూపించింది. మాలపల్లి, జైళ్ళు, న్యాయస్థానాలు, నేరస్తులను సంస్కరించే దృష్టితో ప్రభుత్వం నిర్వహించే నిర్బంధ సంస్థలైన సెటిల్మెంట్లు, విద్యా, వైద్య, సాంస్కృతిక వ్యవస్థలలో ఆనాడు ప్రచురంగా కనబడుతున్న అక్రమాలు, అన్యాయాలు అన్నిటినీ కనుల ముందునిలిపారు. రష్యాలో నెలకొన్న సామ్యవాద ప్రభుత్వాన్ని అభినందించారు. సంఘంలో బలవంతులు బలహీనులను దోచుకొనే కీలకాన్ని వర్గకలహాలను, వాస్తవ చిత్రణం చేశారు. ఉన్నవారు, కొడవటిగంటి కుటుంబరావు 'చదువు' నవలలో స్వాతంత్ర్యోద్యమ ప్రస్తావన అడుగడుగునా కన్పిస్తుంది.

1919–20 నాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులను చిత్రించే ప్రయత్నంలో మహీధర రామమోహనరావుగారు రచించిన నవల 'కొల్లాయి గట్టితేనేమి?'. గాంధీజీ పిలుపునందుకొని కాలేజి చదువును స్వస్తి చెప్పి ఉద్యమంలో చేరి ప్రజాసేవకు అంకితమైన రామనాథ అనే ఓ ఆదర్శయువకుని కథ ఈ నవలలో చిత్రితమైంది. ఘనీభూత రూపంలో భయంకరంగా ఉన్న ఫ్యూడల్ వ్యవస్థలో, అంధ విశ్వాసాల, మూఢాచారాల కీకారణ్యంలో, ప్రభుత్వ దమననీతికి వ్యతిరేకంగా పోరాటం సల్పిన యువకుని సాహసగాథ అద్భుతంగా వివరించబడింది ఈనవలలో. ప్రజాసేవకు అంకితమైన ఆనాటి దేశభక్తులు ఎదుర్కొన్న కష్టాలకు, మానసిక సంఘర్షణలకు అర్థం పడుతుంది. 'కొల్లాయి గట్టితేనేమి' నవల. తెలంగాణా భూస్వామ్య వ్యవస్థ వ్యతిరేక పోరాటాన్ని ఇతివృత్తాలుగా చేసుకొని 'రథచక్రాలు' 'ఓనమాలు' వంటి నవలలు కూడా రాశారు రామమోహనరావుగారు. వట్టికోట ఆళ్వారు స్వామిగారి 'ప్రజల మనిషి' దాశరథి రంగాచార్య గారి 'మోదుగపూలు' చిల్లర దేవళ్ళు, పి.లక్ష్మీకాంతమోహన్ గారి 'సింహగర్జన' వాసిరెడ్డి సీతాదేవి గారి 'సమత' 'మరీచిక' నవలలు ప్రజల్లో ఆలోచన రగుల్కొల్పి, చైతన్యం వెల్లివిరిసేలా చేశాయి. ఈ క్రమంలో మరెందరో ఉత్తమ నవలలు వెలువరించారు. వీరు సృష్టించిన నవలలపైన భారతస్వాతంత్ర్య సంగ్రామ ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో అంతర్లీనంగా ఉన్నదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. అన్యాయాలపై తిరుగుబాటు తత్వాన్నీ, జాతీయ భావాన్ని, స్వేచ్ఛా ప్రవృత్తిని ప్రసాదిస్తూ స్వాతంత్ర్య సంగ్రామ స్ఫూర్తి తెలుగు సాహిత్యంలో బహుముఖాలుగా కొనసాగుతూనే ఉంది.

నేటి తెలుగు భాష – ఏ దిశలో ఏ దశలో "వ్యవహార రంగం"

– డా. ద్వా.నా. శాస్త్రి

'తెలుగునాట పుట్టితివి జన్మభూమద్ది
తెలిపెనీదు తల్లి తెలుగు నీకు
నిక్కమైనయట్టి నీదు సంస్కృతినెంచి
పలువ వలయుగాదె తెలుగు భాష"

నేటి వ్యవహారంలో తెలుగుభాష అన్యభాషా దిశలో పయనిస్తోంది. తన ఉచ్చదశను, మహర్దశను కోల్పోతోంది. అన్యభాషల వల్ల తెలుగు సాహితీపరంగా, శాస్త్రపరంగా వ్యాప్తికెక్కిన మాట కాదనలేం. కానీ వ్యవహారికంగా తెలుగుభాష 'లెస్స'గాలేదు – 'లెస్'గానే ఉంది. వ్యవహార రంగంలో తెలుగు భాషలో – ఆంగ్ల పదాలు సింహభాగం ఆక్రమిస్తున్నాయి. ఉర్దూ హిందీ పదాలు తర్వాతి స్థానం పొందగా మిగిలిన స్థానాన్ని తమిళ, కన్నడ, మరాఠీ పదాలు భర్తీ చేస్తున్నాయి. అంటె తెలుగు పదాలను ఈ భాషా పదాలు మరుగున పడేస్తున్నాయి. క్రమ క్రమంగా ఏది తెలుగుపదమో ఏది కాదో తెలియనంతటి దశ పట్టింది. 'రోజు' అనేది ఊర్దూ పదమైనా తెలుగే అనుకుంటున్నారు. మరాఠీ పదమైన 'రావు' తెలుగుగా వ్యవహారాంలో స్థిరపడింది. 'కిల్' అనేది ఇంగ్లీషు అన్న మాటే మర్చిపోయాం.

నేటి వ్యవహారంలో ఎక్కడన్నా తెలుగు వెలుగు ఉందీ అంటే మాండలిక భాషలోనే ఉంది. నిరక్షరాస్యుల నాలికలపై నాట్యమాడుతోంది. అచ్చమైన తెలుగు. ఒకనాడు సంస్కృతం, అరబిక్ భాషలవల్ల తెలుగు ఉన్నత దశని పోగొట్టుకుంటే ఈనాడు ఇంగ్లీషు వల్ల తెలుగు దీపం మినుకుమినుకు మంటూ గాలిలో దీపంలా వుంది. తమిళం, కన్నడ భాషీయులకన్నా మిన్నగా తెలుగు వాడు ఇంగ్లీషుకి 'warm welcome' చెప్తున్నాడు. హాకెట్ అనే భాషా శాస్త్రవేత్త చెప్పినట్టు 'prestige filling motive' – ప్రతిష్టా హేవుతు వల్ల ఇంగ్లీషు పదాల వాడకం బాగా ఎక్కువైంది.

మనం ఇంట్లో కూర, అన్నం, పచ్చడి, మజ్జిగ, చల్ల, నెయ్యి అంటాం. కానీ మనమే బయటకి వెళ్ళినప్పుడు, హోటల్‌కి వెళ్ళినప్పుడు – రైస్, కర్రీ, చట్నీ, బటర్‌మిల్క్, ఘీ అంటామే?

నాన్నా, అమ్మలుండగా డాడీ, మమ్మీలు ఎందుకొచ్చారు? ఈ 'ఆంటీలు', 'అంకుల్స్' ఎందుకు మనకి?

ఆంగ్ల పదాలను వాడేటప్పుడు అనేకమైన మార్పులు గమనిస్తాం

ధ్వనిమార్పులు సక్సస్‌ని సక్సెస్ అంటాం. కరంట్‌ని కరెంట్ అంటాం

ధ్వనులలోపం : కిలోగ్రాము – కిలో అయింది, రిఫ్రిజిరేటర్ – ఫ్రిజ్ అయింది, సూపరింటెండెంట్ – సూపర్నెంట్ అయ్యాడు

బహువచనంల మార్పులు : సీరియల్స్ – సీరియళ్ళు, ఛానల్స్–ఛానళ్ళు, లాకర్స్ – లాకర్లు, టెలిగ్రాం – టెలిగ్రాములు, ఆఫీసర్స్ – ఆఫీసర్లు

మిశ్రసమాసాలు : ప్రాథమిక రిపోర్టు, ఖాదీ బోర్డు, కస్టమర్ దేవుళ్ళు, వృద్ధాప్య పింఛను (పెన్షన్)

విశేషమైన పద ప్రయోగాలు : రుబ్బింగ్ మిషన్, రుబ్బింగ్ చేయబడును, ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు ఆస్పత్రి, నోట్ల ఆసుపత్రి, ప్రభుత్వ అవినీతి నిరోధ శాఖ, సూదిమందు (ఇంజక్షను), బలంకాయ (టానిక్), తల్లీ పిల్లల డాక్టరు, ఎముకల వైద్యుడు, గుండెజబ్బుల వైద్యుడు

ఇంగ్లీషు పదాలకు 'అబ్రివేషన్'ను తెలుగులో రాసి వాడటం మరో విశేషం

ఉదా : రివిన్యూ డివిజనల్ ఆఫీసర్ – ఆర్.డి.ఒ

భారతీయ జనతాపార్టీ – బిజెపి, భాజపా

తెలుగుదేశం పార్టీ – TDP, టిడిపి – తెదేపా

సినిమాల ప్రభావం వల్ల తెలుగు వ్యవహరించడంలో కొత్త పందబంధాలూ, జాతీయాలు పట్టుకొచ్చాయి. సినిమా 'డైలాగ్'లు నిత్య వ్యవహారంలో స్థిరపడిపోయాయి.

సుత్తి, ముత్యాలముగ్గు, ఐరన్ లెగ్, నాతో పెట్టుకోకు, రఫ్ ఆడించేస్తా, అంతసీను లేదు, టాప్ లేచిపోద్ది, నిన్ను లేపేస్తాను, ఫేస్ టర్నింగ్ ఇచ్చుకో, టాలీవుడ్ అనేది హాలీవుడ్, బాలీఉడ్‌ల సామ్యంతో ఏర్పడింది. యువకులు లైను వేస్తారు, బీటు కొడతారు.

రాజకీయ రంగంనుంచి కూడా 'ఫిరాయింపు', 'ఆయారాం – గయారాం', 'రాం – రాం', 'గలభా' 'వాకౌట్' వంటివి తెచ్చుకున్నాం. దేగకన్ను, పాగా, అసమ్మతి చిచ్చు, వేడెక్కిన ప్రచారం, కాంగ్రెస్ హవా, సుడిగాలి పర్యటన,

వ్యవహారంలో కొత్త అలంకారిక ప్రయోగాలను గమనిస్తాం.

అతుకుల బొంత, తుమ్మితే ఊడే ముక్కు, బందరు సీటు ఎవరికి స్వీటు, చుక్కలంటిన ధరలు – భగ్గుమన్న పెట్రోలు, 'నేలను తాకిన ధరలు' అనేది చందన వాడిన అలంకారం

క్రియాపరంగా వ్యవహారంలో చాలా మార్పులు వచ్చాయి:

కొశ్రీవేశాడు (Quiery =ప్రశ్న)

'టీవి' కట్టెయ్, ఫ్యాన్ కట్టెయ్

'స్విచ్' కట్టెయ్

ఏక్సను తిన్నాడ్రా

ఏక్సను అదిరింది

లైటు తీసెయ్, వెయ్

తన పరువునూ బరువునూ కోల్పోయిన పదాలలో 'గురువు' ముఖ్యమైనది. 'గురూ' అనే సంబోధన ఎకసక్కానికీ, వేళాకోళానికీ, అధిక్షేపానికి పరిమితమయ్యేలా వాడబడుతోంది. – కొత్త సినిమాగురూ, కామెడీ గురూ, కాఫీపట్రా గురూ.

నేటి వ్యవహార శైలిని పరికిస్తే తెలుగు తన సహజ దిశని పోగొట్టుకుంటోందని తెలుస్తుంది.

అమ్మ, చెట్టు, గోడ, పిన్ని, బాబాయి, బువ్వ, చదువు, నేల, చడ్డి, పెట్టె, బడి, అప్పచ్చి వంటి అసలైన పదాలు మరుగున పడిపోతున్నాయి.

ఒక విధంగా ఆలోచిస్తే గిడుగువారి వ్యావహారిక భాషా వాదం కొంత ముప్పు కలిగించిందనిపిస్తుంది. ఈ వాదం ఉదారవాదమైంది. విశృంఖలత్వానికి దారి తీస్తోంది. అక్షరాల, పదాల స్వరూపం తెలుసుకోనక్కరలేని స్థితి సంభవించింది. ఇంగ్లీషులో ఇప్పటికీ 'స్పెలింగ్ మిస్టేక్స్' ఉన్నాయి. కానీ తెలుగులో లేవు. ఎలా రాసినా మార్కులు సంపాదించ వచ్చు. శబ్ద స్వరూపం అక్కడలేదనిపిస్తోంది. ఋషి, ఋణం కాస్తా రుషి, రుణం అయిపోయాయి మహాత్మ్యం మహత్యం అయింది. బండి 'ఱ' సోదిలో లేకుండా పోయింది. తరతరాలుగా ఉన్న ఈ అక్షరాలు మనం ఎందుకు వదులుకుంటున్నాం? అని ప్రశ్నించుకుంటే మనం ఏదశలో వున్నమో తెలుస్తుంది.

"తెలుగునాట బుట్టి తెలుగుమాట్లాడగ
బిడియపడగలనేల బిడ్డనీవు
అమ్మమాట పలుక అంత సిగ్గేలకో
పలుకవలయుగాదె తెలుగుభాష" – వెంకటేశ్వరాచార్యులు

"సి.పి. బ్రౌన్ తెలుగు సాహిత్యసేవ"

- జానమద్ది హనుమచ్ఛాస్త్రి

ఆంగ్లేయులు మన దేశానికి వ్యాపారులుగా వచ్చారు. 31.12.1600 తేదీన ఈస్టిండియా కంపెనిని ప్రారంభించారు. కంపెని ఉద్యోగులలో అత్యధికులు మనదేశ సంపదను అక్రమంగా తమ దేశానికి తరలించారు. వారు మన దేశాన్ని పాలించారు అనడం కంటే దోపిడి చేశారు అనటం సమంజసంగా వుంటుంది.

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నట్లు కంపెనీ ఉద్యోగులలో కొందరు భారతీయ సంస్కృతిని అర్థం చేసుకొని భావవిప్లవానికి దోహదం చేశారు. అట్టి భారత హితైషులలో కలకత్తా సుప్రీంకోర్టు న్యాయమూర్తి విలియం జాన్స్, చార్లెస్ విల్కిన్స్ థామస్, కోల్‌బ్రూక్ స్మరణీయులు.

తెలుగు ప్రజలను, చరిత్రను, భాషా సాహిత్యాలను మనసారా ప్రేమించిన ఆంగ్లేయులలో మరువరాని మహనీయులు సర్‌ఆర్థర్‌కాటన్ (1803-99) కల్నల్ కాలిన్ మెకెంజి (1758-1821) సర్‌థామస్ మన్రో (1761-1827) ఛార్లెస్ ఫిలిప్‌బ్రౌన్ (1798-1884).

తెలుగు భాషా సాహిత్యాల సముద్ధరణకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు సి.పి. బ్రౌన్. అటకలపై మ్రగ్గుతూ, అసూర్యంపశ్యగా వున్న అనేక కావ్యాలను సేకరించి, పరిష్కరించిన సాహిత్య సముద్ధారకుడు సి.పి. బ్రౌన్.

"In 1825 I found Telugu literature dead. In thirty years I raised it to life" అన్న బ్రౌన్ మాటల్లో అతిశయోక్తి లేదు.సహస్రమాన జీవితకాలంలో నాలుగు దశాబ్దాల పాటు ఆర్జించిన ధనం, గడించిన పాండిత్యం ఔద్యోగికంగా సాధించిన పలుకుబడి అన్నీ తెలుగు సాహిత్య పునర్వికాసానికెంతగానో తోడ్పడినాయి. అందుకే కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు "ఆ నిష్కామ భాషాభిమాని ఆంధ్రులకు పూజాపాత్రుడు" అని నివాళులర్పించారు.

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 1798 నవంబరు 10న ఫ్రాన్సిస్‌కేత్ డేవిడ్ బ్రౌన్ దంపతుల రెండవ కుమారుడుగా కలకత్తాలో జన్మించాడు. డేవిడ్ బ్రౌన్ కలకత్తాలోని ఫోర్డ్ విలియం కాలేజీలో మతాచార్యుడుగా వుండేవాడు. గ్రీక్, హిబ్రూ, ల్యాటిన్ భాషలలోను, బెంగాలి భాషలలోను పండితుడు. ఉదారహృదయుడు. అవిశ్రాంతంగా పనిచేయుట వల్ల ఆరోగ్యం క్షీణించి 1812 జూన్ 14న మరణించాడు.

14 ఏళ్ళ సి.పి.బ్రౌన్‌తోపాటు పిల్లలతో డేవిడ్ బ్రౌన్ భార్య లండన్ వెళ్ళింది. ఈస్టిండియా కంపెనీ సహాయంతో పిల్లలను చదివించింది. సి.పి. బ్రౌన్ హెయల్‌బరికాలేజీలో లాటిన్, గ్రీక్ భాషలతో పాటు అరబిక్, పార్శి, బెంగాలి భాషలు, సంస్కృతం నేర్చు కొన్నాడు. సంస్కృతంలో ఉత్తీర్ణులైన వారికి బంగారు పతకం యిచ్చేవారు. పతకం చుట్టూ "తత్సుఖం సాత్త్వికమ్ ప్రోక్తమ్ ఆత్మబుద్ధి ప్రసాదజమ్ (భగవద్గీత 18.37) అని వ్రాసి వుండేది పతకం మధ్య 'శ్రీ విద్యావరాహ' అని చెక్కబడి వుండేది (భారతి–జనవరి 1979 సంచిక–'బ్రౌన్ స్వీయ సారస్వత కథనం – పుట 77–నిడదవోలు వెంకటరావు).

1817 ఆగస్టు 14న బ్రౌన్ మద్రాసులో కాలు పెట్టాడు. మూడేళ్ళ శిక్షణలో, మరాఠి, హిందుస్తాని భాషలతో పాటు తెలుగు నేర్చుకొన్నాడు. శిక్షణ పూర్తి చేసిన ఉద్యోగులను ఉద్దేశించి, మద్రాసు గవర్నర్ సర్‌థామస్ మన్రో "దేశభాషలలో వ్యవహార జ్ఞానం లేకపోతే మిగతా జ్ఞానాలన్నీ సివిల్ సర్వీస్ నిరుపయోగం. ప్రజల భాషను నేర్చుకొని వారిపట్ల సద్భావాన్ని పెంచుకొన్నపుడే ఏ ప్రభుత్వానికైనా రక్ష అన్నాడు. ఆ మాటలు బ్రౌన్ పై చెరగని ముద్ర వేశాయి. గవర్నర్ ప్రసంగంలోని కొన్ని వాక్యాలు :

"The advantage of knowing the country's languages is not mereley that its will enable you to carry on the public business with greater facility, but that by rendering you more intimately acquiainted with the people, it will dispose you to think more favourable of these to relinquish some of the prejudices which we are all at first too apt to entertain against them., to take deeper interest in their welfare".

1820 ఆగస్టు 18న బ్రౌన్ కడపలో ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. కలెక్టర్ హన్‌బరికంటే మిన్నగా తెలుగు పట్టుదలతో నేర్చుకొన్నాడు. అప్పట్లో తెలుగు నేర్చుకొనడానికి తగిన పుస్తకాలు లేవు. కోర్టులోని వాదులు, ప్రతివాదులు, పరిచారకులు, నేరస్థులు తనకు తెలుగు నేర్పారని వ్రాసుకొన్నాడు బ్రౌన్.

కడపలో రెండు ధర్మబడులు స్థాపించి ఉచిత భోజన వసతి తెలుగు హిందుస్తాని చదువులకు వీలు కల్పించాడు.

1822 అక్టోబర్ 26న కడప నుండి మచిలీ పట్నం జిల్లా కోర్టు రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యాడు అక్కడ కూడా రెండు ధర్మబడులు ప్రారంభించాడు. 1824లో, జె.ఏ. దుబాయ్ వ్రాసిన "Hindu Manners customs and ceremonies' అనే పుస్తకం చదువుతూ వేమనను కనుగొంటిని అన్నాడు. వేమన పద్యాల సేకరణకు పూనుకొని నలుమూలలా గాలించి వేమన పద్యాలున్న పలు తాళపత్ర గ్రంథాలను తెప్పించాడు. వఠ్యం అద్వైత బ్రహ్మశాస్త్రి వద్ద వేమన పద్యాల అర్థాతాత్పర్యాలను, ఛందో వ్యాకరణాదులను నేర్చుకొన్నాడు. 1824లో 693 పద్యాలను, 1928లో 1164 పద్యాలను ఇంగ్లీష్‌లోనికి అనువదించి సొంతపైకంతో అచ్చువేయించి, వేమన కవితను, విశ్వవ్యాప్తం చేశాడు.

'Verses of Vemana పీఠికలో 'Vemana was a nature of Endulapatu district and born, I believe in the neithbourhood of gandicota. He lived in the begunning of 18th century. Vemana was evidently in the philosophy of Vedavnt school a disciple of Vyasa, Whom Sri william James has entitled the plato of India (Verses of Vemana in Telugu original with English version-Page II & III published by The Asian Educational Series New Delhi 1986).

అనువాద సరళికి ఒక పద్యం "ఉపకారిణి నుపకారము, విపరీతముగాదు సుమ్ము వీడుకు వీడే యపకారికి నుపకారము నెపమెన్నక సేయు వాడెవ నేర్పరి సుమతీ॥ (పద్యం 15)

That kindness should be shown to the kind is no marvel for it is merely an exchange. But he who shows kindness to the unkind with out laying a fault to viees is the wisest of men".

1825 నవంబర్‌లో రాజమండ్రి కలెక్టరుకు హెడ్ అసిస్టెంట్ మేజిస్ట్రేటుగా చేరాడు. ఆంధ్ర మహాభారత పఠనం ప్రారంభించాడు. కవి జనాశ్రయం అప్పకవీయం, ఆంధ్రగీర్వాణ ఛందోరీతులను అధ్యయనం చేశాడు.

1826 మార్చిలో మరలా కడపకు బదిలీపై వచ్చాడు. తాను సేకరించిన గ్రంథాల పరిష్కరణ, శుద్ధప్రతుల తయారి పనులకు స్థావరం కావాలని నిశ్చయించాడు. కడపలో పెద్ద బంగళా, తోట రు.3500 లకు కొని, సాహిత్య సముద్ధరణ మహాయజ్ఞం ప్రారంభించాడు. ఇరవైమంది పండితులను ఏర్పాటు చేసుకొన్నాడు. తన పనుల అజమాయిషీ కోసం అత్యంత విశ్వాస పాత్రుడైన అయోధ్యాపురం కృష్ణారెడ్డిని నియమించుకొన్నాడు. ఆనాడు ఆ భవనాన్ని 'బ్రౌన్ కాలేజీ' అనేవారు. తన సాహిత్య జీవిత చరిత్రలో ఇలా వ్రాసుకొన్నాడు.

'...... and i saved no money indeed there were always from ten to twenty brahmans to sudras in my pay employed in transeribing native authors in preparing correct editions in framing indesces and commentries in Telugu. Thus these were three sets of Brahmins engaged under my roof, who people called 'Brown college'.

సాహిత్య పునరుత్థానకక్ష్యలో బ్రౌన్‌కు సన్నిహితంగా పనిచేసిన పండితులలో గరిమెళ్ళ వెంకయ్య, రావిపాటి గురుమూర్తి శాస్త్రి, అద్వైత బ్రహ్మశాస్త్రి, ములుపాక బుచ్చయ్య, కంబం నరసింహాచార్యులు, జూలూరు అప్పయ్య మొదలగు వారు ప్రముఖులు.

పాశ్చాత్య పద్ధతిననుసరించి తెలుగు కావ్యాలను పరిష్కరించి ప్రకటించిన వాళ్ళలో బ్రౌన్ ప్రప్రథముడు. లిఖితప్రతులు ఎక్కడున్నా సేకరించి పండితులచే సాధుపాఠం నిర్ణయించి, పాఠభేదాలు గుర్తించి, ప్రచురణకు వీలుగా శుద్ధప్రతులు తయారు చేయించేవాడు. పదసూచికలు వ్రాయించాడు. పద్యముద్రణలో నూతన విధానం ప్రవేశపెట్టాడు.

గ్రంథ సేకరణ ఎంతో కష్టమైనపని. దూర ప్రాంతాల వారికి తెలుగులో జాబులు వ్రాసి తెప్పించుకొనేవాడు. 1830లో మచిలీపట్నంలోని కూటి వెంకన్న భార్య వద్ద వున్న పుస్తక భాండాగారాన్ని రు. 370కి కొన్నాడు. 1874లో యానాంలోని మాజేటి సర్వేశలింగం, గ్రంథాలయాన్ని రు. 150లకు, పెద్దాపురంలోని అవసరాల వెంకటరావు గ్రంథాలున్న వారితో స్నేహం పెంచుకొన్నాడు. వారి భాషలోనే మాట్లాడేవాడు. తన వద్ద నున్న ఇంగ్లీష్ పుస్తకాలను చదవటానికి ఇచ్చేవాడు.

సమర్థులైన పండితులచే కావ్యాలకు వ్యాఖ్యానాలు వ్రాయించాడు. ఆయన మనుచరిత్ర, వసుచరిత్రలకు వ్యాఖ్యానాలు వ్రాయించి అచ్చువేయించాడు. బుచ్చయ్య శాస్త్రి వ్యాఖ్యానాల నచ్చునందున జూలూరు అప్పయ్య చేత సులభశైలిల వ్రాయించి 1844లో ప్రచురించాడు. మనుచరిత్రను వ్యాఖ్యాసహితంగా 1857లో అచ్చువేయించాడు.

బ్రౌన్ 36 పురాణేతిహాసాలను సేకరించాడు. కాశీఖండం, పద్మపురాణం, భారతం, భాగవతం భాస్కర రామాయణం, శ్రీకాళహస్తి మాహాత్మ్యం మున్నగువాటి పాఠ నిర్ణయం చేయించి శుద్ధ ప్రతులు వ్రాయించాడు. రంగనాథ రామాయణ శుద్ధశ్రుతి వ్రాయించి ఆకృతికర్త గోన బుద్ధరాజేనని ప్రకటించాడు.

ఆంధ్రమహాభారత శుద్ధప్రతి తయారికి తన 5 నెలల జీతం రు. 2714 కూడ ఖర్చు చేశాడు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ద్వితీయ తెలుగు పండితుడుగా వుండిన పురాణం హయగ్రీవ శాస్త్రి విన్నపం మేరకు తాను పరిష్కరింపచేసిన భాగవతాన్ని,

హయగ్రీవ శాస్త్రులకు ఇవ్వగా వారు 1848లో మద్రాసులోని తమ వివేకాదర్శముద్రణాలయంలో ప్రచురించాడు. ఆ భాగవత పీఠికలో, కడప సమీపంలోని ఒంటి మిట్టయే ఏక శిలానగరమని వ్రాశాడని బ్రౌన్ నిఘంటువునకు వ్రాసిన ఒక నోట్‌లో వివరించాయి. (సి.పి.బ్రౌన్–డా. కొత్తపల్లి వీరభద్రరావు పుట 163, 164–1988 ప్రచురణ)

బైచరాజు వెంకటరాజు రచంచిన పంచతంత్ర హంసవింశతులకు పదసూచికలు వ్రాయించాడు. సింహాసన ద్వాత్రింశిక, కథాసారాన్ని 43 పుటల్లో ఆంగ్లంలో సంగ్రహం చేశాడు. పాతికేళ్ళలో దాదాపు పాతిక ప్రబంధాలను పరిష్కరింప చేశాడు.

ఆంధ్రుల సామాజిక చరిత్ర గల పల్నాటి వీర చరిత్ర విభిన్న ప్రతుల సేకరించాడు. బసవ పురాణం, ప్రభులింగ లీల వంటి శైవ పురాణాలను పరిష్కరింపచేశాడు.

సాహిత్య సంబంధ సామగ్రితో పాటు, చాటుపద్యాలు, సామెతలు, జానపద గీతాలు, పలుకుబళ్ళు సమకాలీన పత్రికలలోని సంపాదకీయాలు వార్తలు, లేఖలు సేకరించి మంచి కాగితాలపై వ్రాయించి భద్రపరచాడు. మెకంజీసేకరించిన స్థానిక చరిత్రలను కైఫీయత్తులను మంచి కాగితాలపై వ్రాయించాడు. తెలుగు సంస్కృత వ్రాత ప్రతుల సేకరణ కోసం బ్రౌన్ 30 వేల రూపాయలు ఖర్చు చేశాడు.

వ్రాయసగాండ్లకు నిర్ణయించిన కూలి పైకం కుతూహలంగా వుంది. 200 పద్యాలు (800 పంక్తులు) వ్రాస్తే ఒక రూపాయి ఇచ్చేవాడు నెల జీతాలిస్తే అశ్రద్ధ చేస్తారని దినసరికూలీ ఇచ్చేవాడు. వెయ్యి సంస్కృత శ్లోకాలకు 6 రూపాయలు ఇచ్చేవాడు.

విభిన్న తాళపత్ర గ్రంథాలను పరిష్కరింపచేసిన బ్రౌన్‌ను 'ఆంధ్ర భాషావన పునరుల్మీన మధుమాసవంతుడు' అని ప్రశంసించారు.

Four or five years, I had lived in a very humble style, giving every parthing to pay first my Brahmins and secondly my debts. Even when in great difficulties I gave from two to three hundred rupees a month to my book schmes".

పండితులు వలయాకారంగా కూర్చొని తమ ప్రతులలోని పద్యాలు చదువుతుండగా లేఖకుడు వ్రాసేవాడు పాఠాలలోని తప్పులు గుర్తించని పండితునికి అర్ధరూపాయి జరిమానా వేసేవాడు. తీర్పు ఇవ్వనందుకు కారణం వ్రాయమనేవాడు. ఎన్ని తీర్పులు పండితులు చేసినా చివరి తీర్పు బ్రౌన్‌దే. తులనాత్మక అధ్యయనం చేయించిన వాడు బ్రౌన్.

41 ద్విపద కావ్యాలను పరిష్కరింపచేసి ముద్రించాడు. సామాన్య ప్రజలకు ఉత్తమ సాహిత్య మందిచాలన్న తపనతో వ్యావహారిక భాషకు ప్రాధాన్యమిచ్చాడు.

శతకాల్లోని నీతిబోధకత, భాషాసరళత భావ విస్పష్టత కారణంగా, శతకాలను పాఠ్యపుస్తకాలలో స్థానమివ్వాలన్నాడు.

తెలుగు సాహిత్యంలో బ్రౌన్ ముద్రపడని ప్రాచీన కావ్యం లేదనటంలో ఎంతో నిజం వుంది.

ఆనంద తంత్రం, సౌందర్యలహరి, కులార్ణవం మొదలగు సంస్కృత గ్రంథాలను సేకరించాడు. 14-3-1834న బ్రౌన్‌కు వ్రాసిన జాబు మేరకు బ్రౌన్ ఋగ్వేద భాష్యం వ్రాయించినట్లు ముక్త్యాల నుండి వెలువడిన 'సరస్వతి' మాసపత్రిక ప్రకటించింది.

తెలుగునాడులోని వివిధ ప్రాంతాల విద్యాధికులు సామాన్యులు ఆయనకు వ్రాసిన లేఖలు, ఉద్యోగులు బ్రౌన్ నుండి ఆర్థిక సహాయం కోరుతూ రాసిన ఉత్తరాలు 20 సంపుటాలు, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో వున్నట్లు బంగోరే పేర్కొన్నాడు. ఒక్కొక్క సంపుటంలో 400 పుటలు. చాల లేఖలు వెలుగు చూడలేదు. సమకాలీన సాంఘిక పరిస్థితులకు అద్ధం పడుతాయి ఈ లేఖలు.

బ్రౌన్‌కు అజరామరమైన కీర్తిని సంతరింపచేసినవి ఆయన కూర్చిన నిఘంటువులు. ఆయన కూర్చిన నిఘంటులకు ముందు కాంబెల్ మారిస్, మామిడి వెంకయ్య మొదలగు వారు తెలుగులో నిఘంటువులు కూర్చారు.

"తెలుగు భాషాధ్యయన సందర్భంలో తాను ఈ నిఘంటువులు కూర్చుకొన్నట్లు, ఈ నిఘంటువు ఉపోద్ఘాతంలో వ్రాసుకొన్నాడు. ప్రాచీన గ్రంథాలు కావ్యాలు, శతకాలు మొదలగు వాటిలో లభించే పదాలతోపాటు జన సామాన్యుల వాడుకలోని అనేక పదాలు చేర్చబడినందున ఈ నిఘంటువులు అనువాదకులకు ఎంతగానో ఉపయోగపడినా బ్రౌన్, ఇంగ్లీష్-తెలుగు, తెలుగు. ఇంగ్లీష్ మిశ్రభాషా నిఘంటువు, జిల్లా నిఘంటువు లిటిల్ లెక్సకన్-5 నిఘంటువులు కూర్చాడు. 1852లో లిటిల్ లెక్సకన్ రాయల సీమలోను వాడుకపదాలు ఎక్కువగా వున్నాయి.

బ్రౌన్ అభిరుచులు అనంతమైనవి. ఖగోళ శాస్త్రం, జ్యోతిషం, శిల్పం, పంచాంగం, మొదలగు విషయాల్లో కృషి చేశాడు. బ్రౌన్ 24 భాషలలో పాండిత్యం గడించాడు. చారిత్రక విషయాల పట్ల ఆసక్తితో 'రాజుల యుద్ధాలు' అనుపేర అనంతపురం చరిత్రను ఇంగ్లీష్‌లోకి అనువదించి 1853లో ప్రచురించాడు. డా.కట్టమంచి రామలింగారెడ్డి గారి 'ముసలమ్మమరణము' అనంతపురం చరిత్రలోనిదే. క్రైస్తవ ధర్మాన్ని బోధించు నిస్తర రత్నాకరములో క్రైస్తవ ధర్మబోధతోపాటు హిందూమత దూషణ మున్నట్లు గమనించి, ఆ దూషణ భాగాలను తొలగించి 1852లో ముద్రించారు.

వ్యక్తి-వ్యక్తిత్వం

బ్రౌన్ పుట్టింది కలకత్తాలో-జీవితాంతం పెళ్ళాం-పిల్లల వంటి బాదర బందీలేకుండా రేయింబగళ్ళు తెలుగు భాషా సాహిత్యాలే తన ఉపిరిగా జీవించిన సారస్వత యోగి బ్రౌన్.

నిరంతర సాహిత్య చింతనామత్తుడైన బ్రౌన్‌ను అతని మిత్రులు పిచ్చివాడనే వారిని వ్రాసుకొన్నాడు. "At various times i have been considered (and by myself) as some what insame....those who have known me intimately have judged me wholly same".

మహత్తర లక్ష్యసాధన కోసం శ్రమించి వాళ్ళనందరినీ సమాజం సాధారణంగా పిచ్చివాళ్ళనే భావిస్తుంది. బ్రౌన్‌కు తెలుగు పిచ్చి వుండేది.

ఉద్యోగ విధులను ఏమాత్రం విస్మరించలేదు విరామం దొరికనపుడల్లా సాహిత్య సేవలో మునిగిపోయేవాడు.

"Want of leisure, so often lamented in India, usually devotes want of inclination; I have always had leisure".

బ్రౌన్‌కు అపారమైన భూతదయ వుండేది. ఎందరో నిరుద్యోగులను ఆదుకొన్నవాడు. తన సంపాదనలోని ప్రతి రూపాయికి పైసావంతున దానధర్మాలకు కేటాయించాడు. వివిధ ధర్మసంస్థలలో సభ్యుడు. ప్రజల కష్టాలకు చలించిపోయేవాడు.

1832లో గుంటూరు జిల్లాలో భీకరమైన కరువు ఏర్పడినపుడు 'Famine' తీవ్రంగా వుందని, ప్రభుత్వానికి వ్రాశాడు. ఆ పదాన్ని తొలగించి Scarcity, drought వాడి మరలా పంపమన్నారు. ససేమిరా వీలుకాదని ఎక్కువ సహాయం మంజూరు చేయించుకొన్న ప్రజాపక్షపాతి.

పాతకడపలో సతీసహగమనం జరుగనున్నట్లు విని, ఏతాసు సహాయంతో, ఆ మహిళను కాపాడిన దయామయుడు బ్రౌన్.

బ్రౌన్ తెలుగు సాహిత్య సముద్ధరణలో నిరంతరం సహకరించిన అయోధ్యాపురం కృష్ణారెడ్డిని "My friend philosopher' అని కొనియాడాడు.

బ్రౌన్ దాతృత్వాన్ని ప్రశంసిస్తూ సమకాలీన పండితుడు ములుపాక బుచ్చయ్య.

"నూర్లార్లు లెక్కచేయక

పేర్లెక్కిన విబుధవరుల బిలిపించుచువే

మార్గ్ధమిచ్చు వితరణి

ఛార్లెసు ఫిలిప్పు బ్రౌన్ సాహెబు కరుణన్

అని కొనియాడాడు.

సి.పి. బ్రౌన్ పాండిత్యం పండితలోకంలో పెద్దపీట వేసింది. సహృదయత్వం ప్రజాహృదయాన్ని ఆకర్షించింది.

సి.పి. బ్రౌన్‌కు నివాళి

బ్రౌన్ గురించి ఆనాటి ప్రముఖులలో ఒకరైసు అద్వైత బ్రహ్మశాస్త్రి ఇలా అన్నారు.

"సరస్వతికి ప్రస్తుతమందు తమరు ఒకరే నివాస స్థానముగా కనబడుతున్నారు. గనుక యెక్కడ యేయే విద్యలు దాచబడివున్నవో అవి అని తమంతట తామే తమ సన్నిధికి వస్తూ వున్నవి యీలాగురావటం వల్ల ఆయా విద్యలు అభివృద్ధి అవుతూ వున్నవి... యందున గురించి తమరు పుచ్చుకొన్న ప్రయాస వల్ల తేలిన పరిష్కార గ్రంథములు ఆకల్పాంతమున్ను తమ యొక్క కీర్తిని విస్తరింపచేస్తూ వుంటవి."

ఆ కీర్తి విస్తరణ చిహ్నంగా కడపలో ఆయన నివసించి సాహిత్య యజ్ఞంచేసిన స్థలంలో గ్రంథాలయం, పరిశోధన కేంద్రం వెలసింది. 1976లో కడప కలెక్టరుగా వుండిన డా.పి.యల్. సంజీవరెడ్డి డా.ఆరుద్ర, డా.జి.ఎన్.రెడ్డి, బంగోరెగార్ల కోరిక మేరకు బ్రౌన్ బంగళాశిథిలాలున్న 20 సెంట్ల స్థలాన్ని, యజమాని సి.కె. సంపత్‌కుమార్ నుండి విరాళంగా అందుకొన్నారు. కలెక్టర్ జంధ్యాల హరినారాయణగారు ప్రథాన పోషకులుగా సి.పి. బ్రౌన్ మెమోరియల్ ట్రస్టు ఏర్పడింది. 1987 జనవరిలో వారే గ్రంథాలయానికి శంకు స్థాపన చేశారు. 1998లో బ్రౌన్ ద్విశతజయంతి నవంబరు 14, 15 తేదీలలో వైభవంగా జరిగింది. గ్రంథాలయ భవనం మొదటి అంతస్తులోని సమావేశ మందిరాన్ని, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, డా.సి. నారాయణరెడ్డిగారు ప్రారంభించారు. కలెక్టర్ల సహాయం దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతూ వుంది. 2003లో, డా.సి.నారాయణరెడ్డి గారు రాజ్యసభ సభ్యుల నిధి నుండి రూ.10 లక్షలతో రెండవ అంతస్తును నిర్మింపచేసి వారే 2003 నవంబరు 10వ తేదీన ప్రారంభించారు.

ఈనాడు 30 వేల విభిన్న భాషలలో విలువైన గ్రంథాలతో సాహిత్య పరిశోధకులకు, పాఠక విద్యార్థులకు విజ్ఞాన ప్రదాతగా బ్రౌన్‌కు నివాళి అర్పిస్తున్నది.

ఆ భాషాజీవి చేసిన చిరస్మరణీయ సేవల చిహ్నంగా వెలుగుతున్నది బ్రౌన్ గ్రంథాలయం.

ఈనాడు "తెలుగు సూర్యుడు" సి.పి. బ్రౌన్ సాహిత్య సేవను గురించిన ఉపన్యాసం యిచ్చే సదవకాశం కల్పించిన ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు, జ్ఞానపీఠపురస్కార గ్రహీత డా.సి. నారాయణరెడ్డిగారికి, డా.కె. అంజిరెడ్డి ధర్మనిధి వ్యవస్థాపకులు, పద్మశ్రీ డా. అంజిరెడ్డిగారికి, బ్రౌన్ గ్రంథాలయానికి మూడువేల గ్రంథాలను విరాళంగా యిచ్చిన ఆచార్య బిరుదు రాజు రామరాజుగారికి, సభకు విచ్చేసిన సాహిత్య సంగీత మూర్తులకు నా హృదయపూర్వక నమస్సులు.

నూరేండ్ల చరిత్రక నవల-సింహావలోకనం

-ఆచార్య ముదిగొండ శివప్రసాద్

తెలుగులో చారిత్రక నవల పుట్టి నూరు సంవత్సరాలైంది. తెలుగు నవలకు నూటపాతికేళ్ళ చరిత్ర ఉంటే అందులో నూరేళ్ళ చరిత్ర చారిత్రక నవలదే. తొలి తెలుగు నవల "మహాశ్వేత".... కాదంబరికి అనువాదం రంగరాజు చరిత్ర. పేరులో చరిత్ర ఉంది కనుక ఇది చారిత్రక నవల అని భ్రమ పడకూడదు. రంగరాజు అనే జమీందారుకు 'నీల' అనే బంజారా యువతికీ మధ్య జరిగిన ప్రణయ (సాంఘిక) గాథ ఇది. అలాగే రాజశేఖర చరిత్ర కూడ. ఇలా పరిశీలిస్తూ పోతే 1896లో వెలువడ్డ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారి "హేమలత" మొదటి తెలుగు చారిత్రక నవల అని నిర్ధారించవచ్చు. నాడు-నేడు: ఆనాడు స్వాతంత్ర్యకాంక్ష తీవ్రంగా ఉండేది. గత వైభవ పునరుద్ధరణం అందులోని భాగమే. అందువల్లనే ఆ కాలంలో చారిత్రక నవలలు పుంఖాను-పుంఖాలుగా వచ్చాయి. స్వాతంత్ర్యోద్యమ నాయకులకు స్ఫూర్తినిచ్చిన నేపథ్యం చారిత్రక నవల నిర్మించింది. ఈ విధంగా జాతికి స్వాతంత్ర్యం తెచ్చిన సాహిత్య ప్రక్రియ ఏది? అంటే చారిత్రక నవల పేరు ముందుగా చెప్పాలి (ముందుగా అనడంతో చారిత్రక కావ్యాలు గౌరములని అర్థకారణం అది పండిత జనరంజకములు మాత్రమే కావడం) చారిత్రక స్పృహలేనివాడు చరిత్ర హీనుడౌతాడని మన పూర్వులు గుర్తించి బెంగాలి, హిందీ, కన్నడ భాషానవలల్ని కూడా తెలుగులోకి అనువదించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రాంతాల సాహస గాథలు తొలి తెలుగు చారిత్రక నవలకు ఇతి వృత్తాలు. అడవి బాపిరాజు నుంచి ఒక క్రొత్త పరిణామం వచ్చింది. శాతవాహనులు, ఇక్ష్వాకులు విష్ణుకుండినులు, చాళుక్యులు, కాకతీయులు, విజయనగర రాజులు -ఇట్లా తెలుగు రాజులు నవలల్లో దర్శనమిచ్చి రచయితలకుపాథేయాలయ్యారు. వారి గాథలుఉపాదేయాలైనాయి.

స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి స్థితిగతులు :

ఒక వైపు నేతాజీ తీవ్రవాదం, మరొక వైపు గాంధీజీ మిత వాదం స్వరాజ్య కాంక్షతో జాతిని నడుపుతున్న రోజులవి. అప్పుడు భావ కవిత్వంలో అంతర్భాగంగా

దేశభక్తి కవిత్వం విజృంభించింది. ఆంధ్రప్రశస్తి ఆంధ్రపౌరుషము, ఓరుగల్లు కోట, హంపీ క్షేత్రము, దాక్షారామము వంటి ఖండకావ్యాలు, రాణా ప్రతాప చరిత్ర, శివభారతము వంటి మహాకావ్యాలు వెలువడ్డాయి. జాతిని ప్రభావితం చేశాయి. ఐతే నవలా ప్రక్రియ ఇంతకన్నా సర్వశ్రేష్ఠమైనదని ఉద్యమశీలురైన రచయితలు గుర్తించారు.

అంతేకాదు-ప్రత్యక్షంగా ఆంగ్లేయులను విమర్శించే రచనలను నిషేధించారు. నిజాం రాష్ట్రంలో గ్రంథాలయోద్యమం అప్పుడే ప్రారంభమైంది. పైకి నాలుగు పుస్తకాలు, పత్రికలు వేసి లోపల జాతీయోద్యమం నడుపుతూ ఉండేవారు. నిజాం నవాబు "రోషనార" వంటి నాటక ప్రదర్శనలను కూడా నిషేధించాడు. అందువల్ల గతవైభవ పునరుద్ధరణలో భాగంగా ప్రాచీన చారిత్రకేతి వృత్తాలు స్వీకరించి వచన ప్రబంధాలు అందించాలనే నిర్ణయానికి రచయితలు వచ్చారు. బకించంద్ ఆనందమఠ్ (1914) అలాంటిదే. అందలి సంతానాలు భారత సంతానమే. ఇలా చారిత్రక నవలలు ఒక్కసారిగా అన్ని భారతీయ భాషలలోను దర్శనమిచ్చాయి.

ప్రోత్సహించిన సంస్థలు :

తెలుగులో కందుకూరి ప్రభృతులు పోటీలు పెట్టా చారిత్రక నవలను ప్రోత్సహించారు. చింతామణి, వివేకవర్ధని వంటి పత్రికలు. ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రగ్రంథమాల వంటి కాశీనాథుని వారి సంస్థలు, తరవాత ఆంధ్రవిశ్వకళా పరిషత్ వారు ఇలాగే పోటీలు నిర్వహించి చారిత్రక నవలలను పోషించారు. ఇదంతా జాతీయ ఉద్యమంలో ప్రధాన భాగమయింది.

చారిత్రక పరిశోధకులు :

ఇది ఇలా ఉండగా సర్వశ్రీ కోట వెంకటాచలం, మల్లంపల్లి సోమశేఖరశర్మ, మారేమండ రామారావు ఆదిరాజు వీరభద్రరావు, తిరుమల రామచంద్ర, బి.ఎన్.శాస్త్రి, నేలటూరి వెంకటరమణయ్య, ప్రభృతులు ఆంధ్ర, భారతదేశ చరిత్రలు విస్తృతంగా పరిశోధించి శాసనాలను పరిష్కరించి విద్వాంసులకు అందజేశారు. 'ఈ చరిత్ర జ్ఞాన నిర్మలాంభ: పూరము ఊషరక్షేత్ర వర్షోదకమయింది.

మూలస్తంభాలు:

తెలుగు చారిత్రక నవలామంటపం ప్రధానంగా అడవి, విశ్వనాథ, నోరి అనే మూడు మూలస్తంభాలపై నిర్మించబడింది. బాపిరాజు అక్షర శిల్పి, విశ్వనాథలో రసశిల్పం, ఔద్ధత్యం, తీవ్రం, నోరిలో చారిత్రక ప్రామాణ్యం ఎక్కువ.

ఒక యోగం - ఒక యాగం

చారిత్రక నవల వ్రాయడం సాంఘిక నవలకన్నా కష్టం. ఎందుకంటే, కాలానికి సంబంధించిన సమగ్ర సమాచారం తెలిసి ఉండాలి. ఒక్కొక్కప్పుడు రెండు మూడు వేల ఏళ్ళు వెనక్కి వెళ్ళి పరిశోధించాలి. అందుకే ప్రతి చారిత్రక నవలా రచయితలో ఒక పరిశోధకుడు, ఒక కవి, ఒక కథకుడు దాగి ఉంటాడు. ఈ సందర్భంలో చారిత్రక నవల గూర్చి భారతదేశంలో చారిత్రక నవలా రచనకు ఆద్యుడైన బంకించంద్ర చటర్జీ అన్న మాటలు గమనార్హం. నవల అంటే సృజనాత్మక రచనయే కాని చరిత్ర కాదు. నవలా రచయిత అంతర్లీన అంశాలపట్ల శ్రద్ధ వహించాలేతప్ప–చరిత్ర మీద శాసనాల మీద కాదు. ఈ నిర్వచనాన్ని యథాతథంగా స్వీకరిస్తే అప్పుడది 'ఏకవీర' లాంటి చారిత్రక ప్రామాణ్యం లేని శుద్ధ సృజనాత్మక నవల కావచ్చు. అందుకే చారిత్రక నవలా రచన ఒక యోగం. ఒక యాగం. ఒక తపస్సు. వేల సంవత్సరాల నాటి నాణేలు, శిలా శాసనాలు, విదేశీయుల వ్రాతలు పరిశోధించి కఠోర పరిశ్రమ చేస్తేనే కాని ఒక చారిత్రక నవల ప్రతిభావంతంగా, సృజనాత్మకంగా అవతరించదు. (అనుభవమంటపం' అనే బసవేశ్వరుని జీవిత చరిత్ర నవలగా వ్రాయడానికి నాకు పది సంవత్సరాలకు పైగా పరిశోధన అవసరమైంది) చారిత్రక నవలకు మామూలు శైలి పనికిరాదు. కథాకాలానికి సంబంధించిన సరళ భాషను పొందుపరచాలి దీనినే ఇంగ్లీషులో ఎపిక్ సింప్లిసిటి (ఇతిహాసిక సారళ్యం) అంటారు. అట్లాగే చారిత్రక నవలలు అన్నీ ఒకే వర్గానికి చెందవు. ఇందులో కొన్ని రొమాంటిక్, హిస్టారికల్ నవలలుంటాయి. సుప్రసిద్ధ ఆంగ్ల చారిత్రక నవలా రచయిత 'స్కాటో' నిర్వచనం ప్రకారం చారిత్రక నేపథ్యం మాత్రమే ఉండి కాల్పనిక భావోద్దీప్తి (రొమాంటిక్) కల నవలను కాల్పనిక చారిత్రక నవల అనవచ్చు. తెలుగులో 'ఏకవీర' అందుకు చక్కని ఉదాహరణ. హిందీ రచయిత చతురసేనశాస్త్రి నిర్వచనం ప్రకారం చారిత్రక నవలలోని అద్భుత, వీర, శృంగారాలు కలిసిన ఇతిహాసము అనేది ఆవిర్భవిస్తుంది అని చెప్పారు.

చారిత్రక రసము అంటే ఏమిటి? శ్రీ చతురసేన శాస్త్రిగారు హిందిలో "ఐతిహాసిక" రసము అని ప్రయోగించిన పదాన్ని చారిత్రక రసం అని తెలుగులో అనవలసి ఉంటుంది. తెలుగులో ఐతిహాసిక "శబ్దము భారత, రామాయణాలకు మాత్రమే పరిమితం. చరిత్ర (హిస్టరీ) అనే అర్థం హిందీలో "ఐతిహాసిక" శబ్దము వాడారు. చరిత్ర అంటే సంస్కృతంలో "క్యారెక్టర్" (సౌశీల్యం) అనే అర్థంలో ప్రయోగం ఉంది. అందువల్ల మన తెలుగు నుడిగారం, పరిభాషను అనుసరించి చారిత్రక రసం అందాము. ఇంతకూ చారిత్రక రసం అంటే ఏమిటి? తక్కిన కావ్యాల్లో, నవలల్లో కథలల్లో ఒక అంగిరసం, కొన్ని

అంగరసాలు ఉంటాయి. ప్రబంధాలలో శృంగారం ప్రధాన రసం. మహాకావ్యాలలో శృంగార వీరాలు ప్రధాన రసాలు. చారిత్రక నవలలో శృంగార, వీరాలలో ఒకటి ప్రధాన రసం కాగా రెండవది ద్వితీయ స్థాయిని ఆక్రమిస్తుంది. త్రివేణిలోని అంతర్వాహినివలె అద్భుత రసం నిక్షిప్తమై ఉంటుంది. భక్తి (రూపగోస్వామి) దైవరూపమైనది. ఇదే చారిత్రక నవలా రససిద్ధాంతం. ఇక్కడ దశరూపమౌతుంది. హాస్యం అంటరసమవుతుంది. ఇదే చారిత్రక నవలా ప్రయోజనం. పాటకుడు కథాకాలానికి వెళ్ళి నాయకునితో తాదత్మం పొంది పరిశుద్ధుడౌతాడు. అయితే అతడు అట్లా కలలలో తేలిపోక వర్తమాన సామాజిక వైయక్తిక జీవితానికి తద్వారా స్ఫూర్తిని పొందుతాడు. ఇదే చారిత్రక నవలా లక్ష్యం.

సామాజిక చారిత్రక నవల

చారిత్రక నవలల్లో సామాజిక చారిత్రక నవలలు అనే మరో అంతర్భాగం కూడా ఉంది. అల్లూరి సీతారామరాజు మీద ఇటీవల వచ్చిన నవల ఒకటి సామాజిక చారిత్రక నవలా విభాగంలోకి తీసుకోవచ్చు. అలాగే గాంధీజీ, నేతాజీల వంటి మహనీయుల జీవితాలపై వచ్చిన రచనలు కూడా ఈ విభాగానికే చెందుతాయి. 'మాలపల్లి' కూడా ఈ విభాగంలోకి చేర్చవచ్చునేమో పరిశీలించండి.

అన్యభాషలు–చారిత్రక నవల

నవలను హిందీలో ఉపన్యాస్ అని మహారాష్ట్రలో కాదంబరి అని అంటున్నారు. గురుదత్ వైద్య, బృందావన్‌లాల్ వర్మ హిందీలోను, పాన్నియన్ సెల్వన్‌కల్కి, స్వామి వంటి రచయితలు తమిళంలోను హరినారాయణ్ ఆప్టే ప్రభృతులు మహారాష్ట్రలోను లబ్ధ ప్రతిష్ఠితులైన చారిత్రక నవలా రచయితలు (పూర్తి వివరాలు అనుబంధంలో చూడండి) స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చాలి: ఇది స్వతంత్ర్య భారత స్వర్ణోత్సవ సంవత్సరం. స్వరాజ్యాన్ని సురాజ్యంగా తీర్చిదిద్దుకోవడానికి చారిత్రక నవల ఎంతో తోడ్పడుతుంది. అటు సమాజంలోను ఇటు సాహిత్యంలోనూ విలువలు బాగా పడిపోతున్న ఈ రోజుల్లో చారిత్రక నవల వ్రాయడం. దానిని పాఠకుల వద్దకు తీసుకొని వెళ్ళడం కష్టసాధ్యమౌతుంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా వ్యాప్తితో దర్శకులు (వ్యూయర్స్) పెరిగి పాఠకులు తరిగిపోతున్న కాలంలో చారిత్రక నవల వ్రాయడం కన్నా దాని ప్రచారం శ్రమతో కూడిన పని అయినా సాంస్కృతిక పునరుజ్జీవనానికి చారిత్రకనవల సంజీవని కాబట్టి కష్టాలకోర్చి ఈ ప్రక్రియను సమాజానికి అందించాలి. ఆనాడు విజ్ఞాన చంద్రిక, వేగుచుక్క, అణా ఆంధ్రగ్రంథమాల వంటి గ్రంథమాలలు చారిత్రక నవలను ఉద్యమంగా వ్యాప్తి చేశాయి. నేడు ఆ బాధ్యత కేవలం పాఠకులదే.

ఈ వ్యాసం చివర పాఠకుల ఉపయోగార్థం ప్రముఖ చారిత్రక నవలా రచయితలు, వారి రచనలు ఇస్తున్నాను. నూరేళ్ళ చారిత్రక నవలా వికాసంలో ప్రాతఃస్మరణీయులైన వారి పేర్లైనా ఈ తరం విద్యార్థులకు తెలియజేయాలనే దృష్టితో ఈ చిన్న ప్రయత్నం చేశాను. ఈ జాబితా సమగ్రం కాదు. అందుకై ఇంకా గట్టి పరిశోధనలు జరగాలి. అట్లాగే ముందే చెప్పినట్లు చారిత్రక నవలలను ప్రోత్సహించి ప్రచారం చేసిన వివిధ సాహిత్య ప్రచురణ సంస్థల గురించి కూడా పరిశోధక విద్యార్థులు మరింత సమగ్రంగా పరిశోధించాల్సి ఉంది. అలాంటి స్పృహతో ఎవరైనా ప్రయత్నిస్తే వారికిది స్ఫూర్తి నిస్తుందని నా ఆశ.

చారిత్రక నవలా ప్రయోజనాలు :

మన చరిత్రకు గౌరవం, ప్రాచుర్యం కల్పించడం, పాఠకులతో ఉత్తమ సంస్కారం పెంపొందించటం, తెలుగు చారిత్రక నవలకు అంతర్జాతీయ కీర్తి ప్రతిష్ఠలను సమకూర్చాలన్న ఆశయంతో తెలుగునాట ఈ చారిత్రక నవలాపరిశోధనా కృషి జరగాలి. చరిత్రను ఆంగ్లేయులతో బాటు స్వదేశీయులు ముఖ్యంగా సామ్యవాదులు వక్రీకరించారు. అందువల్ల నిజమైన చరిత్రను ఆధారంగా చేసుకొనవలసిన అవసరం ఉంది.

ఇక్కడ పాఠకుల సౌకర్యార్థం తెలుగులోని కొన్ని ప్రధాన చారిత్రక నవలల పేర్లు ఇస్తున్నాను. వానిలో ఎక్కువ భాగం 1896 సంవత్సరం నుండి 1947కు ముందే వెలువడ్డాయి.

తెలుగు చారిత్రక నవలలు

స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చినవి. శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం, హేమలత, అహల్యబాయి, సౌందర్యతిలక, శ్రీవేలాల సుబ్బారావు రాణీసంయుక్త. శ్రీ మొసలికంటి సంజీవరావు మొగలాయి దర్బారు (ధీరేంద్రనాథ్‌పాల్ నవలకు అనువాదం శ్రీ కేతవరపు వెంకటశాస్త్రి రాయచూరు యుద్ధము. శ్రీ భోగరాజు నారాయణమూర్తి విమలాదేవి, అస్తమయం, అల్లాహో అక్బర్. శ్రీ దుగ్గిరాల రాఘవ చంద్రయ్య విజయనగర సామ్రాజ్యము. శ్రీ నేలటూరి వెంకటరమణయ్య ఛత్రగ్రాహి, మధుమావతి శ్రీ తెన్నేటి సూరి–ఛంఘిజ్‌కాన్. శ్రీ వాసిష్ఠ గణపతి ముని సత్యప్రభ (ఆంధ్ర మహావిష్ణువునాట కథ) శ్రీ వీణాధరములుగు శివానందమూర్తి కమల (రాజపుత్రుల కథ)

శ్రీకాళ్ళకూరి నారాయణరావు–ప్రతాప రుద్రమదేవి, శ్రీవెంకట పార్వతీశ్వర కవులు–సుధాశరశ్చంద్రము (అనువాదం) శ్రీ ఆలూరి భుజంగరావు జయ ఔధేయ (సాంకృత్యాయనకు అనువాదం) శ్రీశ్రీ అడవి బాపిరాజు–హిమబిందు, అడివిశాంతిశ్రీ,

అంశుమతి గోనగన్నారెడ్డి. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ–ధర్మచక్రము, బద్దన్నసేనాని, కడిమి చెట్టు, ఏకవీర, కాశ్మీర రాజతరంగిణి. శ్రీ అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు టిప్పుసుల్తాన్(అనువాదం) శ్రీ ఎన్.రామచంద్ర–నూర్జహాన్.

శ్రీ నేలమూరి ప్రసాదరావు, వీరకంపరాయలు

స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చే నిమిత్తం స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన చారిత్రక నవలలు. శ్రీ పిలకా గణపతి శాస్త్రి–విశాలనేత్రాలు, మీనాంబిక. శ్రీధూళిపాళ శ్రీరామమూర్తి, భువన విజయము, గృహరాజుమేడ, శ్రీ బి.యన్.శాస్త్రి–వాకాటమహాదేవి (విష్ణుకుండినులనాటి కథ) శ్రీ కాకర్ల వెంకటరామ నరసింహం–కనకాభిషేకం (శ్రీనాథుని కల) శ్రీమతి కె.కుసుమాబాయి–రంగాజమ్మ (తంజావూరు నాయక రాజుల కాలంనాటి కథ)

శ్రీ తిరుమల రామచంద్ర – శాంతల (కన్నడ నుంచి అనువాదం)

శ్రీ కొండూరి నరసింహం – పురుషోత్తముడు (అలెగ్జాండర్ నాటి కథ)

శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి – చిత్రశాల. శ్రీ భండారు సదాశివరావు–జైసోమనాథ్ (కె.యమ్.మున్షీ రచనకు అనువాదం)

శ్రీ సూరంపూడి సీతారాం – రెండు మహానగరాలు (డికెన్స్‌కు అనువాదం)

శ్రీ నరసింహశాస్త్రి – నారాయణభట్టు, రుద్రమదేవి, మల్లారెడ్డి, కవిద్వయం, ధూర్జటి, వాఘీరా, కవిసార్వభౌముడు

కుమారి మల్లాది వసుంధర–తంజావూరు పతనము, సప్తపర్ణి, రామప్పగుడి, పాటలి

ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్–నాగానీక, శ్రీలేఖ, శ్రావణి, వసంత గౌతమి, ఆచార్య నాగార్జున, (నాగపూర్ణిమ) ఆషాఢ గౌతమి, శ్రీపదార్చన, తంజావూరు విజయము, అనుభవ మంటపం, చంద్రకళ–ఆవాహన, రెసిడెన్సీ, విద్యాధర చక్రవర్తి –పట్టాభి

శ్రీ కొండూరి వీరరాఘవాచార్యులు – మోహనాంగి, కళారాధన

శ్రీ తుమ్మల పల్లి రామలింగేశ్వర రావు – తిక్కన సోమయాజి

శ్రీ సి. రాజగోపాలనాయుడు – రామానుజుని ప్రతిజ్ఞ

శ్రీమతి లల్లాదేవి (కలంపేరు) మా తెలుగుతల్లి, మల్లమ్మపతిభక్తి

శ్రీ పాలపర్తి రామ ప్రసాద్ – ఆర్య చాణక్య, రోషనార

శ్రీ తుమ్మపూడి కోటేశ్వరరరావు – వసంతోత్సవము

రష్యన్ టాల్‌స్టాయ్ అనువాదము - యుద్ధము - శాంతి

(ఫ్రెంచి) విక్టర్ హ్యూగో అనువాదము - హంచ్ బ్యాక్ ఆఫ్ నాటర్ డాం

అలెగ్జాండర్ డ్యూమాస్ అనువాదము - కాంటో ఆఫ్ క్రిస్టో

విజయ - ఉజ్జయినీ పతనం. (గురుదత్త వైద్య నవలకు అనువాదం)

ఉపసంహారం :

అటు పాఠకులకు ఓపిక ఇటు రచయితలకు వుత్పన్నత తగ్గటంతో చారిత్రక నవలా రచనను నిర్లక్ష్యం చేయడం కన్పడుతున్నది. తద్వారా ఒక జాతి తన అచేతనకు మారిపోయే అవకాశం ఉంది. అవిచ్ఛిన్నం ద్వారా ప్రవాహంవలె సాగే సంస్కృతిని చారిత్రక నవల రక్షిస్తుంది. పోషిస్తుంది. గుర్తు చేస్తుంది. అందుకే ఏ జాతిలోనైనా చారిత్రక నవలా రచయితలకు అగ్రతాంబూలం ఇస్తారు. ఇంగ్లీషులో డిక్షెన్లు, హిందీలో భృందావన్ లాల్ వలె తెలుగులో విశ్వవాథ, బాపిరాజు, నోరి కట్టినారు.

తెలంగాణా తెలుగు పదాలు - ఉర్దూ మూలాలు

-డా॥ ఎస్. సదాశివ

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల ప్రజలు మాట్లాడుకునే భాష తెలుగు. గ్రాంథిక రూపంలో ఉన్నప్పుడు ఈ నాలుగు ప్రాంతాల భాష ఒకే విధంగా వుంటుంది. కానీ వ్యావహారికమైనప్పుడు నాలుగు ప్రాంతాల భాష వేరు వేరుగా వుంటుంది. తెలంగాణా ప్రాంతం భాష మిగతా మూడు ప్రాంతాల భాష కంటే మరీ భిన్నంగా వుంటుంది. అందుకు కారణం తెలంగాణా ప్రాంతపు తెలుగులో ఉర్దూ, హిందీ, మరాఠీ పదాలు అధికంగా కలసి వుండటమే.

ఉర్దూ ఒక ప్రత్యేక భాష కాదు. ఉత్తరాన అనేక ప్రాకృత అపభ్రంశ భాషల శబ్దాలలో ఫారసీ, అరబీ, తుర్కీ శబ్దాలు కలిసి కలగాపులగంగా యేర్పడిన భాష ఉర్దూ. ఉర్దూ భాషా పదమంటే అది ఉత్తరాదికి చెందిన ఏ ప్రాకృత భాషా పదమో, ఫారసీ పదమో, అరబీ పదమో, తుర్కీ పదమో కావచ్చు. 14వ శతాబ్దిలో మనదేశంలోనే రూపుదిద్దుకున్న ఉర్దూ భాషకు ఉర్దూ అనేపేరు 18వ శతాబ్దంలో కలిగింది. అంతవరకు ఆ భాషను హిందుయి, జబానె-హిందుస్తాన్ అనే పేర్లతో వ్యవహరించేవాళ్ళు.

దక్కన్ ప్రాంతంలో ముస్లిం రాజ్యాలేర్పడిన తరువాత పాలకులకు ప్రజలకు వారధిగా ఒక భాష యేర్పడ వలసి వచ్చింది. ఆ భాషను దక్కనీ ఉర్దూ అన్నారు. ఉత్తరాది నుంచి కొందరు సూఫీయోగులు, చాలామంది సైనికులు, కొందరు సైనికాధికారులు, కొందరు వృత్తిపనివాళ్లు. కొందరు వర్తకవ్యాపారం చేసేవాళ్లు గుల్బర్గా ప్రాంతాలలో స్థిరపడ్డారు. దక్కనీ భాష యేర్పడటానికి కారణం ఉత్తరాది నుండి వచ్చిన వాళ్ళ కలగాపులకగం భాష ఈ ప్రాంతపు భాషల శబ్దాలతో కలసిపోయి యేర్పడిన భాషే దక్కనీ భాష. ఈ భాష మహారాష్ట్ర ప్రాంతంలోనూ, తెలుగు ప్రాంతంలోనూ యేర్పడింది.

ఉత్తరాదిన రూపుదిద్దుకున్న ఉర్దూ భాషకు సరైన పేరు ఖరారు కాకముందే, అందులో ఎటువంటి సాహిత్య రచనలు జరుగక ముందే, దక్కనీ భాషలో సాహిత్య

నిర్మాణం ప్రారంభమయింది. దక్కనీ భాషాపదాలు ఇక్కడి తెలుగు భాషలో కలిసిపోయినాయి. తరువాత నిజాంకాలంలో ఉత్తరాది విద్వాంసులు, ఉద్యోగులు దక్కన్‌కు వచ్చినందువలన ఇక్కడి తెలుగులో ఉత్తరాది ఉర్దూ పదాలు కూడా కలిసినాయి. నిజాం పాలకుల కాలంలో విద్యాలయాన్నింటిలోనూ, అంటే, ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యాబోధన ఉర్దూ మాధ్యమంలో జరిగినందున ఇక్కడి భాషలలో ఉర్దూ పదాలు విరివిగానే చేరిపోయినాయి. అదిగాక తెలంగాణా జిల్లాల ఉత్తరాన చాలాభాగం, చాలాభాగం పశ్చిమాన మహారాష్ట్ర ప్రాంతం వున్నందు వలన ఇక్కడి తెలుగులో మరాఠీ పదాలు కూడా కలిసినాయి. కొంత కర్ణాటక భాగం కూడా పశ్చిమాన వున్నందున కొన్ని కన్నడ పదాలు ఇక్కడి తెలుగులో కలిసినాయి. తెలుగులో కలిసిన ఇన్ని రకాల భాషలను పేరుపేరున కాకుండా అన్య భాషా పదాలంటే సౌకర్యంగా వుంటుంది. నేనిప్పుడు చెప్పబోయేది "తెలంగాణా తెలుగు పదాలు-అన్య భాషల మూలాలు". అయితే అన్య భాషల్లో నాల్గయిదు భాషల పదాలు తనలో కలుపుకున్న ఉర్దూ భాషా పదాలే అధికంగా వున్నాయి కనుక, "తెలంగాణా తెలుగు పదాలు-ఉర్దూ మూలాలు" అనే శీర్షిక నిర్ణయిస్తే సరిపోతుందనుకుంటాను.

ఒక భాషా పదాన్ని మరొక భాష స్వీకరించటం కొత్తకాదు. అనేక భాషలు మాట్లాడే ప్రజలు ఒక చోట కలిసి మెలిసి వుండవలసి వచ్చినప్పుడు భాషల ఆదాన ప్రదానం సహజమే. ఒక భాషా పదాలను ఇంకొక భాష స్వీకరించేటప్పుడు కొన్ని సందర్భాలలో ఏదేని ఒక విభక్తి ప్రత్యయం చేర్చి పదాన్ని యధాతధంగా స్వీకరించుట జరుగుతుంది. లేదా ఒక అక్షరం చేర్చి, లేదా ఒక అక్షరాన్ని తొలగించి, లేదా ఒక అక్షరాన్ని మార్చి స్వీకరించుట జరుగుతుంది. స్వీకరించిన భాష తాను స్వీకరించిన పదాల మూలార్థాన్నే గ్రహిస్తుంది. కొన్ని సందర్భాలలో స్వీకరించిన భాష, తాను స్వీకరించిన పదానికి మూలంలోని అర్థంతో కాక వేరే అర్థంతో గ్రహిస్తుంది.

భారతీయ భాషల మీదనే కాక ఆర్యభాషలైన ఫారసీకం ఆంగ్లం, జర్మనీ మొదలైన భాషల మీద సంస్కృత ప్రభావం ఎట్లా వున్నదో భాషా శాస్త్రవేత్తలకు తెలిసిందే. అయితే భారతీయ భాష లన్నింటికంటే తెలుగు మీదనే సంస్కృత భాషా ప్రభావం అధికంగా వున్నది. ఉర్దూ బోధనా మాధ్యమంగా గల తెలంగాణా ప్రాంతంలోనూ ఆంగ్ల భాషా ప్రభావం చాలా వుండేది. అది దొరల భాష. ఉర్దూ భాషా శాస్త్రవేత్తలు "ఉర్దువానా" అనే ఒక పదాన్ని తరచుగా వాడే వాళ్లు. ఉర్దూ విద్వాంసులు అనేకంగా ఆంగ్లపదాలను, పదబంధాలను ఉర్దూలో అనువదించుకున్నారు. అవిగాక ఒకభాష అన్యభాషా పదాలను

స్వీకరించే వర్ణాగమ, వర్ణలోప, వర్ణవ్యత్యయ పద్ధతిలోనే ఎన్నో ఇంగ్లీషు పదాలను ఉర్దూ భాషలోకి మార్చుకున్నారు. అదే "ఉర్దువానా".

ఉదాహరణకు లార్డ్ అనే ఇంగ్లీషు పదానికి లాట్ సాహెబ్ అని

కమాండ్ అనే ఇంగ్లీషు పదానికి కమాన్ అని

కమాండర్ అనే ఇంగ్లీషు పదానికి కమాన్‌దార్ అని

బాంబ్ అనే ఇంగ్లీషు పదానికి బమ్ అని

మ్యూజిక్ అనే ఇంగ్లీషు పదానికి ముషికీ అని

ఫిలాసఫి అనే ఇంగ్లీషు పదానికి ఫల్సఫా అని

ఫిలాసఫర్ అనే ఇంగ్లీషు పదానికి ఫల్స అనే ఉర్దూ పదం

ఈ మార్పునే ఉర్దువానా అన్నారు.

ఒక భాషలోని పదాలు మరొక భాషలో చేరినప్పుడు వాటి రూపు మారటమో లేక అర్థం మారటమో జరుగుతుంది. కొన్ని పదాలు యథాతథంగా అన్యభాషలలో చేరిపోతాయి. మన దేశభాషలన్నింటిలోనూ సంస్కృత పదాలు కొద్దోగొప్పో చేరే వుంటాయి. వాటిల్లో కొన్ని పదాలు ప్రాంతానికో అర్థాన్నిస్తున్నాయి. ఉదాహరణకు ఆలోచన చేయటమంటే తెలుగులో చింతనచేయటం హిందీలో విమర్శచేయటం. ఉపన్యాసమంటే తెలుగులో ప్రసంగం. హిందీలో నవల. భయంకర మంటే తెలుగులో భీతిగొల్పేది. మరాఠీలోనూ, తమిళంలోను ఆ పదం గొప్ప అనే అర్థంలో వాడతారు. కవిరాజంటే కొన్ని ఉత్తరాది భాషల్లో వైద్యుడు. మహారాజు అంటే కొన్ని ఉత్తరాది భాషల్లో వంటలు చేసే బ్రాహ్మణుడు.

ఇక ఉర్దూ భాషా పదాలను గురించి మాట్లాడవలసివస్తే తెలంగాణా తెలుగులో ఉర్దూ పదాలు కొన్ని యథాతథంగా చేరినాయి. కలము, కలందాన్, ఖజానా, జమీందారు, జాగీర్దారు, ఖుషీ, గులాము, రోజు, కూలీ, బాకీ, గరుజు, బాజారు, దుకాణం, మాలు, జబర్దస్తీ, జబరు, జోరు మొదలైన పదాలు ఆ కొన్నింటిలో కొన్ని.

హలంతమైన ఉర్దూ భాషలోని పదాలు, అజంతమైన తెలుగుభాషలో చేరినప్పుడు అవి కూడా అజంతమవటం భాషా సంప్రదాయంలో స్వాభావికమే. కాబట్టి ఉర్దూ భాషాపదాలు యథాతథంగా తెలుగలో చేరినాయనటం సరైన మాట కాదు. హలంతాలు అజంతాలై చేరినాయి. కలమ్–కలము అయింది. జమీన్‌దార్–జమీందారు అయింది. రోజ్–రోజు అయింది. బజార్–బాజారు అయింది. మాల్–మాలు అయింది. ఇట్లాగే ఇతర పదాలున్నూ.

ఉర్దూలో నుంచి తెలుగులో చేరినప్పుడు రూపుమార్చుకునే పదాలు కొన్ని. ఉదాహరణకు 'బాఖీ' అనే ఉర్దూ పదం తెలుగులో బాకీ అయింది. నఖద్ అనే ఉర్దూ పదం తెలుగు నగదు అయింది.

ఉధార్ అనే ఉర్దూపదం తెలుగులో ఉద్దెర అయింది.

సొహబత్ అనే ఉర్దూపదం తెలుగు సోబతి అయింది.

మస్జిద్ అనే ఉర్దూపదం తెలుగు సమసీదయింది.

సందూఖ్ అనే ఉర్దూపదం తెలుగు సందూకు–సందుగ అయింది.

కుర్సీ అనే ఉర్దూ పదం తెలుగు కుర్చీ అయింది.

ఘిలాఫ్ అనే ఉర్దూపదం తెలుగు గలేబు, గలీబు అయింది.

జుర్మానా అనే ఉర్దూపదం తెలుగు జుల్మానా అయింది.

నఖ్స్ అనే ఉర్దూపదం తెలుగు నగిషీ అయింది.

ఆబ్రూ అనే ఉర్దూపదం తెలుగు ఆబోరు అయింది.

ఫలాఁ అనే ఉర్దూ పదం ఫలానా–భలానా అయింది తెలుగులో.

పాజేబ్ అనే ఉర్దూ పదానికి తెలుగులో పాంజేబులు అని అర్థం.

పాజేబ్ చరణానికి అలంకారమైనది అని ఉర్దూ భావం కాగా, పాంజేబు చరణ భూషణంగా తెలుగులో అర్థాన్నిస్తున్నది. రూపు మార్చుకునే పదాల్లో ఇవి కొన్ని.

కొన్ని ఉర్దూ పదాలు తెలుగులో చేరి రూపాన్నే కాక అర్థాన్ని కూడా మార్చుకున్నాయి. 'ముదామ్' అనే ఫారసీ పదానికి 'ఎల్లప్పుడు' అనే అర్థమున్నది. అది తెలుగులో 'ముద్దాము'గా మారి "ప్రత్యేకించి" అనే అర్థమిస్తున్నది. మేజువాణి అంటే తెలుగులో వేశ్యలపాటకచ్చేరి. మూలభాషలో ఆ పదం 'మేజ్‌బాణీ'. దాని అర్థం అతిథి సత్కారం.

మూజువాణీ ఓటు అంటే కూడా ముహ్‌జుబాణీ అనే ఉర్దూ పదానికి వికృతే. ఉర్దూలో "నోటితో" అని అర్థం.

గలాభా అనే పదం గల్బా నుండి యేర్పడింది. మూలభాషలో దీనికి ఆధిక్యం అని అర్థం. మనం అల్లరికి వాడుతున్నాము. తగాదా అనే పదం తఖాజా అనే పదం నుండి వచ్చింది. మూలభాషలో ఒత్తిడి చేయటమని అర్థం. మనం ఘర్షణకు వాడుతున్నాము. ఖులాసా అనే ఉర్దూపదం తెలుగులో కులాసా అయింది. ఉర్దూలో

సారాంశమనే అర్థం గల ఈ పదం తెలుగులో ఆరోగ్యం అనే అర్థంలో వాడబడుతున్నది. తిరకాసు అనే పదాన్ని సమస్య అనే అర్థంలో వాడుతాము. ఉర్దూలో ఈ పదం తిర్కస్. అంటే మూడు వంకరలు కలది అని అర్థం. ఆజ్‌మాయిష్ అనే ఉర్దూ పదానికి పరీక్షించటమని అర్థం. తెలుగులో ఆజమాయిషీ అనే రూపంలో వున్న ఈ పదానికి సంరక్షణ అనే అర్థమున్నది. ఖౌల్ అనే ఉర్దూపదం తెలుగులో కౌలు అయింది. ఉర్దూలో 'మాట' అనే అర్థం గల ఈ పదానికి తెలుగులో భూసంబంధమైన లావాదేవీలకు వాడుతున్నారు.

ఈ విధంగా తెలంగాణా తెలుగులో ఉర్దూ మూలాలు గల పదాలెన్నో ప్రవేశించి తెలుగు పదాలుగానే ప్రయోగింపబడుతున్నాయి.

తెలుగు కవితా ప్రక్రియ నిన్న-నేడు-రేపు

-- డా. జె. బాపు రెడ్డి

కాలం అనంతమైంది. సృష్టి అనంతమైంది. అనంతమైన దేశకాలాల పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవటం మానవ మేధస్సుకు సాధ్యంకాదని అందరం అంగీకరించక తప్పదు. అనాది, అనంతం వంటి శబ్దాలు ఈ సత్యాన్నే సంకేతిస్తున్నాయి. అయితే ఈ అనాదిగా కొనసాగుతున్న అనంతకాలాన్ని అర్థం చేసుకోవటానికి, మూడు దశలుగా దాన్ని విభజించుకుంటున్నాం. అవే భూత, భవిష్యత్, వర్తమానాలు. "నిన్న" అంటే గత కాలం లేక భూతకాలంగా, "నేడు" అంటే వర్తమాన కాలం లేక ఇప్పుడు మనం జీవిస్తున్న కాలంగా, 'రేపు' అంటే మునుముందు రాబోయే కాలంగా మనం అవగాహన చేసుకుంటున్నాం. లోకంలో ఏది జరిగినా, ఎప్పుడు ఎక్కడ, ఎట్లా జరిగిందో మనం విశ్లేషంచుకుంటాం. ఏది, ఎప్పుడు, ఎలా జరగబోతుందో కూడా మనం ఊహించుకుంటాం. వివేచన చేసుకుంటాం.

ఆద్యంతరహితమైన కాలం లోన, అస్తిత్వం కలిగిన చిరాచిర, చరాచర సృష్టి గురించి, వాటి స్వరూప స్వభావాల గురించి, పరిణామాల గురించి, మానవుడు నిరంతరం ఆలోచిస్తూనే ఉన్నాడు. సృష్టి, స్థితి, లయపరమైన మానవ జీవితం పట్ల మనిసి చూపే ఆసక్తి, పొందే స్పందనలు, ఆపాదించుకొనే విలువలు ఎంతో విచిత్రంగా ఉంటాయి. ఆదిమానవుడి నుంచి వేద మానవుడు వరకు, నేటి అంతరిక్ష, ఎలక్ట్రానిక్, వైజ్ఞానిక మానవుని వరకు జరిగిన, జరుగుతున్న, జరగబోయే పరిణామాలన్నీ మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నవే. అంటే, ఈ సృష్టిలోని స్థితిగతులన్నీ మనావ జీవిత పరిణామంలో, ప్రతిబింబించడం మనం గమనిస్తున్నాం. అందుకే నాకు

"సృష్టి అంతటికి సంక్షిప్త రూపము మనిషి
భిన్న శక్తుల ఐక్య బిందురూపము మనిషి"

అనిపిస్తుంది. అంటే 'ప్రకృతి', 'మానవప్రకృతి' పరస్పర ప్రతిబింబాలేనేమో అనుకోవచ్చు. పంచభూతాత్మకమైన సృష్టితత్త్వాలన్నీ మానవునిలో నిక్షిప్తమై ఉన్నట్లు మనం గ్రహించడానికి వీలుంది.

మనిషి అంటే, భౌతిక శరీరం – తాత్వికపరమైన ఆత్మ – రెండు విడదీయరాని అస్తిత్వంగా మనం గుర్తించ వచ్చు. అయితే, కనిపించే శరీరం లేకుండా కనిపించని ఆత్మకు ఉనికి లేదు. అలాగే ఆత్మలేని శరీరం జీవించలేదు. అందుకే లోకంలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక చర్యలన్నీ, జ్ఞానాలన్నీ మానవ జీవిత సౌఖ్యాల, ఆనందాల కోసమే సుఖశాంతుల కోసమే అన్న వాస్తవాన్ని గుర్తించక తప్పదు. ఇక, మనిసి జీవితానికి అర్థం, పరమార్థం ఏమిటో తెలియకుండా, నిర్దేశించుకోకుండా జీవించటం అభిలషణీయం కాదు – స్థూలంగా మనిషి జీవితపరమార్థం ఆనందానుభవం – అనుభూతి. ఆనందోన్ముఖంగానే మానవ జీవితయాత్ర సాగుతున్నది. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక పరమైన దేదైనా కావచ్చు. ఇలాంటి సౌఖ్యానందాల కోసమే మానవుడు సాధించిన విజ్ఞానం, ప్రజ్ఞానం, ఆత్మజ్ఞానం దోహదపడతాయి.

భాషా సాహిత్యాలు:

అనంతతత్వాన్ని, దైవాత్వాన్ని మూలంగా చేసుకొని ఆవిర్భవిస్తున్న, విస్తరిస్తున్న, పరిణామం చెందుతున్న విజ్ఞాన ప్రజ్ఞానాలు, శాఖోపశాఖలుగా రూపొందుతున్నాయి. ఆర్థిక, రాజకీయ, సాంఘిక, ఆరోగ్య, గణితశాస్త్ర, రసాయనిక శాస్త్ర జన్యుశాస్త్రపరమైన అనేకానేక విజ్ఞాన శాఖలతోపాటు 'సాహిత్యం' కూడా ఒక విశిష్ఠ స్థానాన్ని మానవజీవితంలో సంపాదించుకున్నది. మానవుడు సృష్టించిన అన్నిటికంటే అద్భుతమైంది భాష. భాష లేక, ఏ విజ్ఞాన శాఖ, ఏ విద్యాబోధన, ఏ తత్త్వం, ఏ వాదం, ఏ సాహిత్యం – దేనికీ అభివ్యక్తి లేదు – ఒకరి భావం, ఆలోచన, స్పందన, అభిప్రాయం ఒకరికి తెలియజేయడానికి అవకాశమే ఉండేది కాదు. ఈ భాష యొక్క పుట్టుపూర్వోత్తరాలు, మూలాలు తెలిసికోవటం అసాధ్యమే అయినా అది మనిషి సాధించిన అత్యద్భుతమైన విజయంగా భావింపవచ్చు. ఇప్పుడు మనం, పరిశీలించవలసిన అంశం. 'తెలుగు కవితా ప్రక్రియ – నిన్న – నేడు, రేపు". ఇది భాషాగతమైన, భావగతమైన సాహిత్య ప్రక్రియకు చెందినది. అన్ని దేశాలకు, సమాజాలకు, భాషలకు సాహిత్య సంపద సంతరించినట్లే, భారతదేశానికి, అందులోని తెలుగు భాషకు కూడా భాషా సాహిత్య నిధులు ఉన్నాయి. అందులోను అతిముఖ్యమైన ప్రక్రియ కవితా ప్రక్రియగా మనం గుర్తించవచ్చు. నాటకం, కథ, నవల, వ్యాసం, విమర్శ వంటి ఇతర ప్రక్రియలకంటే, కవితా ప్రక్రియ అతి ముఖ్యమైంది. అందుకు కారణాలేమిటో ముందు పరిశీలిద్దాం.

మానవ జీవితంలో కవితా సృష్టి పాత్ర

"కవిత్వం అనిర్వచనీయమైన విద్య"గా అందరూ అంగీకరించినా, దాని ప్రత్యేకతను సాహిత్యంలో దాని విశిష్ట స్థానాన్ని, మానవ జీవిత పరమార్థ సాధనలో దాని పాత్రను ఎవరూ కాదనలేరు. అయితే, అన్ని విద్యల వలెనే సాహిత్య విద్య అందులోనూ 'కవితా విద్య" పరిణామ శీలి అని చరిత్ర నిరూపిస్తున్నది. ప్రస్తుతం, తెలుగు కవితా ప్రక్రియ యొక్క చరిత్రను పరిశీలిస్తే, దాని పరిణామ దశలో నన్నయ, చేపట్టిన 'సంస్కృత మహాభారతం' అనువాదం గణనీయమైంది. అప్పటినుంచి అది వెయ్యేళ్ళుగా, 20వవ శతాబ్దం వరకు పరిణామం చెందిన తీరుతెన్నులు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. నిన్న అంటే గత కాలం అనుకున్నాం కదా! అయితే – నిన్నటి నుండి నేటి వరకు, నేడు, రేపు దాని పరిణామక్రమం గురించి ముచ్చటించుకొనే ముందు భారతీయ కవితా ప్రక్రియ పునాదుల గురించి కొంత వివరించడం సమంజసంగా ఉంటుంది.

"ఆధునికాంధ్ర కవిత్వం" గురించి మౌలికమైన పరిశోధన చేసిన మహాకవి డా. సి. నారాయణ రెడ్డిగారు వెలిబుచ్చిన అభిప్రాయం ఈ సందర్భంలో గుర్తుచేస్తున్నాను.

. "వైదిక మంత్రములలో కవి శబ్దము తొలదొల్త ప్రయోగింపబడినది. వానిలో 'కవీర్మనీషీపరభూః" అని కవి శబ్దము పరమాత్మయను అర్థములో కనిపించుచున్నది. క్రమముగా ఇది ఋషిపరముగా వాడబడినది. ' నా నృషికురంతే కావ్యం' కవయః క్రాంత దర్శినః" అను లోకోక్తులు కవి యనగా ఋషి యనియే బలపరచుచున్నది. రోమన్లు సైతము కవిని ఋషిగానే భావించిరి. వారి భాషలో కవిని 'వాటిస్' అందురు. అనగా ద్రష్ట (ఫోర్‌సీర్, ప్రాఫెట్) అని అర్థము. గ్రీకులు కూడా కవితాశక్తి దైవదత్తమనియే భావించిరి. ఈ దేవతానుగ్రహమునే కొందరు పూర్వజన్మకృతమందురు. కొందరు వాసనా విశేషమందురు. ఆధునికులు స్వతస్సిద్ధమైన శక్తియందురు. సామాన్యులకు లేని ఒక విచిత్ర శక్తి యున్నవాడు కవియని ఎల్లరొప్పుచుందురు." అందుచేత ప్రబలమైన దర్శన, సృజన, ప్రకటన శక్తులు కలవారే కవులుగా, వారి కృతులే కవితలుగా మనం భావింపవచ్చు.

కవితా లక్షణాలు – జీవధాతువులు

ఇక పోతే, కవిత్వానికి ఉండవలసిన ముఖ్య లక్షణాలు, జీవధాతువులేవో మనం గుర్తుంచుకుంటేనే, వాటి స్వరూప స్వభావాలు, గుణాలు, ప్రయోజనాలు ఎలా పరివర్తనం చెందినాయో, చెందుతున్నాయో, చెందే అవకాశం ఉందో అవగాహన అవుతుంది. "కవిత్వం వ్రాయటం సులభమే కాని కవిత్వం చేయుట కష్టమని" విమర్శకుల అభిప్రాయం. అంటే, ఇక్కడ కవిత్వం యొక్క రూపం, గుణం –శక్తి ప్రయోజనం వంటి అంశాలు

'కవిత్వం చేయటానికి' సంబంధించినవి. అవి నిన్నటికి, నేటికీ, రేపటికి వర్తిస్తాయి. స్థూలంగా అవి "సృజనాత్మక కళకు" సంబంధించినవి. ఈ కళ కవితా జ్వాలగా కవితా శిల్పంగా ఆవిష్కృతమౌతుంది. కవితా వస్తువేదైనా కావచ్చు. కాని అది కవితా కళలో విలీనమైనపుడే 'కవిత్వం' అవుతుంది. ముడిపదార్థం వంటి కవితా వస్తువును రసాత్మకమైన 'కవిత్వం చేయటం' అంటే ఇదే. నిన్న, నేడు, రేపు ఎప్పుడైనా, పరిణామం, పరివర్తనం చెందుతున్నవీ, చెందనివీ అంశాలు స్థూలంగా ఇవి –

1. కవితా వస్తువు – ప్రణయ, ప్రణవ, సామాజిక ప్రగతి పరమైనవి.
2. వస్తుగతమైన భావం – భావదర్శనం – సత్యదర్శనం – కల్పనం
3. భౌతిక సత్యాలు, భావసత్యాలు
4. ఇంద్రియానుభవం – ఆత్మానుభూతి
5. కవితా ప్రయోజనం – విలువలు – విశ్వాసాలు
6. ఆత్మస్పందనం – మనోల్లాసం – శ్రవణపేయం (సంగీత –గానస్పర్శ)
7. ప్రక్రియలు – పద్యం – గేయం – వచనం
8. సంప్రదాయం – ప్రయోగం
9. మహాపురుషుల – సిద్ధాంతాల ప్రభావం

వివేచనా సౌలభ్యం కోసం పై తొమ్మిది అంశాలు ఎన్నుకున్నాను. అయినా వాటిని ఇంకా విస్తరించనూ వచ్చు, కుదించనూ వచ్చు. నిన్న – నేడు – రేపు కాలాలలో కవితా ప్రక్రియలో ఈ అంశాల పరంగా ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయో కాస్త పరిశీలిద్దాం.

నిన్న – గతం: నన్నయ నుండి ఇరువైయ్యవ శతాబ్ది వరకు, కవితా ప్రక్రియలో ప్రదర్శితమైన పరిణామాలు.

1. క్రీ.శ. 1000 నుండి 1300 వరకు గణుతికెక్కిన కవిత్రయం – నన్నయ తిక్కన, ఎర్రాప్రగడ, పాలించిన యుగం.

2. క్రీ.శ. 1300 నుండి 1500 వరకు శ్రీనాథుడు, పోతన, ఆధిపత్యం వహించిన కావ్య ప్రబంధయుగం

3. క్రీ.శ. 1500 – 1600 అష్టదిగ్గజాలు తొలి ప్రబంధ స్వర్ణయుగం

4. క్రీ.శ. 1600–1880 – తర్వాతి ప్రబంధయుగం

5. క్రీ.శ. 1880 – 1920 – వరకు వీరేశలింగం – ములుపు తిప్పిన మధ్యంతరయుగం.

నిన్నటివరకు గడచిన కాలాన్ని ఎట్లా విభజించినా తెలుగు కవితా ప్రక్రియలో కనిపించే సృజనాత్మక ప్రాచీన కవుల సంస్కృత రచనలకు తెలుగు అనువాదాల రూపంలో వచ్చినదే. అయితే అనువాదాలలో కూడా భాష, శైలీ, శిల్ప పరంగా తెలుగు కవులు ప్రదర్శించిన ప్రతిభ ఎంతో ప్రశంసనీయమైంది. ఈ కాలంలో కవితా రచన, అనువాదమైనా, అంతో ఇంతో స్వతంత్రమైన ఛందోబద్ధమైన పద్యరూపంలోనే వెలువడింది. చెవికి ఇంపైన శబ్ద శిల్పం, ఆహ్లాదకరమైన భావుకత, సంప్రదాయక విలువలపట్ల విశ్వాసం కలిగించే సత్యదర్శనం, సత్యకల్పనం చేయటం జరిగింది. వైదిక ధర్మబద్ధమైన జీవితానికి దోహదం చేసే తాత్త్విక చింతనానుకూలమైన సత్యాలు ఆవిష్కరించడమే ఆదర్శంగా పెట్టుకున్నారు.

రామాయణం, మహాభారతం, భాగవతం పురాణాల వంటి ఇతిహాసాలు, శృంగార రసనిర్భరమైన కథాంశాలు, భక్తిభావ పూరితమైన శతకాలు, మనుచరిత్ర, పారిజాతా పహరణం, విజయవిలాసం, శృంగార నైషధం, కళాపూర్ణోదయం, అభిజ్ఞాన శాకుంతలం వంటి కావ్యాలెన్నో తెలుగు కవితా సామ్రాజ్యానికి కవితాభివ్యక్తి సాధనాలుగా నిలిచాయి. ప్రకృతి శక్తుల ప్రాభవం, పాతివ్రత్యం, దివ్యశక్తులు, వేదప్రమాణాలు, పూజలు, యజ్ఞయాగాదులు, దైవభక్తి, విగ్రహారాధన వంటి ఆచార వ్యవహారారనాలు, అష్టాదశ వర్ణనలు, మత విశ్వాసాలు, ఇహపర చింతనలు కవితా వస్తువులుగా ప్రసిద్ధి గాంచినవి. అయితే

"సారపు ధర్మమున్ విమల సత్యము పాపము చేత బొంకు చే
పారము బొందలేక చెడ బారిన దైన యవస్థ దక్షులె
వ్వారలుపేక్ష చేసిర ది వారల చేటగుకాగ, ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడున్"

భారత నీతి పద్యం మంచి చెడుల – బాధ్యత మనిషిపై మోపినది. మంచికి హాని కలిగినపుడు దాన్ని ఎదిరించగలిగిన సమర్థులైన వారు ఊరకుంటే, వారికే చేటు కలుగుతుంది గాని ధర్మం, సత్యం, శుభ కరంగా నిలపడానికి దైవం ఎల్లప్పుడూ తోడ్పడతానని తేల్చి చెప్పిన గొప్ప ప్రవచనం ఇది.

అయితే చర్వితచర్వణంగా సాగిన కవితా రచనలో కవిత్వం రాశామన్న తృప్తితప్ప కవిత్వం 'చేశామన్న' ఘనత కొరవడింది. కొందరు విమర్శకులు, చివరకు 'క్షీణయుగ'

లక్షణాల కాలంగా భావించిన దశకు చేరుకుంది. అయితే సృజనాత్మకమైన, ప్రయోజనాత్మకమైన సందేశాత్మకమైన, నవరసభరితమైన, ఛందోబద్ధమైన, అలంకార శాస్త్ర శోభితమైన సంస్కృత సాహిత్య ప్రభావితమైన, కవితా రచన నిన్నటి దాకా సాగింది. స్థూలంగా 19వ శతాబ్దం వరకు కొనసాగింది. స్వాతంత్రోద్యమం, శాస్త్ర సాంకేతిక విప్లవాలు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావాలు, మార్క్స్ ప్రాయిడ్ వంటి హేతువాద సిద్ధాంతకర్తల రచనలు, ఇతర దేశాల కవితా దృక్పథాలలోవలెనే తెలుగు కవితా ప్రక్రియలో కూడా చోటు చేసుకొన్న కాలం ఇరువయ్యో శతాబ్దం. ఈ శతాబ్దాన్ని మనం 'నేడు'గా భావించ వచ్చు. 'నేడు' రేపుగా, మారుతూ సాగే కాలచక్ర గమనంలో, వర్తమానంలో వచ్చిన భవిష్యత్తులో రానున్న మార్పులనుధోరణులను కూడా గమనిద్దాం.

నేడు : గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, శ్రీరంగం శ్రీనివాసరావు, రావుత్రయం, కృష్ణశాస్త్రి వంటి ఆధునికులు, దాశరథి, నారాయణ రెడ్డి, కాళోజీ వంటి నవచైతన్య జ్యోతులు, ఎందరో నేటి తెలుగు కవితా ప్రక్రియను సుసంపన్నం చేశారు.

ప్రయోగాన్ని, సమదర్శన సమసమాజ నిర్మాణోన్ముఖ భావుకతతో జాషువా, విశ్వనాథ, బోయిభీమన్న, కరుణశ్రీ, కుందుర్తి, దువ్వూరి, శేషేంద్ర వంటి మహాకవులు నేటితరం కవులకు మార్గదర్శకులైనారు.

కొత్త సత్యాలను, కొత్త జీవిత దర్శనాలను సమాజానికి అందించిన కవి ఋషులు, ద్రష్టలుగా నిలిచారు. ప్రతిభావంతులు, విద్యా విజ్ఞాన సంపన్నులైన క్రొత్త తరం కవులెందరో ఈనాడు సామాజిక స్పృహతో, ప్రణయ, ప్రణవతత్త్వ స్ఫూర్తితో, నూతన సత్యదర్శనం చేస్తున్నారు. వారి సృజన శక్తితో భౌతిక జీవితాలకు, భావనాత్మక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందిస్తున్నారు.

"మరో ప్రపంచం మరో ప్రపంచం
– మరో ప్రపంచం పిలిచింది.
పదండి ముందుకు
పదండి త్రోసుక
పోదాం పోదాం పై పైకి"అంటూ మహాప్రస్థానానికి మార్గం వేయటం.
"దేశమంటే మట్టికాదోయ్, దేశమంటేమనుషులోయ్"
దేశమును ప్రేమించుమన్నా, మంచియన్నది పెంచుమన్నా"
అని గురజాడ గొంతెత్తడం.

"ఏదేశమేగినా ఎందుకాలిడినా

పొగడరా నీతల్లి భూమి భారతని"అంటూ నవ్యకవితాత్మను రాయప్రోలు ఆవిష్కరించటం,

శ్రీశ్రీ సత్యప్రబోధాలు, నూతన సమాజ నిర్మాణానికి దోహదంచేస్తూనే -

భజగోవిందం - భజగోవిందం

గోవిందం భజమూఢమతీ

అన్న ఆదిశంకరుల ఆధ్యాత్మిక ప్రపంచానికి దీటుగా ధ్వనించాయి.

"పద్య కవితా ప్రక్రియ"తోపాటు గేయ కవితా ప్రక్రియ, వచన కవితా ప్రక్రియ త్రివేణీ సంగమంగా నేటి తెలుగు కవితా చిత్రపటం రూపొందింది. "సృజనాత్మక కళలో" మిళితమై సత్య సౌందర్యదర్శనం, దైనందిన జీవిత దృశ్యాలు వస్తు వైవిధ్యానికి జవసత్వాలౌతున్నాయి.

"సమతా పాఠం నేర్చుకోవాలంటే
శ్మశానమే సహజకావ్యం సుమా" అన్న నారాయణ రెడ్డిగారు 'విశ్వంభర' విలాసాన్ని, 'మట్టి మనిషి ఆకాశాన్ని' తన అపారమైన తాత్విక సత్యదర్శనంలో ఆవిష్కరించాడు. నవ్యకవిత్వం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగింబర కవిత్వం, దళితవాద కవిత్వం, స్త్రీవాద కవిత్వం వంటి నామకరణాలతో సందడి చేసిన కవితా ధోరణులన్నీ మానవతా వాద దృక్పథం సూత్రమైన ప్రతివాద స్రవంతిలో కలిసి సాగుతున్నాయి.

కొండవాగుల్లా బయల్పడిన ఉద్యమాలన్నీ, సత్యదర్శన, ఇహపరానంద, సమతా సౌభాగ్యసుందర సహజీవన సమాజపు జీవిత మహానదిలో అంతర్భాగమై తరగలెత్తుతున్నాయి.

ఇరువయ్యో శతాబ్దాన్ని 'నేడు'గా పరిణగిస్తున్న కాలంలో వెలుగు చూపిన పరిణామాలు అపూర్వమైనవి. తెలుగు కవితకు, జాతీయ అంతర్జాతీయ చేతనను ప్రాసదించినవి. నవ్యకవిత్వం, భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవిత్వం, దిగంబర, దళిత, స్త్రీ వాద కవిత్వాల పేరుతో పొడచూపిన ధోరణులతోపాటు, 'నవ్యసంప్రదాయ కవిత్వం'గా కూడా ఒక ధోరణిగా చెలామణి కావటం ఒక విలక్షణ పరిణామం. రామాయణ కల్పవృక్షం"తో తెలుగు సాహిత్యానికి తొలి 'జ్ఞానపీఠ పురస్కార్" గౌరవం తెచ్చిన కవి సామ్రాట్, విశ్వనాథ సత్యనారాయణగారు ఈ నవ్య సంప్రదాయానికి

ప్రతినిధిగా కొందరు విమర్శకులు గుర్తించారు. అయితే నిన్నటి నుండి వస్తున్న సనాతన ధర్మ చింతన, ద్వైతా ద్వైత తత్త్వచింతన, ప్రబంధ కావ్య బంధురమైన శృంగార చేతన న్యాయబద్ధమైన రాజ్యాధికార సూత్రం కూడా చిన్నాభిన్నమైన కవితాధోరణుల మధ్య తమ గొంతులు, ఇంతో అంతో వినిపిస్తూనే ఉన్నాయి. కొందరు సనాతనులలో ఆధునికులుగా, ఆధునికులలో సనాతనులుగా తమదైన నవ్యసంప్రదాయాన్ని నిలుపుకున్నారు. అలాగే దేశభక్తి, సామాజిక స్పృహ వంటి నినాదాలు కవితా వాదాలు రూపమెత్తినా రాయప్రోలు, కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు వంటి సౌందర్యోపాసకులైన కవులు కొందరు ప్రణయతత్త్వ ప్రాణాన్ని నిలబెట్టారు. శృంగార నాదాలకు శ్రుతి పెట్టారు. కుల, మత, వర్గ లింగపరమైన ఆవేశాలు, కవితా రణశంఖాలు పూరించినా, భక్తి, జ్ఞాన, కర్మయోగ సంయుక్త హరిహరతత్త్వ మానవత్వ గీతా సూత్రమే నేటి తెలుగు కవితా ధర్మక్షేత్రంలో విజేతయై రేపటి కవితాద్వారంలో ప్రవేశించింది. తదనుగుణంగానే రేపటి తెలుగు కవితా ప్రక్రియ శోభిల్లే శుభసూచికలు కనిపిస్తున్నాయి. 'ప్రజాస్వామిక, స్వేచ్ఛాయుత, విశృంఖల వాదాల నామకరణాలతో పామరనఫాలత మైలరవితా మూల కవితా 'మహావృక్షం" శాఖలుగా మారిపోయింది. కవితాశక్తి మూలమొకటే అయినా అభివ్యక్తిలో కాలానుగుణంగా, మారుతన్న ఆర్థిక, సాంఘిక, రాజకీయ స్థితిగతులకు ప్రతిస్పందనగా, పరివర్తనం చోటుచేసుకుంది. ఏకత్వంలోని భిన్నత్వం, భిన్నత్వంలోని ఏకత్వం దృష్టితో పరిశీలిస్తే నిన్నటి ఏకత్వం నుండి నేటి భిన్నత్వం, పొడచూపినట్లే, నేటి భిన్నత్వంలో నుంచి రేపటి నూతన ఏకత్వం రూపుదిద్దుకునే అవకాశం లేకపోలేదు.

రేపు : "రేపు" అంటే ఇరువయ్యొకటవ శతాబ్ది అనుకుంటే, అది ఇరువయ్యో శతాబ్ది అనుభూతించిన అభివ్యక్తిత్వ భిన్నత్వం నుంచి, ప్రపంచీకరణ, గ్రహాంతర అంతరిక్ష దృష్టి, భౌతిక సత్యాతీతమైన శాశ్వత, సౌందర్య, రసాత్మకభావసత్య శోభితమైన సృష్టిని ఆవిష్కరించే కవితాదర్శనం వెలుగొందవచ్చును. అప్పుడే తెరమరుగైపోతున్న, విభిన్న నామాంతరాలతో ప్రత్యక్షమైన నేటి కవిత్వం ఒక సమ్యక్ సమగ్ర జీవిత దర్శనాన్ని అనుభూతింపజేసే కవితా సృష్టిగా అవతరిస్తుందని ఆశింపవచ్చు. ఆ సృష్టిలో మానవ జీవిత పరమార్థమైన ఇహపరానంద సాధనకు దోహదం చేసే, సత్యావిష్కరణం జరుగుతుందనడంలో సందేహం లేదు. అచంచలమైన దేశభక్తి, సమసమాజ నిర్మాణాసక్తి, ప్రేమానురాగరక్తి, దైవశక్తి నడిపించే మూల్యాలపట్ల విశ్వాసం కలిగించే భావుకత, భావభౌతికతలను సృజనాత్మక కవితామతల్లి అందిస్తుందని ఆశింపవచ్చు. ప్రణయ, ప్రణవ, ప్రగతి చేతనం ముప్పేటగా అల్లుకొన్న సహజీవన సత్యదర్శనం, రేపు వర్ధిల్లుతుందనే సూచనలు కనిపిస్తున్నాయి.

"భావజాలం" పరంగానే కాక కవితారూప ప్రక్రియల్లో కూడా ఈ వైరుధ్యం లేని వైవిధ్యం రేపటి తెలుగు కవితా ప్రపంచాన్ని పాలించే అదృష్టం కలుగవచ్చు. 'పద్య'మే కవితా నైవేద్యంగా శతాబ్దాల తరబడి కొనసాగినట్లు మనం గుర్తించాం. మరి, ఆ సంప్రదాయాన్ని నిరసించి, ఎదరించి, దాదాపు వెలివేసిన స్థితికి, గేయ ప్రక్రియ, వచన కవితా ప్రక్రియ నేడే విజృంభిండం కూడా వాస్తవమేనని గమనించాం. అయితే పద్యం, నేడు పాతచింతకాయ పచ్చడిని కాదు, నిత్యనూతనమైన 'ఉగాది పచ్చడి'నే అని నిరూపించుకుంటున్నది. అన్ని రుచులు నాకు తెలుసునని శృంగారాన్ని, బంగారాన్ని, అంగారాన్ని, ప్రణయ, ప్రణవ, ప్రగతి – త్రిముఖ జీవితతత్వాన్ని అందించడం ముదావహం రేపు నేను సోదర కవితా ప్రక్రియలతో సహజీవనం చేస్తానని, ముద్దు ముచ్చటగా ముస్తాబవుతుండడం, ప్రశంసనీయ పరిణామం.

అలాగే తెలుగుభారతికి, రెండవ జ్ఞానపీఠ పురస్కార హారతి పట్టించిన పుంఖావసరస్వతి, ఆచార్య సి. నారాయణరెడ్డిగారు. పద్యశక్తిని గౌరవిస్తూనే, గేయశక్తిని నిరూపిస్తూనే, వచన కవితా కళాదిత్యుడైనాడు. నేటి తరానికి ప్రక్రియాతీత, వివాదరహిత అభ్యుదయ మానవతావాద స్ఫూర్తిని కలిగిస్తున్నారు. సమగ్రమైన, ఆశావాద, ప్రగతి వేద, సౌందర్య వాద కవితా సత్య సాహిత్య సృష్టి చేస్తున్నాడు. గతాన్ని సంప్రదాయాన్ని జీర్ణించుకొని, ప్రస్తుతాన్ని ప్రయోగశీలాన్ని తన ప్రబుద్ధాత్మక యోగ దర్శనానికి జత చేసుకొని రేపటి చరిత్రకు విషయసూచికగా దూసుకపోతున్నాడు. మూడు ముక్కల్లో చెప్పాలంటే, రేపటి తెలుగు కవితా ప్రక్రియలో మూడు కాలాలను, మూడు రూప ప్రక్రయలను, మూడు భావ ప్రక్రియలను ముద్దాడుతూ మూడు ముఖాలు, తెలుగుభారతిని మురిపిస్తాయి. విశ్వనాథ, శ్రీశ్రీ, సినారె రేపటి ముచ్వెన్నెల తెలుగు కవితా పతాకగా స్ఫూర్తిదాతలౌతారు.

"రాలును రప్పలున్ పనికి రానివి గోతులు కొండలున్ వినా
గాలియు నీరులేని ఒక గందర గోళము చంద్రగోళమం
దాలకు ప్రోవికాదనుచు దర్శిత చిత్రము లెన్ని చూపినన్
రేల నభోంతరాలు శశిరేఖల చూచి చలంపకుందుమా!
చంద్ర విజయమ్ము విజ్ఞానశాస్త్ర జృంభ
ణమ్ము ఊహాజనితకవనమ్ములకును
కళలకు విఘాతమనెడి సుద్దులవి మిథ్య
శాశ్వతము కళాతృష్ణ ఆ జాబిలి వలె! (జె. బాపురెడ్డి)

సృజనాత్మక సాహిత్యం, ముఖ్యంగా కవిత్వం, ప్రతి సంఘర్షణనూ, అంతర్నిహితమైన కాంతిని ప్రతిబింబిస్తుంది. తద్వారా అత్యున్నమైన,చైతన్యస్థితిని, వివేకస్థితిని చాటిస్తుంది. అందుకే 'రేపటి' కవిత కూడా ఆచంద్రతారార్కం నిత్య నూతన చైతన్య కళా కాంతులతో వర్ధిల్లుతుంది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, హేతువాద, నాస్తిక వాదాలు ఎంత నిరసించినా భావనాత్మక, ఆత్మానుభూతి స్ఫోరక సత్యదర్శన, అలౌకిక సత్యసౌందర్యానంద కవిత మానవజాతిని అలరిస్తూనే ఉంటుంది. విజ్ఞాన తృష్ణతోపాటు కళాత్మకత జతయై మానవ జీవితానికి పరిపూర్ణత్వాన్ని చేకూరుస్తాయి.

విశ్వసాహిత్యంలో, అంతర్జాతీయ కవితా ప్రక్రియలో, 'భావ భౌతిక' సత్యసాగరంలో సహజీవన తరంగాలై, మానవ కళ్యాణశక్తులై తెలుగు కవితా ప్రక్రియలు గర్జిస్తాయి. ఖండఖండాలను కలిపే తీర తీరాలను అఖండరాగబంధాలతో అములుకుంటాయి. భావికవులు, కుల మత, వర్గ విభేదాలు, వైషమ్యాలు లేని, శాంతి కాముక, అహింసాత్మక, మానవ కుటుంబంగా మనగలిగే నవ్యదివ్య చైతన్యాన్ని అందించే కవితా శంఖం పూరిస్తారనడంలో సందేహం లేదు. భౌతిక స్థితిగతులను మార్చే మానసిక పరివర్తనను మానవాళిలో కలిగించడానికి దార్శనికులైన కవుల భావ సత్యావిష్కరణలు దోహదం చేస్తాయి. సమతాభ్యుదయోన్ముఖ మానవత్వం భవిష్యత్తరాలను నడిపిస్తుంది.

ఆర్థిక, రాజకీయ, సాంకేతిక రంగాలలో సంక్రమిస్తున్న మార్పులు ప్రజల జీవిత స్థితిగతుల మీద ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ విధానాలు, పరిపాలనా వ్యవస్థ పనితీరు, దేశ ప్రగతికి, ప్రజల సంక్షేమానికి అద్దం పడతాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో శుభపరిణామాలు చోటు చేసుకుంటున్నప్పుడు, అవినీతి, అసమానతలు, అక్రమాలు, దురాచారాలు తొలిగిపోతున్నప్పుడు సామాజిక వర్గపరమైన, లింగ వివక్షపరమైన సమస్యలు తల ఎత్తడానికి ఆస్కారం ఉండదు. ప్రపంచీకరణ, ఉగ్రవాదం, ప్రపంచ శాంతి, మత సామరస్యం వంటి కీలకమైన సవాళ్లకు పరిష్కారం జరుగుతుంటే, వాటి ప్రభావం రచయితల మీద, రచనల మీద స్పష్టంగా పడుతుంది. పర్యవసానంగా, కవితా దృక్పథం, కవితా వస్తువు స్వరూప స్వభావాలు కూడా గణనీయంగా మారడానికి అవకాశం ఉంటుంది. పదకొండవ శతాబ్దిలో నన్నయాదులతో ప్రారంభమైన తెలుగు కవితా స్వరూప స్వభావాలు రెండు సహస్రాబ్దిలో (గతంలో) చర్విత చర్వణంగా కొనసాగిన దేశకాల పరిస్థితులు పందొమ్మిదవ శతాబ్ది చివరిదాకా వెలువడ్డ తెలుగు సాహిత్య సృష్టిని నిర్దేశించాయి. అట్లాగే ఇరవయ్యో శతాబ్దిలో (నేడు) చోటుచేసుకున్న విప్లవాత్మకమైన శాస్త్ర సాంకేతిక, అంతరిక్ష విజయాలు, ఆర్థిక, రాజకీయ, కుల మతతత్వ పరమైన శుభకర పరిణామాలు, 21వ శతాబ్ది (రేపు)నే కాకుండా, మూడవ సహస్రాబ్ది

చివరివరకు, సాగే తెలుగు సాహిత్యం ముఖ్యంగా కవిత్వం యొక్క రూపురేఖలను నిర్దేశించే అవకాశం కన్పిస్తున్నది. ఒకరకంగా చూస్తే ప్రతి సహస్రాబ్ది లోని తొలి శతాబ్దంలో రూపొందిన విలువలు, విశ్వాసాలే, ఆయా సాహస్రాబ్ది సాహిత్య స్వరూప స్వభావాలకు ఒరవడి పెడుతున్నట్లు, చరిత్ర చెపుతున్నది. వ్యక్తుల కంటే సాంఘిక రాజకీయ, శాస్త్ర సాంకేతిక సాంఘిక వ్యవస్థలు పరిపాలనా విధానాలను, తద్వారా దేశ ప్రజల మనో భావాలను తీర్చిదిద్దే అవకాశం ఉంది. దేశ ప్రగతిని, ప్రజా సంక్షేమాన్ని ఆకాంక్షించే కవులు, రచయితలు వైరుధ్యం లేని వైవిధ్యభరితమైన సాహిత్య దర్శనంతో రచనలు చేస్తారని విశ్వసిద్దాం.

ఒక్క ముక్కలో చెప్పాలంటే భవిష్యత్తులో ప్రపంచంలోని అన్ని భాషల్లో, జీవన రంగాలలో వలనే కవితా రంగంలో కూడా కృత్రిమమైన విభేదాలు, వివాదాలు అంతరించి, సమన్వయ, సామరస్యపూరితమైన సహజీవన మార్గం బలోపేతమయ్యే అవకాశం ఉంది. అన్ని కవితా ప్రక్రియలు, అన్ని భావధారలు, అన్ని వాదాలు వివాదాలు పరస్పరావగాహనతో మానవత్వాన్ని దైవత్వాన్ని అనుసంధానం చేసే తాత్త్విక దృష్టితో సత్యసుందరమైన, రసానందబంధురమైన కవితా సృష్టి జరుగుతుందనడంలో సందేహం లేదు. ఇలా గతం, వర్తమానం, భవిష్యత్తు పరస్పరం ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో ప్రగతిశీల పరిణామోన్ముఖంగా సాహిత్య చరిత్ర సంస్కృతి రూపుదిద్దుకుంటుందని ఆకాంక్షిద్దాం.

నేటి పత్రికల భాష ఏదశలో ఏదిశలో

-- డా॥ జె.చెన్నయ్య

'నేటి తెలుగుభాస ఏదశలో ఏ దిశలో' అన్నది ఈనాడు సమీక్షించుకోవడం తప్పనిసరి. ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన విస్తృతి, ఉపాధికోసం ఆంగ్ల మాధ్యమ విద్యావ్యాప్తితో తెలుగు మాధ్యమం, తెలుగభాషా బోధన తగ్గిపోతున్న ఈ దశలో రేపటి తెలుగు ఎలా ఉండబోతుంది అన్న విషయాన్ని చర్చించుకోవడం అవసరం. అన్ని రంగాల్లో తెలుగు అడుగంటుతున్నట్లే తెలుగు పత్రికల్లో కూడా ఆ ధోరణి ప్రతిబింబిస్తున్నది. నిజానికి ఆధునిక తెలుగు భాషా వికాసానికి తెలుగు పత్రికలు దోహదం చేసినంతగా విశ్వవిద్యాలయాలు సైతం చేయలేదు అని పెద్దలు అంగీరించిన విషయం. ఎన్నో ప్రాంతీయ మాండలికాలు, మరెన్నో సామాజిక, సాంస్కృతిక నేపథ్యాల నుంచి వచ్చిన భాషా వ్యవహర్తలు, రచయితల మధ్య ఒక ప్రామాణికమైన ఏకరూపమైన భాషను సాధించి అందరి ఆమోదాన్ని పొందిన ఘనత పత్రికలకే దక్కుతుంది. తెలుగు దినపత్రికలు చదువుతున్న రచయితలు రచనల్లో కనిపించే భాషాపరమైన ఏకరూపత మిగతా రచయితల్లో కనిపించదు. ఆ విషయంలో కూడా పత్రికల కృషి ప్రశంసనీయమే.

అయితే పత్రికల భాష ఒకప్పుడున్నంత గొప్పగా ఇప్పుడు ఉండడం లేదన్నది నిర్వివాదాంశం. భాష, సాహిత్యపరంగా ఎంతో నిబద్ధత ఉన్నవారు తొలినాళ్ళలో పత్రికలను స్థాపించేవారు. పత్రికను స్థాపించేందుకు ముందు చేసిన లక్ష్యప్రకటనలో 'భాషాభివృద్ధి, దేశాభివృద్ధికోసం పత్రికను ప్రారంభిస్తున్నాం' అని పేర్కొనేవారు. పండితుల ఇళ్ళలో అటకల మీద మగ్గిపోయే అనేక అపురూపమైన తెలుగు గ్రంథాలను వెలికితీసి పత్రికల్లో ప్రచురించేవారు. పద్యరచనలు, వచనరచలు, నాటకాలు, వార్తలు ఒక్కటేమిటి అన్నీ సాధారణ పాఠకులను చేరే విధంగా ఉండేవి. అన్నిటికీ భాషాభివృద్ధి ఒక్కటే లక్ష్యం గ్రాంథిక శృంఖలాలనుంచి భాషను విముక్తం చేసి పాఠకసామాన్యానికి అందించడమే ఏకైక లక్ష్యంగా ఉండేది. పత్రికల్ని పరిణామ దృష్టితో పరిశీలిస్తే ఏ దశలో ఏ కాలంలో చూసినా అప్పటికి అది వ్యావహారికమే. సాహిత్యం ముఖ్యంగా ఆధునిక సాహిత్యం ఒకానొక

ప్రమాణిక భాషలో అనేక ప్రక్రియలుగా ఉదాహరణ పొంది పాఠకులను చేరి వారి సంఖ్యను అపరిమితంగా పెంచిందీ అంటే అది పత్రికల చలవే.

ఇటీవల దశాబ్దాల వరకూ పత్రికా రచయితలు, సంపాదకులు తెలుగు భాషా వికాసానికి పత్రికలను వేదికలుగా చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగే సంఘటనలు వివిధ భాషలు ముఖ్యంగా ఆంగ్లంలో వచ్చే వార్తలను అచ్చమైన తెలుగులోకి తేవడానికి ఎంతో శ్రమించారు. ఆంగ్లంలో తమ పత్రికకు పొద్దుపోయిన తర్వాత అందిన వార్తను ఆగమేఘాలమీద అనువదించి ప్రచురించవలసి వచ్చినప్పుడు కూడా తేలికైన అందరికీ అర్థమయ్యే తెలుగు మాటలతో సులభ గ్రాహ్యంగా అనువదించి వేసేవారు. సాహిత్య పరిణామాన్ని గురించి లోతైన అవగాహన వుండడమేకాక తాము స్వయంగా రచనలు చేసే శక్తి, భాషాపటిమ వారికి ఉండేది. దినపత్రికలో పుటలు విప్పితే నుడికారపు పరిమళం పాఠకులకు అలరించేది. సంపాదకీయమో, వ్యాసమో, శీర్షికో, వార్తో రాసిన వారు మరునాడు పత్రిక చదువుకుంటే తాము చేసిన తప్పులు తెలిసేవి. ఆ తప్పులు పునరావృతం కాకుండా చేసుకోగలిగేవారు. ఎదుటి వారిలోపాలను కూడా ఎత్తి చూపేవారు. ఆ విధంగా ఎప్పటికప్పుడు పత్రికాభాష దోషరహితమై, సారభూతమై కనిపించేది.

ఇటీవలి కాలంలో ఆపరిస్థితులు పోయాయి. తెలుగుభాష, సాహిత్యాలపై మక్కువ కలిగిన వారే తెలుగుశాఖల్లో విద్యార్థులుగా చేరే పరిస్థితులు పోయి అన్ని కోర్సుల్లాగే ఇదీ ఒకటి అనేవారు వచ్చినట్లే ఉపాధికోసం అందుబాటులో వున్న అనేక వృత్తుల్ల పత్రికా రంగం ఒకటి అనుకొనేవారు వచ్చారు.

ఒకప్పుడు పత్రికల్లో రాసే భాష సాహిత్య స్పర్శకలిగినదిగా వుండేది. రాసేవారికి తప్పనిసరిగా సాహిత్య అధ్యయన నేపథ్యం, భాషపైన గట్టి పట్టుండేది. ఏది రాసినా తెలుగును ఒకరపు సొంపు పరిమళించేది. ఏ పదం ప్రయోగించినా సార్థమూ, భావతీవ్రత, ఔచిత్యమూ తెలిసి ప్రయోగించేవారు. స్వంతంగా ఆలోచించి తమదైన ఒకానొక భాషా వైఖరితో రాసేవారు. ఇప్పడలా కాదు. తెలుగు దినపత్రికలో రాసే భాష అసలు సిసలైన తెలుగుభాషేనా అని సందేహించాల్సి వస్తుంది. ఒక సభకు లేదా విలేకరుల సమావేశానికి వెళ్ళిన విలేకరి అక్కడి వక్తలు ఏం చెబితే అది సంక్షిప్తంగా నోట్ చేసుకొని ఆ నోట్స్ ఆధారంగా వక్తల మాటల్ని యదాతథంగా రాస్తున్నారు. వాళ్లు మాట్లాడే భాష కృతకమైన భాష. 'ప్రభుత్వ అవినీతిని తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరిస్తా వున్నాం' వంటి వాక్యాలు మౌలికమైన తెలుగు మాటలతో కూడినవి అనే కంటే ఇవేవో తెలుగు లిపిలో రాసిన ప్రత్యేకమైన వాక్యాలనిపించక మానవు. ఏ వార్త చేసినా ఇంగ్లీసులో వచ్చిన దానికి అనువాదంలా అనిపిస్తుది. 'దోషులపై కఠిన చర్యలు

తీసుకోవడం జరుగుతోందని హోంమంత్రి హెచ్చరించారు. వంటి వాక్యాలు ఈ కోవలోనివే. 'రాష్ట్ర ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా దశలవారీ ఆందోళన కార్యక్రమాన్ని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం ఖరారు చేసింది. ఈ క్రమంలో పార్టీ శ్రేణులు విభేదాలను పక్కనపెట్టి సంఘటితంగా పాల్గొనాలని పార్టీ అధ్యక్షుడు పిలుపునిచ్చారు' వంటి వాక్యాలు పత్రికారచనకు సంబంధించిన పారిభాషిక పదాలతో కూడినవేకాని తెలుగుదనం వున్నవి కావు. అంటే ఈనాడు పత్రికల్లోనూ, టివి ఛానళ్ళ వార్తా విభాగాల్లోనూ పని చేస్తున్న జర్నలిస్టులకు తెలుగుభాషపై పట్టు అవసరం లేదనీ, కొన్ని పడికట్టు పదాలు అబ్బితే చాలునని, వాటితో వార్తా రచన చేయవచ్చునని అనుకునే పరిస్థితి వచ్చింది.

నిజానికి భాషపట్ల గాఢమైన అనురక్తి, అభిరుచితో పత్రికా రంగంలోకి రావడమేగాక రోజువారీగా కొంతసేపు ఇతర వార్తాపత్రికలు, సాహిత్య సంబంధమైన పుస్తకాలు చదువుతూ భాషా పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకోవడం తప్పనిసరి. కాని అలాంటిది జరుగుతున్నట్టులేదు. అందుకు కారణం లేకపోలేదు. పాత్రికేయులు ఎక్కువ పనిగంటల్ని వాస్తవంగా చేయవలసిన పనికే వినియోగించవలసి వస్తోంది. ఎదుటివారు రాసిందాన్ని భాషా దృష్టితో పరిశీలించడం, తాను రాసింది చూసుకుని భాషా పరంగా చేసిన పొరపాట్లను గమనించుకుని ముందు ముందు అవి దొర్లకుండా చూసుకునే అవకాశం కూడా కనిపించడంలేదు.

పత్రికల పరంగా భాషగురించిన కృషి జరగడంలేదని, అందరూ భాషపై పట్టులేనివారే పాత్రికేయులుగా వున్నారని చెప్పడం కూడా సరైంది కాదు. కొన్ని యాజమాన్యాలు శిక్షణా విభాగాల్ని ఏర్పాటు చేసి ఎంపికైన అభ్యర్థులకు ఇతర అంశాలతోపాటు భాషగురించిన శిక్షణను కూడా ఇస్తున్నారు. అయితే స్థూలంగా చూసినప్పుడు పత్రికారంగంలోకి వస్తున్న వారిలో అధిక సంఖ్యాకులు భాషా సేవకోసం కాక ఉపాధికోసం వస్తున్నారు. ఈ రంగంలో స్థిరపడి తర్వాతనైనా భాషపై దృష్టి నిలిపి అవగాహనను పెంచుకోలేకపోతున్నారు.

తెలుగుభాషకు దూరమైన తరం విద్యాభ్యాసాన్ని ముగించుకొని పట్టాలు చేతబట్టుకొని వివిధ రంగాల్లోకి వస్తోంది. అందులో ఒకటి పత్రికారంగం. ఇది ఎంతో ముఖ్యమైన అంశం. తెలుగుపత్రికలో పాత్రికేయునిగా పనిచేసే వారు ఈనాడు తెలుగు తప్పుల్లేకుండా రాయలేక పోతున్నారు అనే సమస్య ఒకటికాదు. తెలుగుకు సంబంధించిన అనేక అంశాలు వారికి తెలిసే అవకాశం లేకుండా వుంది. కవులెవరో, కథకులెవరో, నవలాకారులెవరో, నాటక కర్తలెవరో, విమర్శకులెవరో, పరిశోధకులెవరో, కళాకారులెవరో వారికి అంతగా తెలియదు. భాషలోతుగా తెలియదు. సాహిత్యంలోని భిన్న ప్రక్రియల్లో రచనల గురించి కొద్దిపాటి అవగాహన కూడా లేదు.

తెలుగు మాధ్యమం మాట అటుంచి తెలగు ఒకానొక భాషగా చదివే అవకాశం, కోరికా లేని ఈ పరిస్థితుల్లో, తెలుగు రాష్ట్రంలో తెలుగు తప్పక చదివేలా ఒక విధానాన్ని అమలు జరిపే శ్రద్ధలేని పరిస్థితుల్లో తెలుగు పాఠకులకు తెలుగు పత్రికలు ఏ స్థాయిలో అందుతాయో ఊహించుకోవచ్చు.

ఇటీవలి కాలంలో పత్రికా నిర్వాహకుల్లో కొందరు కొత్త వాదం లేవదీస్తున్నారు. తెలుగు అంతగా తెలియని నేటి తరానికి అచ్చతెలుగులో పత్రికలు అందజేస్తే వారి ఆదరణ లభించదని, అందువల్ల ఆంగ్ల పదాలతో కూడిన మిశ్రమ భాషలో, వాళ్ళను ఆకట్టుకునే రచనా విధానంలో ఉండాలంటున్నారు. అలా రాయకపోతే వాళ్ళు పత్రిక చదవరని, అలా జరిగితే ముఖ్యమైన తరాన్ని తెలుగు పత్రికలు కోల్పోవాల్సి వస్తుందని అంటున్నారు. ఇది సమర్థనీయం కాదు. తెలుగు చదవడం తెలిసినవారైనా నిత్యం తెలుగుపత్రిక చదివితే కొంతకాలానికి తెలుగు వచ్చే అవకాశం వుంటుంది. కాబట్టి అనవసర వాదాలకు పోకుండా వీలయినంతగా అచ్చతెలుగులో పత్రికా రచన సాగితే ఇదీ తెలుగు అని తెలుస్తుంది. అంతేగాని విరివిగా ఆంగ్లపదాలున్న మిశ్రభాషే తెలుగు అని నమ్మే పరిస్థితి వస్తుంది.

ఒకటి రెండు ప్రధాన దినపత్రికలు కొంతకాలంగా తెలుగుకోసం ప్రశంసనీయమైన రీతిలో పాటుపడుతున్నాయి. వీలయినంత వరకు ఆంగ్లపదాలను పరిహరిస్తూ తెలుగుపదాలనే వాడుతున్నాయి.

భాష ఆధారంగా పత్రికా పరిశ్రమ నడుస్తున్నది. భాషనే నిర్లక్ష్యం చేస్తే కోట్లాది రూపాయల పరిశ్రమకు అర్థం లేదు. ఈ విషయాన్ని గుర్తెరిగి భాష విషయకమైన పర్యవేక్షణ కోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకుని పాత్రికేయ సిబ్బందికి భాషాపరమైన సూచనలిస్తూ, సందేహాల్ని నివృత్తిచూస్తూ పత్రికాభాషను మరింత సుసంపన్నం చెయ్యాల్సిన అవసరం వుంది. సాంకేతికంగా ఎంతో ముందడుగువేసి అత్యాధునికమైన ముద్రణాప్రమాణాలతో దినపత్రిక పాఠకులను చేరినా భాషా పరమైన శ్రద్ధ తీసుకోకపోతే ఫలితం వుండదు.

ఇన్ని సమస్యలున్నా తెలుగుపత్రికలు తెలుగుభాషకు చేస్తున్న సేవ గణనీయమైంది. భాషపై మక్కువ, అనురక్తి వున్నవారు పత్రికల్లో చాలామంది వున్నారు. వారి శ్రద్ధవల్లే ఈ నాటికీ తెలుగు పత్రికల్లో వాడే భాషే ఆధునిక తెలుగు అన్నప్రశంస పొందుతోంది. ప్రతి పత్రికలోనూ కొంతమంది అనుభవం గడించిన పాత్రికేయులున్నారు. వారివల్ల పత్రికలకు భాషాపరంగా మేలే జరుగుతున్నా వర్తమాన తరపు పాత్రికేయులకు మరింత భాషా

శిక్షణనివ్వడం ఎంతో అవసరం, వివిధ పత్రికలు నిర్వహిస్తున్న జర్నలిజం కళాశాలల్లో భాషా పరిజ్ఞానాన్ని మెరుగుపరిచే అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించవలసిన అవసరం వుంది. గతంతోపోలిస్తే భాష విషయంలో మనం ఎంతో వెనుకబడుతున్నామని గుర్తించాలి. ఇతర ప్రమాణాల విషయంలో మనం గతంలోకంటే ఎన్నో రెట్లు ముందుడుగువేసిన భాషాపరంగా వెనక్కిపోయాం అనేది మరువరాదు.

భాషాదృష్టితో నేటి తెలుగు దినపత్రికను పరిశీలించినపుడు మరొక విషయం బోధపడుతుంది. దినపత్రికలో ప్రధాన సంకలనం, జిల్లా/నగర సంకలనం అని రెండు వుంటాయి. ప్రధాన సంకలనం (మెయిన్ ఎడిషన్స్)లో భాషా విషయకంగా బాగా శ్రద్ధ తీసుకున్నట్లు కనిపిస్తుంది. రాసే విలేకరులే అనుభవజ్ఞులు కావడం వల్ల కొంత వరకు నిర్దుష్టంగా వుంటుంది. అదే నగర, జిల్లా సంకలనా (మినీ)లో బాషాదోషాలు అటు వాక్యనిర్మాణ పరంగా ఇటు ఆంగ్ల పదబాహుళ్యపరంగా కనిపిస్తాయి. స్థానిక విలేకరులు ఎలా రాస్తే అలా ప్రచురించే పరిస్థితి నేడు వుంది. గతంలోనైతే కంట్రిబ్యూటర్లు రాసే వార్తల్ని డెస్క్‌లోని ఉపసంపాదకులు పరిశీలించి దిద్ది, అవసరమైతే తిరగరాసే వారు. ఇప్పుడు పనిభారం పెరగడం, కంప్యూటర్‌మీద వార్త కొట్టడం వల్ల చూసే పరిస్థితిలేదు. బాగా రాసే కంట్రిబ్యూటర్లు తక్కువ సంఖ్యలో వుండడం వల్ల మినీల్లో భాషాదోషాలు ఎక్కువగానే కనిపిస్తాయి.

నేటి తెలుగు భాష : ఏ దిశ ఏ దశ

–ఆచార్య నడుంపల్లి శ్రీరామరాజు

సమాజాభివృద్ధికి పనికి వచ్చే విధంగా తెలుగు ఉన్నట్లయితే అంటే, వివిధ రంగాలలో తెలుగు వాడుక పెరిగితే అది సరైన దిశలో ఉన్నట్లు పరిగణన. అలా భాషా వినియోగదారునికి అందుబాట్లోకి వచ్చిన తెలుగు విషయపరంగాను, ఉపకరణాల పరంగాను, సమృద్ధిగాను, ఆధునికంగాను ఉన్నట్లయితే తెలుగు సరైన దశలో ఉన్నట్లు పరిగణన. దిశదశలను వేరుగా కాకుండా రెండింటిని కలుపుకొని విద్యారంగం ఆధారంగా నేటి తెలుగు స్థితి ఎలా ఉందో పరిచయం చేయడం ఇక్కడ ఉద్దేశింపబడింది. సాధారణంగా ఏ భాషలో అయినా సాహిత్యం ఉంటుంది. దాని వైశిష్ట్యం గురించి చెప్పడం ఇక్కడ ఉద్దేశింపబడలేదు.

సాహిత్యేతర రంగాలలోని వాడుకే తెలుగు అభివృద్ధికి సూచిక. దీనిని పరిశీలించడానికి స్థూలంగా గుర్తించిన రంగాలు విద్య, పరిపాలన, ప్రసార మాధ్యమాలు, సామాజిక వ్యవహారాలు అనేవి. ఇవి ఒక దానితో మరొకటి సంబంధం కలిగి ఉంటాయి. కాబట్టి ఒక దానిపై పరిశీలన చేస్తున్నప్పుడు ఇతర రంగాల సంబంధాలన్నీ గుర్తుంచుకోవాలి.

మనం ఇప్పుడు 21వ శతాబ్దిలోకి అడుగుపెట్టాం. వైజ్ఞానికంగాను, సాంకేతికంగాను వేగవంతమైన మార్పులు కలుగుతున్నాయి. ప్రపంచ వాణిజ్య సంబంధాలు ఎక్కువై ఆర్థిక రంగం పరిధులు చెరిగిపోతున్నాయి. ఇప్పుడు దీని ప్రభావం నుంచి ఏ మారుమూల ప్రాంతం కూడా తప్పించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులకు తట్టుకొని నిలబడిగలిగేలా జాతిని సన్నద్ధం చేయుడానికి విద్యారంగాన్ని ఎప్పటికప్పుడు సంస్కరించుకుంటూ ఉండాలి. విద్యారంగంలో ముందుగా గుర్తించవలసింది భాష. అంటే సమాజానికి సహజమైన మాతృభాష. ఇది విద్యకు వాహిక; విజ్ఞాన సముపార్జనకు ప్రధాన ఆధారం. ఇదే మానవీయ మూల్యాలను, సాంస్కృతిక లక్షణాలను కాపాడేది. అటువంటి మాతృభాష అన్ని స్థాయిలలోను పటిష్ఠంగా ఉన్నప్పుడే, విద్యారంగం ఆశించిన ఫలితాలు ఈయగలుగుతుంది. ఈ నేపథ్యంలో తెలుగు స్థితిని అంచనా కట్టుకోవాలి. మన దేశ రాజకీయ ఆర్థిక విధానాలలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులే కొనసాగితే ఈ శతాబ్ది

మధ్యకాలానికి అభివృద్ధి చెందుతున్న మన దేశం స్థానికమైన విలువలు పూర్తిగా పోగొట్టుకొని ప్రపంచీకరణ గుప్పిట్లో ఇరుక్కుపోతుంది. దీని ప్రభావంతో విద్య ఒక వినియోగవస్తువుగా స్థిరపడుతుంది. దానిలో భాగంగా తెలుగు ఏ విధమైన ప్రాధాన్యము లేని ఒక అనవసర విషయంగా మారిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటి సమాజ గమనం ఇలా ఉంది కాబట్టి, దీనిని దృష్టిలో ఉంచుకొని తెలుగు దిశను నిర్ణయించుకోవాలి; దశను నిర్ధారించుకోవాలి. ఈ సందర్భంలో దేశ రాజకీయ ఆర్థిక విధానాల సంస్కరణల గురించి ఆయా రంగాల వారికి వదిలిపెట్టి బోధనా రంగంలో ఉన్న తెలుగు స్థితిని సమీక్షించుకోవాలి.

తెలుగు ఉనికి

గత సంవత్సరం వరకు బోధనారంగంలో ఉన్న తెలుగు ఉనికికే విఘాతం కలగడం ఒక దురదృష్టకర ఘట్టం. 2003వ సంవత్సరానికి ముందు మన రాష్ట్రంలో పాఠశాల స్థాయిలో తెలుగు తప్పనిసరిగా చదవాలనే నియమం లేదు. కొన్ని ప్రసిద్ధమైన పాఠశాలల్లో తెలుగు ఉండేది కాదు. తెలుగు భాషా చైతన్య సమితి కృషి ఫలితంగా పాఠశాల స్థాయిలో తెలుగు తప్పనిసరి పాఠ్యాంశంగా ప్రభుత్వం అంగీకరించింది జి. ఓ. (86/2-7-03)ను విడుదల చేసింది. ఆ నియమం 2004 నుంచి అమలులోకి వచ్చింది. ఆ పైన ఇంటర్మీడియట్ విద్య తర్వాత విద్యార్థికి మాతృభాష చదివే అవకాశాలు తగ్గిపోతాయి. ప్రపంచీకరణ మూలంగా మాతృభాషలు, ఇంగ్లీషు ముందు ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. అందుచేత భాషా పరమైన ప్రజా సంక్షేమ దృష్టితో తెలుగును ఇంగ్లీషు సరసన నిలబెట్టాలిలి. ఇది ప్రభుత్వ కర్తవ్యం. ఈ భారాన్ని మళ్లీ తెలుగు భాషా చైతన్య సమితి తన భుజాలపై వేసుకొని కృషి చేస్తోంది.

తెలుగు మాధ్యమం

ఈనాడు అంతర్జాతీయ విపణికి పనికి వచ్చే వ్యక్తులు కావాలి. వారు ఒకపాటి ప్రతిభతోపాటు సమాచారాన్ని వ్యక్తం చేయగల నైపుణ్యం కూడా కలవారై ఉండాలి. అది ఇంగ్లీషు మాధ్యమం ద్వారా కలుగుతోందని అందరూ నమ్ముతున్నారు. తెలుగు మాధ్యమ విద్యార్థి ఈనాటి ఉద్యోగావకాశాల్ని ఇంగ్లీషు మాధ్యమ విద్యార్థితో సమంగా అందిపుచ్చుకోలేకపోతున్నాడు. అందుచేత తెలుగు మాధ్యమ విద్య అటు విద్యార్థిని గాని, ఇటు తల్లిదండ్రులను గాని ఆకర్షించలేక పోతోంది. ఇక్కడ ఆంగ్ల మాధ్యమం వల్లనే విద్యార్థులు విజ్ఞాన వంతులు అయిపోతున్నారని కాదు గాని, వృత్తి నైపుణ్యంలో ప్రపంచ విపణికి తగిన విధంగా తయారు కాగలుగుతున్నారనే అభిప్రాయంలో కొంత సత్యం

లేకపోలేదు. అదే ఉద్యోగావకాశాన్ని అందిపుచ్చుకోడం అంటే. దీనికి దేశ ఆర్థిక విధానాలో మరొకటో కారణం అని చెప్పినప్పటికీ, ఇప్పటి వాస్తవం అది.

అందుచేత తెలుగు మాధ్యమానికి ఉద్యోగావకాశాలు పొందగలిగే శక్తిని, తెలుగు భాషకు ఇంగ్లీషుతో సమానమైన స్థాయిని ప్రభుత్వాలు కల్పించినప్పుడే బోధనారంగంలో తెలుగు అభివృద్ధి చెందుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికా వంటి సంపన్న దేశాలకు చవకగా సాంకేతిక నిపుణులను అందించేందుకు అనువైన దిశలో ఆంగ్లమాధ్యమ విద్య ఉంది. దానికి పనికివచ్చే దిశలో తెలుగు మాధ్యమ విద్య లేదని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. తెలుగు మాధ్యమ విద్యార్థులకు ఇంగ్లీషులో నైపుణ్యం పెంచడం ద్వారా వీరిని పోటీలో ఆంగ్లమాధ్యమ విద్యార్థులకంటే ముందు నిలబెట్టవచ్చు. ఈ బాధ్యత ప్రభుత్వ విద్యాశాఖపై ఉంది. సాధారణంగా విద్యారంగంలో మానవీయ మూల్యాలను, జ్ఞానాన్ని పెంచడంతోపాటు స్థానిక అవసరాలకు పనికి వచ్చే నిపుణులను తయారు చేసేదిగా ఉండాలి. దేశ ఆర్థిక విధానాలను ఆ విధంగా రూపొందించాలి. అలా ఉన్నప్పుడే తెలుగు తనకు తానుగా దిశానిర్దేశం చేసుకోగలుగుతుంది. ఈ దృష్టితో ప్రభుత్వం విద్యాప్రణాళికలను రూపొందించినప్పుడే తెలుగు అభివృద్ధి చెందుతుంది.

పాఠ్యగ్రంథాలు

పాఠశాల స్థాయిలో నేర్చుకొనే భాషలలో తెలుగు మాతృభాష, మాధ్యమ భాష కూడా; ఇంగ్లీషు తప్పనిసరి భాష, కొందరికి మాధ్యమ భాష కూడా. గణితం వంటి శాస్త్రాల అధ్యయనం, భాషల అధ్యయనంలో పొందిన సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది. మాతృభాషలో ప్రావీణ్యం సాధిస్తేనే ఇతర భాషలు, శాస్త్రాలు సులభంగా వస్తాయనే సత్యం బోధనారంగానికి తప్పనిసరి లక్ష్యంగా ఉండాలి. అప్పుడే విద్యా ప్రమాణాలు మెరుగవుతాయి. ఇది నాకు చెందినది, దీని వలన నాకు ప్రయోజనం ఉంది. ఇది నా వారసత్వ సంపద, ఇదంటే నాకు ఇష్టం వంటి భావాలు విద్యార్థికి కలిగినప్పుడే దానిని చదువుకుంటాడు. ఇంగ్లీషుతో పోల్చినప్పుడు తెలుగు పట్ల నిర్లక్ష్యం కలుగుతోంది. ఇది ఇంగ్లీషుతోపాటు ఇతర శాస్త్రాల అధ్యయనాన్ని కూడా బలహీన పరుస్తోంది. ఇలా మాతృభాషకు జరుగుతున్న న్యాయం విద్యార్థి దశను నిర్వీర్యం చేస్తోంది. ఈ అంశాన్ని సరిదిద్దే దృక్పథం ఇప్పటి బోధనారంగానికి ఉండాలి.

జ్ఞానాన్ని అందివ్వడంతోపాటు వ్యక్తీకరించడం, రకరకాల నైపుణ్యాలు కలిగించడం అనేవి తెలుగు బోధనా రంగానికి లక్ష్యంగా ఉండాలి. ఇంగ్లీషు మాధ్యమ విద్యార్థులకు ఉండే వ్యక్తీకరణ సామర్థ్యం తెలుగు మాధ్యమ విద్యార్థులకు ఉండడం లేదని చాలా

మంది అంటూ ఉంటారు. వాచకాలకు తరగతులవారీగా నిర్దిష్టమైన లక్ష్యాలు ఉంటాయి. అదనంగా ఇప్పటి ప్రపంచీకరణ ప్రభావాలను దృష్టిలో పెట్టుకొని భాష, సంస్కృతి మొదలైన వాటి మీద సరైన అవగాహన కలిగించడం ఇప్పటి వాచకాలకు లక్ష్యంగా ఉండాలి. ఇప్పటి తెలుగు వాచకాలలో మేలైన విషయాలు లేవని చెప్పలేము కాని, కొన్ని పాఠ్యాలు ఆసక్తిజనకంగా లేవని, భాషా సంస్కృతుల పట్ల గౌరవభావాన్ని కల్పించలేకపోగా వైముఖ్యాన్ని కల్పించేవిగా ఉన్నాయని కొందరు అంటుంటారు. పాఠ్యాలుగా ఉన్న కొని ఆధునిక రచనలు విద్యార్థులలో భాషా నైపుణ్యం పెంచేవిగా లేవని విషయపరంగా లేత మనసులను గాయపరిచేవిగా ఉన్నాయని మరికొందరు అంటూంటారు. పాఠ్యాలుగా ఎంపిక చేసిన రచనలు, వేరొక సందర్భానికి రచించినవి, పాఠ్యంగా నిర్ణయించడానికి చేసిన రచనలు కావు, అనేది కొందరు విజ్ఞుల అభిప్రాయం. ఇటువంటవి స్వల్పస్థాయిలో ఉన్నప్పటికీ అవి తెలుగు బోధనపై ప్రభావం చూపుతాయి.

తెలుగు యాజమాన్యాల ప్రభావం

గణాంక వివరాలను బట్టి నాల్గింట మూడు వంతుల పాఠశాలలు పాలనా పరంగానో, ఆర్థిక పరంగానో ప్రభుత్వ అజమాయిషీలో ఉంటాయి. ఇటువంటి కొన్ని పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా ఉంటున్నాయని మౌలిక వసతులు సరిగ్గా ఉండవని, అధ్యాపకులు కొందరిలో నిబద్ధతా నిమగ్నతా కొరవడ్డాయని వింటూ ఉంటాం. ఈ పాఠశాలల్లో తెలుగు మాధ్యమమే ఉంటుంది. విద్య ఉచితంగా లభిస్తుంది. పేద విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. పాఠశాల పరిస్థితులకు విద్యార్థుల పేదరికం తోడవగా విద్యలో ప్రమాణాలు సాధించడంలో ప్రభుత్వ పాఠశాలలు వెనుకబడుతూ ఉంటాయి. ఇటువంటి నేపథ్యంలో తెలుగు గుర్తింపుకు నోచుకోడం లేదు. పట్టణాల్లో పాఠశాల విద్య ప్రాథమిక స్థాయి నుంచి ఎక్కువగా ప్రైవేటు యాజమాన్యాల చేతుల్లోనే ఉంది. ఎగువ మధ్యతరగతి, పైతరగతులకు చెందిన పిల్లలు ఈ పాఠశాలల్లోనే చదువుతారు. జూనియర్ కళాశాల విద్య చాలా వరకు ప్రైవేటు రంగంలోకి వెళ్ళిపోయింది. ప్రైవేటు రంగం వల్ల పోటీ ఎక్కువై విద్యలో ప్రమాణాలు పెరుగుతున్నాయని కూడా కొందరంటారు. అయినా నష్టాలు జరుగుతున్నాయి. నేటి అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను పొందడంలో పేద విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. ఇది అందరికి తెలిసిందే. ప్రపంచీకరణ ప్రభావాల వలన ఇంగ్లీషు ప్రపంచ వ్యాపార భాషగా ఎదిగి దాని మూలం ఉద్యోగావకాశాలు కలుగుతున్నాయి. కాబట్టి ప్రైవేటు విద్యారంగంలో ఇంగ్లీషు మాధ్యమమే ఉంటుంది. వీటిలో విద్యకు సంబంధించిన మౌలికాంశాలకంటే తక్షణం ప్రయోజనం కలిగించే

వాటిమీదే శ్రద్ధ ఉంటుంది. ఈ సంస్థలు విద్యార్థులను ఆకర్షించి లాభాలను గడించడానికే చూస్తాయి. ఇలా తెలుగు మాధ్యమ విద్య వ్యాపారరంగానికి పనికిరాకపోవడం చేత తెలుగు విలువను కోల్పోతుంది. ఈ సందర్భంలో ప్రభుత్వం విద్యారంగంపై పట్టు సాధించలేక ఏమీ చేయలేని స్థితికి వచ్చేసింది. దీని ఫలితమే తెలుగు చదవక్కరలేదని విద్యార్థి, తల్లిదండ్రులూ అనుకొనే దశకు రావడం. ఇలా తెలుగు అభివృద్ధికర దశలో లేకపోవడానికి పరోక్షంగా పాఠశాల యాజమాన్యాలు కూడా కారణం అవుతున్నాయి.

త్రిభాషా విధానం

విద్యారంగంలో తెలుగు అభివృద్ధి చెందక పోవడానికి త్రిభాషా విధానం కూడా నేడు అవరోధమే. ఈ విధానం ఈనాడు విద్యార్థిపై ఎంతో భారాన్ని మోపుతోంది. విజ్ఞానం అపరిమితంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, మాతృభాష విలువను కోల్పోతున్న నేటి కాలంలో, కాలం చెల్లిన త్రిభాషా విధానానికి స్వస్తి చెప్పవలసిన సమయం వచ్చేసింది. ఇప్పుడు మాతృభాషా ప్రాముఖ్యాన్ని చాటి చెప్పలేకపోతే, దాని ప్రయోజనాన్ని జాతి పొందలేక పోతుంది. రాష్ట్ర ప్రజలలో సుమారు 80% మంది ఈ రాష్ట్రంలోనే ఉంటారు. ఎక్కువ మంది పై చదువులకు వెళ్లలేరు. ఇతర ప్రాంతాలకు వెళ్లరు. ఎక్కువమంది ఈ రాష్ట్రంలోనే తమ బతుకు తెరువును వెతుక్కుంటూ ఉంటారు. వారందరు విలువైన విద్యాసమయాన్ని ఇంగ్లీషు హిందీ భాషలు నేర్చుకోడానికి వినియోగిస్తూ జ్ఞాన సముపార్జనలో వెనుకబడుతున్నారు. సుమారు 10,12 సంవత్సరాల విలువైన విద్యార్థి జీవితంలో ప్రయోజనం లేని పరభాషలు నేర్చుకొనే సమయాన్ని గణితం, వైజ్ఞానిక సామాజిక శాస్త్రాలు చదువుకోడానికో వృత్తి విద్యకో వినియోగిస్తే యువకులు తమను తాము చక్కదిద్దుకుంటూ దేశ సంపదను సృష్టించడంలో భాగస్వాములు కాగలరు. ఈ విధంగా విద్యారంగంలో తెలుగు భాషకు ఉన్న పరిస్థితిని సమీక్షించుకొని తెలుగు అభివృద్ధికి పథకాలు రచించుకోవాలి.

జానపద గీతాలు-అనువర్తనప్రక్రమం-మాధ్యమవివేచనం

-డా. పులికొండ సుబ్బాచారి

పాట అనే మాటలో రెండు ప్రక్రియలు ఉన్నాయి. ఇకటి పాడే ప్రక్రియ మరొకటి రాసే ప్రక్రియ. పాట పాడేవాడు గాయకుడు అవుతున్నాడు. పాట రాసేవాడు కవి అవుతున్నాడు ఈ ప్రక్రియలో స్పష్టంగా ఇద్దరు వ్యక్తులు లేదా ఇద్దరు కళాకారులు ఉన్నారు. పాటను ఒక గాయకుడు పాడినప్పుడూ ఇద్దరు వ్యక్తుల సృజన బయటికి వెలువడి శ్రోతకు అందుతుంది. ఆధునిక మాధ్యమంలో లిఖిత మాధ్యమానికి లిఖిత సాహిత్యానికి చెందిన సందర్భంలో ఇలా ఇద్దరు వ్యక్తులు కావించిన సృజన పాటగా రూపొందుతుంది. కాని ఇదే మౌఖిక మాధ్యమంలో అంటే జానపద సంప్రదాయంలో పాట పాడిన వ్యక్తి పాటను కవిత్వీకరించిన వ్యక్తి ఒక్కరే ఉంటారు. ఇంకా చాలా సందర్భాలలో పాట పాడడం అనే సృజన క్రియ కైకట్టడం అంటే కవిత్వీకరించడం అనే సృజన క్రియ కూడా ఒకేసారి జరుగుతాయి. ఇదే నోటిపాట. ఈ పాటల్ని సృష్టించుకునే వారు వీటిని మామూలుగా పాటలు అని పిల్చుకుంటారు. పాడే వాడిని వాడు మంచి పాటగాడు అని వాడు మంచిగా కైకట్టే వాడని కైతకాలోడని ఆనందంగా పిల్చుకుంటారు. ఈ పాటల్నే ఆధునికులైన పండితులు పరిశోధకులు జానపద గేయాలు అని జానపదగీతాలు అని తమ మాధ్యమంలో తమ పరిశోధన భాషలో వ్యవహరిస్తున్నారు. ఈ వ్యాసం మొత్తంలో పాట, జానపద గీతం, జానపద గేయం అనే మూడు మాటల్ని సమానార్థకాలుగా పర్యాయపదాలుగా వినియోగిస్తున్నాను. పాట, కథను తొడుకున్న పొడుగైన పాటా రెండూ ఇక్కడ పాట అనే అర్థం కిందకే వస్తాయి.

తెలుగు జానపద సాహిత్యం:

మౌలిక స్వరూపం అనే శీర్షిక కింద ఉన్న ఈ సదస్సును దృష్టిలో ఉంచుకొని జానపదగీతాల మౌలిక స్వరూపాన్ని అంటే సృజనక్రమాన్ని (Creative processes), అనువర్తన క్రమాన్ని (application processes) దాని బిన్న భిన్న ప్రయోగగతి క్రమాలను

(performance dynamics) ఈ ప్రసంగ పత్రంలో విశ్లేషిస్తున్నాను. పాట మౌఖిక మాధ్యమంలో పుట్టి అక్కడే ప్రవర్తిస్తూ అ సంస్థితికే మిగిలిపోతే ఏ ప్రక్రియ అవుతుంది. అలా కాక అది విభిన్న మాధ్యమాలలోనికి విభిన్న సామాజిక ప్రకరణాలలోనికి (social contexts) అనువర్తించబడినప్పుడు వివిధ ఇతర అవసరాలకు వినియోగించుకున్నప్పుడు ఏ ప్రక్రియలకు చెందుతుంది. అనే ప్రక్రియా వివేచనాన్ని, జానపదశాస్త్ర నేపథ్యంతో ఇక్కడ విశ్లేషించి చూపే ప్రయత్నాన్ని చేస్తాను. ఇది ప్రసంగ పత్రం కనుక సమయ పరిమితులకు లోబడే వివేచన పరిమితులు ఉంటాయి. దీని ప్రచురణ ప్రతిలో పూర్తిగా విస్తరించుకునే అవకాశం ఉంది. జానపద గీతానికి సంబంధించి ఇంతకు ముందే పరిశోధకులు ప్రస్తావించిన విషయాల్ని ఇక్కడ ప్రస్తావించడం లేదు. ఇంతకుముందే విశ్లేషించిన జానపద గేయ లక్షణాలను గురించీ ఇక్కడ పునశ్చరణ చేయడం లేదు. నాజపదగీతానికి సంబంధించిన సిద్ధాంత చర్చకు ప్రక్రియా వివేచనకు కొత్త ఆలోచనలకు ఇక్కడ పరిమితం అవుతాను.

పాట ఎప్పుడు పుట్టింది అనే ప్రశ్న అత్యంత క్లిష్టమైన ప్రశ్న. ఇది ఏ భాషలోని పాటకైనా వర్తించే ప్రశ్న. పాట అనేది మనిషి తనకున్న అనేక కళలలో సంస్కృతి వికాస క్రమంలో సృష్టించున్న వాక్కళ Verbal Art అని చెప్పాలి. ఈ కళ మానవ నాగరికత లేదా సంస్కృతి వికాస క్రమంలో తొలి అడుగులు వేస్తున్న సమయంలోనే సృజించుకున్న కళ. మనిషికి ఇతర, బాహిరమైన సాధన సంపత్తి పరికరాలు లేకుండా సృజించగలిగిన కళలు పాట. కథ, ఇతర నోటి సాహిత్య ప్రక్రియలు. ఇక్కడ పాట అంటే అప్పటికప్పుడే పాడిన కళ అని ఇందులో సంగీతం కూడా ఉందని అర్థం. కథలు ఇతర నోటి సాహిత్య ప్రక్రియలు అన్నీ ఈ క్రమంలో ఉద్బుద్ధమైనవే. మిగతా అన్ని కళలకు ఇతర సాధన సంపత్తి కావలసి ఉంటుంది. మనిషి సృష్టించుకున్న ఆదిమ కళగా పాటను చెప్పాలి.

సాహిత్యం అంటే మనకు వెంటనే గుర్తుకు వచ్చేది తాళపత్రగ్రంథాలు, అచ్చయిన పుస్తకాలు వివిధ సాహిత్య ప్రక్రియలు. కాని మొటిగా గుర్తుకు రావలసిన మౌఖిక మాధ్యమ సాహిత్యం, తేలిగ్గా చెబితే నోటి సాహిత్య ప్రక్రియలు గుర్తుకు రావు. విశేషం ఏమంటే భారత దేశంలో లిపిలేని, మౌఖిక సంస్కృతికే పరిమితమైన ఎన్నో వందల గిరిజన భాషలు ఇంకా సజీవంగా ప్రవర్తిల్లు తున్నాయి. వాటిలో ఎంతో విశిష్టమై సాహిత్యం ఉంది. ఇది ఎంత ఉందంటే ఇప్పటిదాకా ఆధునిక నాగరికతో సృష్టించిన పరిమాణంలోని శిష్ట సాహిత్యం కన్నా అధికమైన పరిణామంలో ఈ సాహిత్యం ఇప్పటికీ లభిస్తుంది. రామాయణ, మహాభారతాల వంటి అతి సుదీర్ఘమైన ఇతిహాసాలు, గిరిజనులకే చెందిన దీర్ఘ ఇతాహాసాలు పురాణాలు ఈ శుద్ధ మౌఖిక సాహిత్యంలో ఉన్నాయి. కాని మనకు

సాహిత్యం అంటే 99 శాతం మందికి ఈ సాహిత్యం గుర్తుకు రాదు. లిఖిత మాధ్యమ సాహిత్యమే గుర్తుకు వస్తుంది. ఒక వేళ నోటి సాహిత్యం గురించి మాట్లాడవలసి వచ్చినా లేదా రాయవలసి వచ్చినా అది లిఖిత మాధ్యమ సాహిత్యం నేపథ్యంలో ఆలోచించే మనం మాట్లాడుతూ ఉంటాం.

ఏ భాషా సాహిత్యం అయినా తొలిగా నోటి సాహిత్యంగా ఉండే తర్వాత పరివర్ధితమై లిపిని సంతరించుకొని లిఖిత సాహిత్యంగా పరిణమించిందని రూఢిగా చెప్పడానికి తగిన పరికరాలు అన్నీ ఈ రోజున పరిశోధకులకు అందుబాటులో ఉన్నాయి. అన్ని జాతుల సంస్కృతులలో అన్ని భాషలలో నోటిపాటే తొలి వాక్కళ.

న్యూరో ఫిజియాలజీ అనే శాస్త్రం వారు న్యూరో లింగ్విస్టిక్స్ అనే శాస్త్ర సహకారంతో భాష పుట్టుక ఎలా జరిగింది అంటే మానవుడి మెదడులో ఏ మార్పులు జరిగే క్రమంలో జరిగింది అలాగే భాషా సాహిత్యాలు పుట్టిన తర్వాత మనిషి లిపిని ఆవిష్కరించుకునే దశ మానవుడి మేధలో ఏ మార్పులు జరిగిన కాలంలో జరిగింది అనేక విచికిత్స చేసి పరిశోధించి కొంత సఫలం అయ్యారు. వాల్టర్ జె. ఓంగ్ అనే పరిశోదకుడు రాసిన ఓరాలిటి అండ్ లిట్రసీ: ది టెక్నలాజైజింగ్ ఆఫ్ ది వర్డ్ అనే పుస్తకంలో దీనికి సంబంధించిన వివరాలు ఉన్నాయి. మనిషి మెదడు బైకామరల్‌గా ఉంటుందని అంటే లెఫ్ట్ హెమ్ స్ఫియర్, రైట్ హెమస్ఫియర్ అనే రెండు భాగాలుగా విడిపోయి ఉంటుందని ఇందులో కుడి అంటే రైట్ హెమ్ స్ఫియర్ అనే భాగం అన్ కంట్రోలబుల్ వాయిసెస్‌ను అంటే అర్థంలేని, అదుపులేని ధ్వనులను సృష్టిస్తుందని, ఈ ధ్వనులు చాలా వరకు భగవంతునికి సంబంధించిన ఆలోచనలకు సంబంధించిన వని కాని ఈ ధ్వనులేవీ అర్థవంతమైన ధ్వనులు కావని చెబుతాడు జూలియన్ జైన్స్ అనే పరిశోధకుడు. ది ఆరిజిన్స్ ఆఫ్ కాన్షియస్ నెస్ ఇన్ ది బ్రేక్ డౌన్ ఆఫ్ ది బైకామరల్ మైండ్ అనే గ్రంథంలో వివరించాడు. ఇలా అర్థవంతం కాకుండా వస్తూ ఉన్న ధ్వనులను కాలక్రమంలో ఎడమ భాగం అంటే లెఫ్ట్ హెమస్ఫియర్ భాషగా ప్రోసెస్ చేసిందని ఈయన చెప్పాడు. ఇలా ఎన్నో శతాబ్దాలు భాష అంటే భాషలు అన్నీ మౌఖికంగానే మిగిలిపోయాయి అని చెబుతూ ఒక సమాచార శక్తిగా లేదా వాక్ శక్తిగా ఉన్న ఈ నోటికే పరిమితం అయిన భాష క్రీస్తు పూర్వం 2000 సంవత్సరాల నుండి క్రీస్తుపూర్వం 1000 సంవత్సరాల మధ్యన మెదడులోని దాని శక్తిని క్రమంగా తగ్గించుకుంటూ లిపిని గురించి ఆలోచించిందని ఆ క్రమంలోనే లిపి ఆవిష్కరణ అనేది క్రీస్తుపూర్వ 1500 ప్రాంతంలోనే ఆవిష్కృత మైందని ఈ సాంకేతిక శక్తి క్రమంగా క్రీ.పూ.1500 ప్రాంతంలోనే ఆవిష్కృతమైందని ఈ సాంకేతిక శక్తి క్రమంగా అన్ని భాషలకు వ్యాపించిందని వివరించాడు. జూలియన్ జైన్స్. ప్రపంచంలోని అతి ప్రాచీన

సాహిత్యాలలో ఒకటిగా భావించే హోమర్ అనే కవి పేరుతో ఉన్న ఇలియడ్, ఒడిస్సీ ఇతిహాసాలు లిపి ఆవిష్కరణ కన్నా చాలా ముందు నుండే ఉన్నాయని విశ్లేషించాడు. అలాగే పాడే పాట సాహిత్య ప్రక్రియలో ఉన్న ఈ ఇతిహాసాలు కూర్చింది ఒక వ్యక్తి కాదని కూడా హోమర్ అనే పేరుతో ఒకే వ్యక్తి రాసినవి కావని కూడా చెప్పాడు. మౌఖికంగా ఉన్న ఈ సాహిత్యం లిపిబద్ధం అవుతూ ఉన్న క్రమంలో అంటే లిపిని గురించి ఆలోచించే సమయంలోనే ఈ ఇతిహాసాలలో పాత్రల స్వభావ చిత్రణలో మార్పులు వచ్చాయని. కేవల మౌఖిక సాహిత్యం సృష్టించే వ్యక్తుల మానసిక స్థితి లేఖన విద్య తెలిసిన సమాజాలలోని వ్యక్తుల మానసిక స్థితి కన్నా భిన్నంగా ఉంటుందని ఈ ప్రభావం పాత్రల సృజనపైన ఉంటుందని విశ్లేషించి చెప్పాడు. ఈ ద్వైదీభావం ఈ గ్రీకు ఇతిహాసాలలో ఉందని చెప్పాడు.

ఇక ఈ నోటిపాట సాహిత్యానికి సంబంధించిన విషయాలలో భారతీయ సందర్భంలోనికి వస్తే మహాభారత కాలం దాదాపు 3000 సంవత్సరాల ప్రాంతం అని ఇప్పటి వరకూ అనుకుంటూ వచ్చిన ఆలోచనలు సరికాదని ఇది దదాపు 5000 సంవత్సరాల ప్రాంతం కావచ్చని ఇటీవలి పరిశోధనలు తెలుపుతున్నాయి. ఒక వేళ 3000 సంవత్సరాల ప్రాంతమే అని అనుకున్నా ఈ చరిత్ర లిపి అనేది ఒకటి లేని కాలానికి చెందినదని లిపి ఆవిష్కరణకన్నా చాలా ముందుది అని తెలియవస్తూ ఉంది. అంటే లిపిని గురించి మనిషి అప్పుడప్పుడే ఆలోచిస్తూ ఉన్న కాలానికి చెంది ఉండవచ్చు. మహాభారత కథ రామాయణ కథ లిపిలోనికి రాకముందే మౌఖిక మాధ్యమంలోనే చాలా కాలం సంస్థితిలో ఉన్నాయని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. మహాభారత కవిగా రామాయణకవిగా మనం చెప్పుకుంటూ వస్తున్న వ్యక్తులు, వ్యాసుడు, వాల్మీకి ఆ కథలలోని పాత్రలు, ఆకాలపు వ్యక్తులు కావడం ఇక్కడ గుర్తించాలి. మహాభారత కథ మౌఖికంగా చాలా కాలం సంస్థితిలో ఉన్న తర్వాతనే లిఖితం కాబడింది అని చెప్పడానికి అంతర్గత సాక్ష్యాలు ఉన్నాయి. మహాభారతం ఆది పర్వంలోనే ఏ ఏ ఆశ్రమాలలో మహాభారత కథ చెప్పబడుతూ వస్తూ ఉంది. ఏ ఋషి నుండి ఏ ఋషి అంటే ఏ గురువు నుండి ఏ గురువు వినుకలి ద్వారా కథను తెలుసుకున్నాడు కథలు చెప్పే సూతులు ఎలా ఉన్నారు అనే వివరాలు ఉన్నాయి. వ్యాసుడే ఈ వివరాలను కథలో చొప్పించి చెప్పాడు కనుక అంతకు ముందే పాటగా మౌఖికంగా మహ భారతం ప్రచురంగా ఉందని చెప్పడానికి మంచి ఆధారాలుగా ఈ వివరాలు నిలుస్తాయి. ఇక రామాయణ విషయానికి వచ్చినా కూడా ఇది మౌఖిక మాధ్యమంలోనే బాగా ప్రచురంగా ఉన్న తర్వాతనే లిఖితమైందని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. లవకుశులు రాముని ఎదురుగా రామాయణగానం

చెసినప్పుడు రాముడు మీరు ఇలా దేశిపద్ధతిలో అంటే జానపద పద్ధతిలో ఎందుకు పాడతారు మార్గ శిష్టపద్ధతిలో పాడవచ్చుగా అని అన్నాడని చెబుతారు. నోటిపాటల ఈ సాహిత్యాలే లిఖిత మాధ్యంలోనికి జొరబడినా కూడా అవి ఈనాటికి కూడా నోటిపాటల రూపంలో సంస్థితిని కొనసాగిస్తూ లిఖిత పరివర్ధిత సాహిత్యంతో భుజం భుజం కలిపి నడుస్తూ ఉండడం విశేషం. అలాగే రామాయణ మహాభారతాలు కాలంతోపాటు విస్తరిస్తూ వచ్చాయని కూడికలకు తీసివేతలకు గురవుతూ వచ్చాయని తెలుస్తూ ఉంది. 25 వేల శ్లోకాల జయ అనే గ్రంథం 1,00,000 శ్లోకాల సంఖ్యకు విస్తృతం అయిన తీరు వల్లనే ఇది ఒక వ్యక్తి రాసింది కాదని చెప్పక చెబుతూ ఉంది. కాని అది వ్యాసుని పేరనే చెలామణి కావడం లిఖిత సాహిత్య లక్షణ ప్రభావం. కాని ఇదే మౌఖిక మాధ్యమంలో జరిగిన మార్పులకు పెరుగుదలకు వివరించి చెప్పడానికి ఆధారాలు దొరకవు. లిపి లేకుండా కేవలం మౌఖిక సంస్కృతి మాత్రమే కలిగి ఉన్న గిరిజన తెగలలో మౌఖిక సాహిత్యం అంటే నోటి పాట కథ సజీవంగా చాలా సుసంపన్నంగా ఉండడం భారతదేశానికి విశేషించి ఉన్న మరొక లక్షణం. ప్రపంచంలో ఉన్న 6500 భాషలలో 1650 భాషలు భారత దేశంలోనే ఉన్నాయి. అందుకే భారత దేశాన్ని మ్యూజియం ఆఫ్ లాంగ్వేజస్ అని అంటూ ఉంటారు. కాగా 1650 భాషలలో లిపిసంప్రదాయంలోనికి చేరిన సాహిత్యాల సంఖ్య 25 లోపునే. అంటే పాట అనే సాహిత్య ప్రక్రియ లేదా జానపద గీతం అనే సాహిత్య ప్రక్రియ భారత దేశంలో 90% ఇంకా మౌఖిక మాధ్యమంలో అంటే నోటిపాటగానే ఉంది. తెలుగులోనూ రాత సాహిత్యం ఎంత ఉందో అంతకు మించిన పరిమాణంలో నోటి సాహిత్యం కూడా అంటే పాట సాహిత్యం కూడా ఉంది. ఇంకా దాదాపు 70 దాకా జానపద ప్రదర్శన కళలు తెలుగులో పాటను సజీవంగా మౌఖిక మాధ్యమంలో నిలుపుతూ ఉన్నాయి. విడిపాట కూడా పనిపాటలుగా ఇతర వర్గీకరణలలోని పాటలుగా సజీవంగా ఉన్నాయి. కాలగతిలోని పరిణామాలను వీటిలో చూడవచ్చు. కాని మౌలిక లక్షణమైన మౌఖిక సాహిత్యపు లక్షణాలుఏ నోటిపాట లక్షణాలు ఇంకా బాగా కొనసాగుతూ ఉన్నాయి. ఇక పాట, అంటే జానపద గీతం ఎప్పుడు నిజంగా జానపద గీతం అవుతుంది. ఏ విధమైన గుణాత్మక పరిణామాలు (qualitative changes) జరుగుతాయి అనే విశ్లేషణ ఇక్కడ చేస్తాను.

పాట అనే ప్రక్రియ మౌలికంగా మనిషి మాట్లాడే భాషలో నుండే పుడుతుంది. మనిషి మాట్లాడే వచనమే సుష్ఠు నిర్మితిని అంటే ఉద్దేశించిన ఒక రూపాన్ని పొందితే పాట అవుతుంది. మాట్లాడే భాషలోని పదాలు కొన్ని ధ్వనిసంపుటులుగా పేర్చి సమదీర్ఘత్వంతో సమ ప్రమాణమైన పాద విభాగాలుగా కూర్చుకుని పాదంలో నిర్ణీత

వ్యవధిలో వచ్చే అక్షర మైత్రిని చూచుకొని అలాంటి సమధ్వని సంపుటుల పాదాల గుంపులు ఒక చోట చేరడం ద్వారా పాట కట్టబడుతుంది. ఈ సమధ్వని సంపుటాలే (oral formulas) పల్లవిపాదాలుగా చరణాలుగా రూపొందుతాయి. ఒక పాటకున్న ధ్వని సంపుటుల క్రమం మరొక పాటకు ఉండకపోవచ్చు. కాని ఒక ధ్వని సంపుటుల క్రమం అన్నది ప్రతి పాటకు ఉంటుంది. దీని ద్వారానే లయ సిద్ధిస్తుంది. దీని ద్వారానే పాటకు పాడే క్రమం అంటే గేయగుణం లభిస్తుంది. అప్పుడే మామూలు మాటలు పాటగా రూపొందుతాయి. నోటి పాటలకు ఛందస్సు ఉండదని అవి శాస్త్రీయం కావని చేసే విమర్శలు, విసుర్లు శాస్త్రం తెలియనివారు చేసేవే. ప్రతిపాట ఒక సుష్టు నిర్మితిని కలిగి ఉంటుంది. అంటే ఒక్కే పాట ఛందో నిర్మాణం ఫార్ములా పాడే సమయంలో తయారవుతుంది. అది మౌఖిక మాధ్యమంలో ప్రవహించే క్రమంలో రూపం చక్కదిద్దబడుతూ వస్తుంది.

ముత్యాల జాతర నేను బోత ముత్తక్క
నా మొగడుంటాడు నువు జుసుకో
ఇంటి యెనకా గోడ కూలింది ముత్తక్కా
వుప్పారోళ్ళని బిల్చి పెట్టికోచ్చు ముత్యా
యింటి ముంగటి సింత కాసింది ముత్తక్కా
కాయగోసి గింజ కొట్టిచ్చుకో ముత్యా
దొడ్డిలోని తాళ్ళు పెరిగేను ముత్తక్కా
ఆకు మడతాయేసి తొక్కిచ్చుకో ముత్యా
బాయి చుట్టూ గడ్డి పెరిగింది ముత్తక్కా
గడ్డికోసి చేదా యోపిచ్చుకో... ముత్యాల

రార నాయింటికి
రాత్తిరి కాడరార నాయింటికీ, పొద్దటిపూట పోర నీయింటికి
యింటి మొగుడూ యీనమాయె
బయటిమొగుడు పానమాయె
రార నాయింటికీ

పొట్టిదీ పొట్టిదీ అని పొందదేమో నీదుమనసూ

పొట్టిదాని గట్టితనమూ పట్టెమంచామెక్కి చూడు. రార నాయింటికీ,

నల్లదీ నల్లాది అని నప్పదేమో నీదు మనసూ

నల్ల హూమి దున్ని సూడు తెల్లజొన్నలు పండయేమో. రార నాయింటికీ

లావూదీ లావూది అని లాకి యనదో నీదు మనసు

లావు పరుపున పండి చూడు లచ్చనంగా ఉండదేమొ. రార నాయింటికీ,

ఈ పాటలోని పాదాల వివిధ ధ్వని సంపుటుల నిర్మాణ వైచిత్రిని చక్కగా గమనించవచ్చు. పాటను అలవోకగా పాడినా అతని మనఃపటలంలో ఉన్నా వీటి రచన ఎంత ఆలోచనాత్మకమైన నిర్మాణాన్ని పొదిగి ఉందో గమనించ వచ్చు. దీన్నే థాటెడ్ ప్రాసెస్ అని అంటారు. పాదాల నిర్మాణంలో ధ్వని సంపుటుల క్రమాలను చూడ వచ్చు. ఈ ధ్వని సంపుటుల రచనా క్రమాలనే ఓరల్ పార్ములాస్ అని అంటారు. ఓరల్ ఫార్ములాయిక్ థియరీ అనేది చాలా విస్తృత చర్చల ఫలితంగా ఏర్పడి చాలా విస్తృతమైన పరిశోధనలను అందించింది. పాశ్చాత్య దేశాలలో ఓరల్ ఫార్ములాస్ ఆధారంగా మిల్మన్ పారీ దగ్గర నుండి ఇప్పటిదాకా ఎంతో పరిశోధన జరిగింది ఇంకా జరుగుతూ ఉంది. తెలుగులోని జానపద గీతాలను వేటిని తీసుకున్నా ఇలాంటి స్వయం చాలిత స్వయం నిర్మిత ఛందస్సు సుష్టు నిర్మాణం పాటల్లో కనిపిస్తుంది. చాలా పాటల్లో తుల్యమైన ఫార్ములాస్ కూడా ఉండవచ్చు.సంగీతంతో కలిపి ఇలాంటి నిర్మాణ రీతులను వివేచించే శాస్త్రాన్ని ఎథ్నో మ్యూజికాలజీ అని వ్యవహరిస్తున్నారు. జానపద శాస్త్రంలో అంతర్భాగమైన ఈ శాస్త్రం స్వయంగా చాలా విస్తృతి పొందింది.

మౌఖిక మాధ్యమానికి లిఖిత మాధ్యమానికి మధ్యన ఉన్న సంబంధం గురించి చాలా విస్తృతమైన సిద్ధాంత చర్చలు జరిగాయి ఇంకా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఓరాలిటీ గురించి అచ్చమైన ఓరల్ కల్చర్ అంటే లిపి ఏమాత్రం తెలియని ఆధునిక విజ్ఞానగంధం సోకని మౌఖిక సమాజాలలోని సాహిత్య సృజన ప్రక్రమం గురించి దానికున్న ఇతర లక్షణాల గురించి విస్తృత పరిశోధనలు జరిగాయి. ఈ తరహా పరిశోధనలు తెలుగులో ఇంకా ప్రారంభం కావలసే ఉంది. గిరిజనులపైన వారి వివిధ సమస్యలపై మన వద్ద చాలా పరిశోధనలు జరిగాయి. (తంగిరాల వారి కృషి) గిరిజనుల భాషలపై కూడా పరిశోధనలు జరిగాయి. గాని గిరిజన సాహిత్యాల మీద మన వద్ద పరిశోధనలు మృగ్యమే.

జానపద గీతాల ప్రకార్యాత్మక ప్రక్రియా భేదాలు:

ఒక పాటను జానపద గీతం అని ఎప్పుడు పిలుస్తాము. ఎప్పుడు అది జానపద గీతం అవుతుంది ఎప్పుడు కాకుండా పోతుంది అన్నవి చాలా ముఖ్యమైన కావలసిన ప్రశ్నలు. మామూలుగా అన్నింటిని పరిపాటిగా ఫోక్‌సాంగ్ అనో లేదా జానపద గీతం అనో అంటూ ఉంటాం. కానీ జానపద శాస్త్రం అలా వ్యవహరించడానికి అంగీకరించదు. ఒక సామాజిక బృందంలోని ఒక సభ్యుడు తన కోసం కాని లేదా తన గుంపు అందరికోసం గాని ఒక సామాజిక సందర్భంలో ఒక ప్రకార్యంలో పాడిన సజీవమైన పాటనే జానపద గీతం అని వ్యవహరించాలి. సజీవ సందర్భంలో ఉనికిని అందిస్తున్న వాక్కళనే ఆ సందర్భంలోని సృష్టిని మాత్రమే జానపద గీతం లేదా ఫోక్ సాంగ్ అని వ్యవహరించాలి. అలాంటి సజీవ సందర్భంలో పాడిన పాటను రికార్డు చేస్తే లేదా అలా పాడిన పాటను లిపిబద్ధం చేసి ప్రచురిస్తే అది జానపద గీతం కాదు. ఒక మనిషి ఫోటో మనిషి కానట్లే జానపద గీతం రికార్డింగు దాని ప్రచురిత ప్రతి జాపదం గీతం కాక దానికి ఒక ప్రతిరూపంగా ఉంటాయి. అంటే వెనుకటి నుండి వస్తూ ఇంకా ముందుకు ముందుకు పోవడానికి వీలున్న ఒక పాటను ఒక సందర్భంలో ఒక వ్యక్తిని కాని వ్యక్తులు కాని పాడిన పాటను రికార్డు చేయడం అంటే నదిలో ప్రవహిస్తున్న నీటిని ఒక బిందెడి పక్కకు తీసి పెట్టుకోవడం లాంటిదన్నమాట. అసలు జానపదగీతం అనేది దాని సజీవ స్థితిలో మాత్రమే ఉంటుంది. రికార్డులు ప్రచురిత ప్రతులు దాని ప్రతిరూపాలు మాత్రమే. పరిపాటిగా వీటిని జానపద గీతాలు అని అన్నా అవి అసలు పాటకున్న ఒకానొక స్థిరీకృత రూపమే అన్నమాట. ఒక వ్యక్తి పది సంవత్సరాల క్రితం దిగిన ఫోటో అది. ఆ వ్యక్తి అన్ని కాలాలలో ఉన్న రూపం కానట్టే ఒక జానపద కథ కాని ఒక జానపద గేయం కాని ఒక చోట రికార్డు అయితే అది ఒక సందర్భానికి ఉన్న స్థిరీకృత రూపమే కాని పూర్తి సంస్థితి కాదు. స్థిరీకృత రూపాలు జానపద గీతాలు కావు. అవి వాటి నకలు ప్రతులు మాత్రమే. కాగా జానపదగేయం అంటే సజీవ స్థితిలో ఉన్నదే. అలా ఈ జానపద గీతాలు వివిధ సందర్భాలలో వివిధ ప్రక్రియలకింద విభాజితం అవుతాయి. అవన్నీ సహజ జానపద గీతాలు కాని ఇతర ప్రక్రియలే అవుతాయి. కాని అలవాటుగా మనం వీటన్నింటినీ జానపదగేయాలు అనే అంటాం. అలా వ్యవహరించే కొన్ని సందర్భాలను ఆ ప్రక్రియలను ఇక్కడ చూద్దాం.

జానపదగేయానికి ఒక ప్రత్యేకించిన రచయిత ఉండడు అన్నది దాని మౌలిక లక్షణం. కాని సామూహిక కర్తృత్వం అనే సిద్ధాంతం పరాస్తమయింది. ఒక వ్యక్తి సృజనగానే అది బహిర్గతం అవుతుంది. కాని అది ఎంతో కాలంగా ఎంతో మంది

సృజించిన నేపథ్యంలో ఈ వ్యక్తి విని అందిపుచ్చుకున్న నేపథ్యంలో ఆ వ్యక్తినుండి బహిర్గతం అయిన పాట. అంటే పాడిన వ్యక్తి సృజన శక్తితో పాటు తనకు ముందు పరంపరగా ఉన్న వ్యక్తుల ప్రతిభ కూడా దానిలో ఉంటుంది. అందువల్ల అది సామూహిక పునః కర్తృత్వం అవుతుంది. కాని సామూహిక కర్తృత్వం కాదు. దీన్నే కమ్యూనల్ రి-క్రియేషన్ అని ఆ రోజున శాస్త్రం చెబుతూ ఉంది. అందువల్ల నేను ఒక జానపద గీతాన్ని రాశానని ఎవరైనా చెబితే పట్టుకొచ్చి చూపిస్తే అతనికి జానపద గీతం మౌలిక లక్షణం స్వరూపం తెలియవని అర్థం.

ఇలా ఒక సందర్భంలో సృజించబడుతూ వచ్చిన ఒక జానపదగీతాన్ని పాటను ఒక వ్యక్తి ప్రయత్న పూర్వకంగా గ్రహించి దాని భాషను దాని సంగీతాన్ని ఇతర మౌలిక స్వరూపాలను అన్నింటినీ తన అవసరానికి అనుకూలంగా మార్చుకొని ఒక పాటను సృష్టించి పాడితే అది జానపద గీతం కాదు. దాని భాష దాని సంగీతం జానపదమే అయినా అలా కనిపించినా అది జానపద గీతం కాదు. ఇక్కడ జరిగింది అనువర్తన ప్రక్రియ application process. అంటే ఒక జానపద గీతాన్ని ఒక వ్యక్తి గ్రహించి తన అవసరానికి అనుగుణంగా మలచుకున్నాడు అప్లై చేసుకున్నాడు అంటే అనువర్తింపజేసుకున్నాడు. ఇలాంటి పాటల్నే అప్లైడ్ ఫోక్‌సాంగ్ అని అంటారు. తెలుగులో వీటిని అనువర్తిత జానపదగేయాలు అని వ్యవహరిస్తున్నారు. ఇలా అనువర్తిత జానపద సాహిత్యం ఇతర ప్రక్రియలద్వారా కూడా చేరుతుంది. ఇతర జానపద ప్రదర్శన కళలలోను పుడుతుంది. దీన్ని అప్లైడ్ ఫోక్ లోర్ అని అనువర్తిత జానపద విజ్ఞానం లేక అనువర్తిత జానపద కళలు అని ఈ శాస్త్రం వ్యవహరిస్తుంది.

ఈ ఆధునిక కాలంలో జానపద గీతాలను అనువర్తింప జేసుకునే ప్రక్రమం చాలా కాలం క్రితమే ప్రారంభం అయింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో రాజకీయ పార్టీలు వ్యక్తులు జానపదుల పాటలను చాలా వాటిని గ్రహించి తమ రాజకీయ సిద్ధాంత అవసరాలకు అనుగుణంగా పాటలు రాసుకొని పాడుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల వారు, తెలంగాణా రజాకార్ల వ్యతిరేక పోరాటంలోనూ తెలంగాణా విమోచన పోరాటంలోను జానపద గీతాలను విరివిగా వినియోగించుకున్నారు. జానపద గేయం వారి ప్రచారానికి ప్రధాన వాహికగా మారింది. ఆ తర్వాత వచ్చిన సామాజిక ఉద్యమాలు కూడా జానపద గేయాన్ని ఆయుధంగా మలచుకున్నాయి. ఆంధ్ర మహాసభ ప్రజా నాట్యమండలి, జన నాట్యమండలి, ఇలాంటి సంస్థలు అన్నీ జానపద గేయాలపైన ఇతర ప్రదర్శన కళలపైనా బాగా ఆధారపడ్డాయి. తెలంగాణాలోని శారద కథ నాజర్ ద్వారా పరివర్ధితమై బుర్రకథగా మారింది. ఇది పూర్తిస్థాయి అనువర్తిత జానపద కళ. తప్పెట గుళ్ళు, కనుక తప్పెట,

జముకుల కథ, ఒకస్థాయిలో ఒగ్గు కథ, తుపాకి రాముడి విన్యాసం ఈ జానపద కళలు అన్నీ అనువర్తితమై రాజకీయ అవసరాలను తీర్చాయి. ఇవన్నీ జానపద కళలు కాక అనువర్తిత జానపద కళలు అవుతాయి. వీటిలో నుండి పుట్టిన సాహిత్యం అంతా జానపద సాహిత్యం కాదు అనువర్తిత జానపద సాహిత్యమే అవుతుంది. ఇంక సంస్థలు కాక కొందరు విడి వ్యక్తులు ఒక ఉద్యమ స్థాయిలో జానపద గీతాన్ని ప్రదర్శనలను పూర్తి స్థాయి పూర్తి కాలిక ఆయుధంగా వాడుకున్నారు. గద్దర్, వంగపండు ప్రసాదరావు, ఈ కోవలోని ఇతర స్త్రీ పురుష గాయకులు సృష్టించిన పాటల సాహిత్యం అంతా మామూలు వ్యవహారాంలో జానపద సాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. కాని ఇదంతా అనువర్తిత జానపద గేయాలు అని శాస్త్రం వర్గీకరిస్తుంది. పాల్కురికి, అన్నమయ్య సాహిత్యాలలో ఈ అనువర్తన క్రమం బాగా కనిపిస్తుంది. అన్నమయ్య పాటలు ఎక్కువలో ఎక్కువ అనువర్తిత జానపద గీతాలే.

ఉద్యమం కోసం కాక వ్యాపార ప్రయోజనాలకు కొందరు జానపద సాహిత్యాన్ని అనువర్తితం చేసుకున్నారు. ఇది అనువర్తిత జానపద సాహిత్యమే అయినా దీని సాంఘిక ప్రకార్యం వేరు. అందువల్ల ఇది అనువర్తిత జానపద వ్యాపార సాహిత్యం అవుతుంది. ప్రభుత్వ కార్య క్రమాల సామాజిక ప్రయోజనాలను సంక్షేమ కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వారు వారు నియమించిన సేవా సంఘాల వారు సృష్టించే జానపద సాహిత్యం అంతా కూడా మరొక రకమైన అనువర్తిత జానపద సాహిత్యం అవుతుంది. అక్షరాస్యత ఉద్యమం, ఆరోగ్య కార్యక్రమాల ప్రచారం, కుటుంబ సంక్షేమ ప్రచారం కోసం ఇంకా ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు వినియోగించిన జానపద గీతాలు మరొక వర్గపు అనువర్తిత జానపద గీతాలు అవుతాయి.

జానపద గీతాలను, జానపద ప్రదర్శన కళలు సినిమాలలో వినియోగించుకోవడం 1937 నుండే తెలుగులో ప్రారంభం అయింది. వీటిని లబ్ధప్రతిష్ఠులైన వ్యక్తులు కూర్చొని రాసినా అవన్నీ అనువర్తిత జానపదగీతాలే. వాటిని ఫోక్ సాంగ్ అని సినిమాలో చూపే చాలామంది పిలిచే పోక్ డాన్స్‌ను ఫోక్‌డాన్స్ అని అనకూడదు. అవి అప్లైడ్ డాన్స్ కూడా కావు. అదొకరకం సృష్టి. సినిమాలో కనిపించే జానపదులు జానపద నృత్యాలు కూడా పూర్తిగా వారి అద్భుత విచిత్ర సృష్టే కాని మరేం కాదు.

ఈ అనువర్తన క్రమం అన్నది మరొక విధంగా ఉంటే అది మరొక రకమైన జానపద గీత ప్రక్రియ అవుతుంది. ఒక ప్రాంతంలో ఒక సామాజిక వర్గానికి వినియోగించే సంప్రదాయం ఉన్న ఒక జానపద కళను మరొక సందర్భంలో మరొక సామాజిక వర్గానికి మరొక ప్రాంతంలో వినియోగిస్తే అది మరొక ప్రక్రియ అవుతుంది. ఉదాహరణకు ఒగ్గుకథ

అనేది తెలంగాణాలో కురుమ గొల్లకులం వారి ఆశ్రిత -పదర్శన కారులైన ఒగ్గువారిచే ప్రదర్శింపబడి కురుమ గొల్ల వారి కోసమే ప్రదర్శింపబడుతుంది. అదీ ఆయా మిరాసులున్న గ్రామాలలోనే ప్రదర్శింప బడుతుంది. ఇలాంటి ఒగ్గు కథను ఒక నగరానికి తీసుకువచ్చి నగర ప్రేక్షకుల కోసం ఏ శిల్పారామంలోనే ప్రదర్శిస్తే అది దాని జానపద ప్రక్రియా లక్షణాన్ని కోల్పోతుంది. సహజమైన జానపద కళాకారులే ప్రదర్శించినా అసలు జానపద కథా గేయాన్నే పాడినా ఇక్కడి సందర్భం, ప్రాంతం, ప్రేక్షకులు వేరే వేరు ఇలాంటి జానపద ప్రదర్శనలను సాహిత్యాలను పబ్లిక్ ఫోక్లోర్ అని జానపద శాస్త్రం వ్యవహరిస్తుంది. 7 నుండి 9 రాత్రులు చెప్పే మల్లన్న కథను ఒగ్గు కథకులు ఇలాంటి సందర్భంలో అరగంటలోనో లేదా గంటలోనో చెబుతారు. ఇక్కడ క్వాలిటేటివ్ ఛేంజ్ అంటే గుణాత్మక పరిణామం జరిగి అసలు ప్రక్రియే మారుతుంది. అందుకే ఇది పబ్లిక్ ఫోక్లోర్ అవుతుంది. దీన్నే తెలుగులో నేను సార్వత్రిక జానపదం అని సార్వత్రిక జానపద సాహిత్యం అని వ్యవహరించాను.

ఇక అనువర్తన క్రమంలో మరొక కోణం ఉంది. అది ఒక మాధ్యంలో మరొక మాధ్యమం ఉండడం. ఒక ఇంగ్లీషులో ఉన్న మంచి సేయింగ్ ఏమంటే మీడియమ్ ఈజ్ ది మెసేజ్ అని అంటారు. అంటే మాధ్యమానికి ఉన్న శక్తిని గురించి దాని మౌలిక స్వరూపం గురించి ఇది చెబుతుంది. రేడియో, టి.వి. అనేవి ఆధునిక మాధ్యమ వ్యవస్థలు. జానపద కళలు సాహిత్య ప్రక్రియలు ఆధునిక మాధ్యమానికి చాలా సంవత్సరాల క్రితం నుండే ఎక్కడం ప్రారంభం అయింది. దరిమిలా టి.వి.లోనికి కూడా జానపద కళలు ప్రవేశించాయి. అంటే జానపద సాహిత్యం కూడా ప్రవేశించాయి. శారద కథ అనేది ఒక జానపద కళ, ఆలాగే పిచ్చుకుంటి కథ ఒగ్గు కథ అలాంటివే. ఈ కథా ప్రక్రియలు వాటికవే ఒక సమాచార మాధ్యమాలు. వీటి ద్వారా సాహిత్యం సామాజిక సందేశమూ ప్రజలకు అందుతాయి. కాని ప్రక్రియకున్న స్వభావాన్ని బట్టి అవి ఆ ప్రాంతానికి దాని ప్రేక్షకులకు పరిమితం అవుతాయి. కానీ ఇదే శారద కథను లేదా ఒగ్గు కథను రేడియోలో చెప్పిస్తే లేదా టి.వి.లో ప్రసారం చేస్తే ఈ కళలకున్న భౌగోళిక సరిహద్దులను సామాజిక సరిహద్దులను దాటి పబ్లిక్ మొత్తానికి అందించబడుతుంది. అలాగే చేతనతో కూడుకున్న కళారూపం స్థిరీకృతమైన స్థిరీకృత జానపద గేయం ప్రజలకు అందుతుంది. ఇందులో ప్రజలు అంటే ప్రేక్షకుల భాగస్వామ్యం లుప్తం అవుతుంది. ఫ్రేమ్ కట్టిన బొమ్మ అవుతుంది జానపద కళ. ఇక్కడ జరిగిన విశేషమేమంటే ఒక ప్రసార మాధ్యమం ఇంకొక ప్రసార మాధ్యమం మీద కూర్చుని మరొక ఉభయ ప్రసార మాధ్యమం అవుతుందన్న మాట. ఇదే రేడియోలో వచ్చే కథనే సంప్రదాయ కథ కాకుండా దానిలో కూడా ఆధునిక వస్తువు

పెడితే ఇది మరొక కోణంలోని అనువర్తన ప్రక్రియ అవుతుంది. ఈ తరహా అనువర్తనాన్ని పాలిజానరిక్ అప్లైడ్ ఫోక్ అని అనాలి అంటే బహుమాధ్యమ జానప అనువర్తిత సాహిత్యం అన్నమాట. ఇక్కడ కూడా ప్రక్రియా భేదం జరిగింది. ఒక సంప్రదాయ ప్రక్రియ ఒక ఆధునిక జానపద ప్రక్రియగా మారింది గుణాత్మక పరిమాణం జరిగింది.

ఇవన్నీ కాక సంప్రదాయ జానపద కళాకారులే తమ కళను వ్యాపారీకరించుకోవడానికి ఏసుకున్న ప్రయత్నంలో సృష్టించుకున్న కాసెట్లు, సి.డి.లు మరొక తరహా అనువర్తిత జానపదగీతాలు అనువర్తిత జానపద సాహిత్యం అవుతాయి.

ఇలా జానపద శాస్త్రంలో అప్లైడ్ ఫోక్ లోర్ అనేది చాలా విస్తృతిని సంపాదించుకున్న ఆధునిక శాస్త్ర విభాగం. మనకు కనిపించేవి వినిపించేవి అన్నీ జానపదకళలు కావు. అవి జానపద సాహిత్య ప్రక్రియలు కావు. అవి వివిధ తరహాల ప్రక్రియల కిందికి చేరతాయి.

ఎడిటర్‌గా నార్లవారు

-టి. ఉదయవర్లు

"ఒక సూర్యుడు సమస్త జీవులకు తానొక్కక్కడైతోచు...." అన్నట్లుగా చైతన్య పూర్వకమైన భావజాలంగల నార్ల వెంకటేశ్వరరావుగారు కొందరికి మార్గదర్శకుడైన ఎడిటర్, ఆదర్శనీయుడైన రచయిత, మరికొందరికి సృజనాత్మకమైన కవి, అపార విజ్ఞానంగల విమర్శకుడు, ఇంకా కొందరికి వాస్తవ దృష్టిగల చరిత్రకారుడు, పరిశీలనాశీలంగల నాటకకర్త, వేరేకొందరికి దేశభక్తి పొటమరించిన స్వాతంత్ర్యసమర యోధుడు, సామాజికాభ్యుదయం కాంక్షించే సంస్కర్త, మీదుమిక్కిలి-హేతువాది, మానవతావాదైన దార్శనికుడు.

ఇంత బహుముఖ ప్రజ్ఞావంతుడైన నార్లగారిని ఆంధ్రసాహిత్యలోకంలో తనకుతానేసాటైన, అసమానశేముషిగల ఎడిటర్‌గానే గుర్తిస్తారు.

పత్రిక మాస్టర్ హెడ్‌క్రిందనే పాఠకుల దృష్టిని ఇట్టే ఆకర్షించే ప్రమాణంలో-"ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు" అని ఉంటే చాలు, ఆ పత్రికను కొనుగోలు చేసి, తాజాగా ఆయన వ్రాసిన సంపాదకీయాన్ని ఆబగా చదవడానికి ఒకతరం అలవాటు పడిపోయింది.

నేను ఇక్కడ కావాలనే "ఎడిటర్"అని ప్రస్తావించాను. ఎందుకంటే-"ఎడిటర్" అనే పదానికి సమానార్థకం-సంపాదకుడు కాదని నార్లగారు అనేవారు. అందుకే ఆయన ఆ పదం వాడడానికి ఇష్టపడేవారు కాదు, తనను ఎడిటర్‌గానే పేర్కొనేవారు.

ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే-మరీ ఇటీవల కాలంలో "సంపాదకుడు" అనే మాటకు అర్థం మరీ మారిపోయింది అనడం కన్నా అక్షరాలా ఆ పదం అర్థవంతమై పోయింది అనాలేమో!

ఎవరో అన్నట్టు జర్నలిస్టు–"జాక్ ఆఫ్ ఆల్ ట్రేడ్ అండ్ మాస్టర్ ఆఫ్‌సన్" కాదనీ, "జాక్ ఆఫ్ ఆల్ ఆ మాస్టర్ ఆఫ్ మెనీ" అని రుజువు చేశారు. ఇందుకు సాక్ష్యం ఆయన ఎడిటోరియల్స్. అవి ఒక్కొక్కటి ఒక్కొక్క చైతన్య కిరణం.

నార్లగారు స్వతహాగా రచయిత, కవి కాబట్టి ఆయన శైలి తేనియలా ఆకర్షణీయంగా ఉండేది. అచ్చమైన తెలుగు నుడికారంతో దేశభక్తితో కదను త్రొక్కే జవనాశ్వంలా సాగిపోయేది. చరిత్రకారుడు, నాటకకర్త, కళాహృదయుడు కూడా కావడం వల్ల వాస్తవికత, జీవనతత్వం, సౌందర్యం వాటిలో తొణికిసలాడేది. పరిశోధకుడు, విమర్శకుడు కావడం వల్ల మంచి చెడ్డల బేరిజు, విచక్షణకు ప్రాధాన్యత ఇచ్చేవారు. హేతువాది, మానవతావాది దార్శనికుడు కావడం వల్ల–నిర్దేశికత్వం, దేశికత్వం లక్ష్యంగా సాగేది. అందుకే నార్లగారు మన కాలంలో, మనం చూసిన ఒక గొప్ప ఎడిటర్. ఇవ్వాళ్ల ఈ బహుముఖ ప్రజ్ఞ ఏ ఎడిటర్‌లోను లేనందున, ఒకవేళ ఉన్నా, ఆయా పత్రికా యజమానుల కనుసన్నలలో నడుచుకోవలసిన దురదృష్టకర పరిస్థితులవల్ల నార్లగారి తర్వాత ఎడిటర్లు ఎవ్వరూ నార్లగారి లాంటి ఎడిటర్లు కాలేకపోతున్నారు. నార్లగారిలాగా దిశానిర్దేశం చేయలేరు. నార్లగారి లాగా ప్రజాభిప్రాయాన్ని మలచలేరు.

నార్లగారిని నేను తొలుత ఫోటోలో హిట్లర్ మీసంతో చూశాను. కాని నన్ను వారు ఎంపిక చేసి 1968–1969లో "ఆంధ్రజ్యోతి"లో చేర్చుకునే నాటికి ఒత్తుగా పెరిగిన తెల్లనిమీసం, అంతకన్నా నిగనిగ మెరిసే గుబురుగడ్డం వారికుండేది. తలకు మూడు ప్రక్కల క్రిందికి పల్చగా నల్లని తలకట్టు ఉన్నా మొత్తంమీద బట్టతల ఉండేది. నల్లని ఫ్రేమ్‌తో దళసరి సులోచనాలు పెట్టుకునే వారు. ఆ వయస్సులో అంటే తన అరవయ్యోపడిలో కూడా లావుకాకుండా బక్కపలచగానే ఉండేవారు. ఖద్దరు ధోవతి, లాల్చీ వేసుకునేవారు. మరీ చలిగా ఉంటే పైన ఉన్న ఉన్ని వాస్కోట్ వేసుకునేవారు, లేదా శాలువాకప్పుకొని, హైదరాబాద్ బంజారాహిల్స్‌లోగల స్వగృహం "లుంబిని" ఆవరణలో, అలంకరించిన శిల్పాల చెంత, ఎండపొడకు కుర్చీవేసుకుని, ఏదో గ్రంథం చదువుతూ కూర్చునేవారు. సి.నారాయణరెడ్డిగారి మాటల్లో–అప్పట్లో నార్లగారు అచ్చం "నాస్తికబాబా" లా ఉండేవారు.

అయితే రాజ్యసభ సభ్యుడుగా పార్లమెంటుకు వెళ్ళే రోజులలో నిండుగా, షేర్వాణి వేసుకోవడమే కాకుండా సిగరెట్‌మీద సిగరెట్‌కాల్చే అలవాటు ఉండేది.

ఈ అలవాటు అలనాడు "ఆంధ్రప్రభ" ఎడిటర్‌గా పనిచేసిన నాటి నుంచి అనడం కన్నా, విద్యార్థి దశలో రచయితగా రూపొందించిన నాటి నుంచి ఉండేది. సిగరెట్స్

ఇలా సరస్వతి పూజామందిరంలా అనుభూతి కలిగించే ఇంట్లో, ఎడిటర్‌గదిలో కూర్చుని నార్లగారు వ్రాసే సంపాదకీయాల దస్తూరి చూస్తే నిజంగానే "బ్రహ్మరాత"లా ఉండేది. ఒక్కొక్కసారి నార్లగారికే అయోమయం కలిగించే ఆయన దస్తూరి–అదేమి చిత్రమోగాని నాకుబాగా పట్టుబడింది. అందుచేత ఆయన వ్రాసిన ఎడిటోరియల్స్ ప్రతిరోజు విజయవాడకు పంపించే బాధ్యత నార్లగారు నాకు అప్పగించారు. అప్పట్లో కేవలం విజయవాడలోనే ఎడిషన్ ప్రచురించేవారు. అప్పట్లో ఇ–మెయిల్, మోడెంలాంటి అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలు లేవు. కాబట్టి టెలిప్రింటర్‌పై రోమన్‌లిపిలో తెలుగులో వ్రాసిన ఎడిటోరియల్ పంపడం మినహా మరేమి అవకాశాలు లేవు.

నార్లగారి దస్తూరి నాకు కొట్టిన పిండికావడం వల్ల ఆయన ఇతర రచయితల గ్రంథాలకు వ్రాసిన పీఠికలు, ప్రత్యేక సంచికలకు వ్రాసిన వ్యాసాలు, సభలలో మాట్లాడానికి వ్రాసుకున్న ఉపన్యాసాల అసలు ప్రతి నాకు పంపించి శుద్ధప్రతి వ్రాయించేవారు.

అంతేకాదు–నార్లగారు హైదరాబాద్‌కు మకాం మార్చాక 1946 నుంచి 1974 మధ్యకాలంలో "ఆంధ్రప్రభ", "ఆంధ్రజ్యోతి" దినపత్రికలలో వ్రాసిన సంపాదకీయాల్లోంచి ఎంపికచేసి ప్రచురించిన "మూడు దశాబ్దాలు" శుద్ధప్రతి నేనే తయారు చేశాను. ఈ గ్రంథం చివరన "కృతజ్ఞత"లో నార్లగారు నాపేరు కూడా ప్రస్తావించారు.

అంతకుముందు వారు 'మాటా–మంతీ', 'పిచ్చాపాటి' శీర్షికల క్రింద వ్రాసిన వ్యాసాలకు కొత్తవి చేర్చి ప్రచురించిన "కొత్త–పాతా" గ్రంథం, లోగడ లఘు రచనగా ప్రచురించిన "కథలు–గాథలు, ప్రసంగాలు–ప్రభోధాలు, చెణుకులు–చురకలు, అభిప్రాయాలు–అనుభవాలు, పరిచయాలు–పరిశీలనలోను పెంచి రూపొందించిన 'కదంబం' బృహద్‌గ్రంథం సాపు ప్రతిని నేనే తయారు చేశాను.

రాముడికంటే సీతపాత్ర ఉదాత్తమైందని చెప్పే 54 పేజీల నాటిక "సీతజోస్యం"తో పాటు, దీనికి ఆయన వ్రాసిన 143 పేజీల సుదీర్ఘపీఠికకు, దశరథుని పురోహిత వర్గానికి చెందిన "జాబాలి" నోట సీతారాముల అసలు సిసలు స్వరూపం రూపుకట్టించిన 30 పేజీల ఏకాంకికకు ఆయన వ్రాసిన 67 పేజీల పీఠికను సైతం నేనే సాపు ప్రతులు వ్రాశాను. షట్చక్రవర్తులలో మొట్టమొదటి వాడైన హరిశ్చంద్రుడు నాయకుడుగా వ్రాసిన 55 పేజీల "నరకంలో హరిశ్చంద్రుడు" నాటకం, దీనికి ఆయన వ్రాసిన 53 పేజీల పీఠికను, వేమన ఆటవెలదులను పోలిన "నవయుగాలబాట" పద్యకృతి ఒరిజినల్స్ చూసి శుద్ధ ప్రతి తయారుచేసేపని నార్లగారు నాపై పెట్టారు.

ఇది చూసి ప్రముఖ జర్నలిస్టు పరాంకుశం దామోదరస్వామి "మావాడు Epic-graphist" అని నన్ను పలువురికి పరిచయం చేసేవారు.

కాల్చుకుంటే ఆలోచనే రాదనీ, సంపాదకీయ రచనే సాగదని సుదీర్ఘకాలం నుంచి తనలో గూడుకట్టుకు పోయిన అభిప్రాయాన్ని డాక్టర్లు, ముఖ్యంగా డాక్టర్లయిన తను కన్న పిల్లల సలహామేరకు మార్చుకుని "లుంబిని"లోని ఆ మూలసౌథంలోని ఎడిటర్‌గదిలో కూర్చుని ఆనాటి ప్రధానాంశంపై ప్రవాహవేగంగా సంపాదకీయం వ్రాసేవారు. ఆలోచనాధార ఎంత వేగంగా కదులుతుందో నార్లగారి కలం అంతవేగంగా నడిచేది. అందుచేత చేవ్రాలు కుదురుగా, అందరూ చదవడానికి కాదుకదా, ఒక్కొసారి ఆయనే అది చదవలేకపోయేవారు.

నార్ల సంపాదకీయం ఏడెనిమిది వందల మాటల నిడివిలో సాగేది. ఎనిమిదంగుళాల పొడవు, ఐదున్నరంగుళాల వెడల్పుగల న్యూస్‌పాడ్‌పై వ్రాసేవారు. ఎక్కువగా నీలంరంగు బాల్‌పాయింట్‌పెన్‌తో వ్రాసేవారు. ఒక్కొక్కసారి ఎర్రసిరా లేదా ఆకుపచ్చరంగు ఫౌన్‌టెన్‌పెన్ వాడేవారు. సంపాదకీయం వ్రాసే దాదాపు ముప్పావుగంట సేపు ఏకాగ్రత అవసరమయ్యేది. అందుకోసం ఏకాంతం కోరేవారు. ఈ సమయంలోనూ పావుగంట కృత్యాద్యవస్థలో గడచిపోయేది. ముఖ్యంగా సరైన సరళమైన, సుందరమైన సూటైన 'లీడర్' ఎత్తుగడ కోసం ఆయన ఎన్నో కాగితాలు వ్రాస్తూ, టేబుల్ ప్రక్కనే పెట్టుకున్న బుట్ట నింపేవారు.

ఎదురుగా టేబుల్‌పై వ్రాస్తున్న అంశానికి సంబంధించిన పలు పుస్తకాలు తెరచిపెట్టి ఉండేవి. అనుమానం వస్తే చూసేందుకు వీలుగా ఒక ప్రక్క–వరుసగా అనేక నిఘంటువులు, విజ్ఞాన–సర్వస్వాలు, సామెతలు, పలుకుబళ్ళకు సంబంధించిన పుస్తకాలు, మరో ప్రక్కన–దేశనాయకులైన మహాత్మాగాంధీ, పండిత జవహర్‌లాల్‌నెహ్రూ, బాలగంగాధర్ తిలక్, లాలాలజపతిరాయ్, అంబేడ్కర్, రామమనోనహర్ లోహియా మొదలగువారి రచనలు, వేరొక ప్రక్కన–రవీంద్రనాథ్‌టాగూర్, అరవిందు, వినోభాభావే, స్వామి వివేకానంద, ఎం.ఎన్.రాయ్‌ల రచనలు బారులు తీర్చి ఉండేవి.

అంతేకాదు ప్రపంచనాయకుల, శాస్త్రవేత్తల ప్రతిమలు ఆయన గదిలో ముచ్చటగా అలంకరించి ఉండేవి. వాటిలో సోక్రటీస్ మొదలు మార్క్స్ వరకు, నెపోలియన్ మొదలు లింకన్ వరకు, బుద్ధుడి నుంచి ఐన్‌స్టిన్ దాకా నమూనా ప్రతిమలు చూపరులకు ఉత్తేజాన్ని కలిగించేవి. అక్కడే రవీంద్రనాథ్‌టాగోర్ దస్తూరితో ఒక పత్రం అద్దం ఫ్రేమ్‌లో బిగించి అలంకరించి ఉండేది. ఆ ప్రక్కనే శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు నార్లను ప్రశంసిస్తూ వ్రాసిన లేఖను ఒక సర్టిఫికేట్‌గా భావించి ఫ్రేమ్ కట్టించి పెట్టుకున్నారు. ఇంకా మేడమీద, నాలుగు, క్రింద మూడు గదుల నిండా ప్రపంచ సాహిత్యం, శిల్పాలు, చిత్రాలు బోలెడు అలంకరించి ఉండేవి. నిజానికి కేవలం నార్లగారి గ్రంథాలయం, ఆయన గ్రంథ సేకరణాభిరుచిపైనే ప్రత్యేక వ్యాసం వ్రాయవచ్చు.

స్వయంగా దీన్ని తిరిగి వ్రాసి, కంపోజ్ చేయించి ప్రూఫ్ చూసేవారు. ఒక్క తప్పు కూడా కనీసం సంపాదకీయంలో రాకూడదనేది రూలు.

ఒకరోజు టేక్‌లలో పొరపాటున క్రమసంఖ్య పాటించక ముందుపేరా తర్వాత, వెనక పేరా ముందు అచ్చయ్యాయి. అది గమనించి నార్లగారు 'మెసేజ్' ఇవ్వడమే ఆలస్యం పొరపాటున జరిగిందని 'ఎన్నార్' రాజీనామా లేఖ పంపారు. దీన్ని నార్లగారు బుట్ట దాఖలు చేశారు. అయితే వృత్తి ప్రమాణాలు ఆనాడు అలా ఉండేవి. ఇవ్వాళ్ళ ఏముంది? తెలుగు పత్రికల నిండా తప్పులే. తప్పులను గ్రహించేంత వివేకం, విజ్ఞానం కూడా చాలామందికి లేవు.

కొన్నిసార్లు ఇతర రచనల ఒత్తిడివల్ల, పనులవల్ల లేదా ఏదైనా ఊరెళ్ళితే నార్లగారు ఎడిటోరియల్ వ్రాసేవారు కాదు. ఫలానా అంశంపై వ్రాయవలసిందిగా "ఎన్నార్"కు సూచించేవారు. ఒక్కొక్కసారి పాయింట్స్ ఫోన్‌లో నార్లగారు నాకు చెబితే 'నోట్' చేసుకుని నండూరి వారికి పంపేవాణ్ణి.

నండూరిగారు నార్లగారు పెట్టిన ఒరవడిలో, ఆయన విధానాన్ని, శైలిని అనుకరిస్తూ వ్రాసేవారు. పాఠకులకే కాదు "ఆంధ్రజ్యోతి'లో పనిచేసే వారికి ఏ ఎడిటోరియల్ నార్లగారు వ్రాశారో, ఏ ఎడిటోరియల్ 'ఎన్నార్' వ్రాసారో తెలిసేది కాదు. అందుకే ఒకసారి ప్రముఖ రచయిత ఎమ్వీయల్ నండూరి వారిని "ఎన్నార్ల" అన్నారు.

అంతేకాదు–ఒకసారి నార్లగారి స్నేహితుడు–జాస్తి వెంకటనర్సయ్యగారు "నార్ల" పేరున చిన్న గ్రంథం ప్రచురించి–అందులో 'నార్ల' ఉత్తమ సంపాదకీయానికి "స్వామివివేకానంద" పై వ్రాసిన సంపాదకీయాన్ని మచ్చుతునకగా అభివర్ణిస్తూ దాన్ని పునర్ముద్రించారు. ఒకరోజు ఆపుస్తకాన్ని తీసుకుని వచ్చి భక్తితో నార్లగారి చేతిలో పెట్టారు. దీన్ని పేజీలు తిరగేస్తూ "స్వామి వివేకానంద" తాను వ్రాసిందని ప్రస్తావించడం పట్ల చాలా చిరాకుపడ్డారు. "ఇది నేను వ్రాసింది కాదు. అదిగో! అతగాడు వ్రాసింది" అంటూ ఎదురుగా కూర్చుని ఉన్న నండూరిగారిని చూపించారు.

ఇలాగే గాంధీ శతజయంత్యుత్సవాల సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'లో ఆరు గొలుసు సంపాదకీయాలు ప్రచురిస్తే, అందులో తొలి సంపాదకీయం మాత్రమే నార్లగారు వ్రాశారు. వరసగా మిగతా ఐదు నండూరిగారు వ్రాశారు. వీటి విషయంలో, ఇంకా ఇలా ఎన్నో పర్యాయాలు నండూరిగారు వ్రాసిన సంపాదకీయాలు నార్లగారు వ్రాశారని భావించి చాలామంది నార్లగారికి లేఖలు వ్రాసేవారు. వీరేకాదు నవమేధావి నార్లగారిపై రచనలు చేసిన ఒకరిద్దరు రచయితలు కూడా ఏ సంపాదకీయం నార్లగారిదో, ఏది నండూరి

కొరకరాని కొయ్యలాంటి శాసనాలు చదవడానికి "బ్రాహ్మీలిపి" లాంటివి నేర్చుకుని–శాసన పరిశోధనలు చేసే వారిని "Epigraphist" అంటారు కదా! అలాగే పత్రికారచనను హడావుడిగా సాగించే సాహితీ సృజన అంటారు కాబట్టి నార్ల 'బ్రహ్మరాత'కు శుద్ధ ప్రతి తయారుచేయడంలో స్పెషలైజేషన్ చేశాడు కాబట్టి"మావాడు Epigrophist" అని ఆయన చమత్కరించేవారు.

ఒకసారి ప్రసిద్ద రచయిత, నార్లగారి తర్వాత 'ఆంధ్రజ్యోతి' వారపత్రిక ఎడిటరైన పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు అది (నార్లగారిది) బ్రహ్మలిపి కదా? నార్లగారేమో జర్నలిస్టు బ్రహ్మకదా? అందుచేత మనవాడికి "బ్రహ్మవిద్యావిశారద" అని బిరుదు ఇద్దాం అనేవారు.

మరోసారి పురాణంగారే–నార్లగారి ఎడిటోరియల్ (దస్తూరి) ఒక పేజీ తీసి ఫ్రేంకట్టిస్తే "అబ్‌స్ట్రాక్ట్ చిత్రాన్ని తెలుగులో ఎవరయ్యా "నైరూప్య" మన్నారు? అసలది "నార్లూప" లేదా "నార్లూప్య" అయి ఉంటుందేమోనని, దాని పరిశోధించాలని ముసిముసి నవ్వులు చిమ్ముతూ ధర్మసందేహాన్ని వెలిబుచ్చారు.

ఇది ఇలా ఉండగా నార్లగారి దస్తూరిని సునాయాసంగా చదవడమే కాకుండా ఆయన శైలికి ఆకర్షితులై, ఆయన లాగా వ్రాసే ప్రయత్నం కూడా కొన్నాళ్ళు చేశా.

దాదాపు ప్రతిరోజు నార్లగారిని కలిసి మాట్లాడే అవసరం, సన్నిహితంగా మసలే అవకాశం లభించినందున – 'నీ భాష బాగుందోయ్, కళల గురించి ఎక్కువగా వ్రాయి" అని నన్ను ఆయన ఎంతగానో ప్రోత్సహించారు. "ఆంధ్రజ్యోతి" వారపత్రికలో అప్పుడే "హైదరాబాద్ కబుర్లు" శీర్షిక ప్రారంభించి వారంవారం నాతో వ్రాయించారు.

వారంలో ఎక్కువ రోజులు నార్లగారింటికి వెళ్ళేవాడిని. అప్పుడే పి.యు.సి. పూర్తిచేసి, బి.ఏ. సాయంత్రం కళాశాలలో చేరిన రోజులు, బాగా కుర్రతనం. నార్లగారికి, వారి శ్రీమతి సులోచనగారికి నేనంటే అమితప్రేమ ఉండేది. ఉదయం నార్లగారింటికి వెళ్ళగానే–డైనింగ్ టేబుల్ దగ్గర ఆయన ప్రక్కనే కూర్చోబెట్టుకునేవారు. సులోచనగారు కొసరికొసరి ఇడ్లీలు, వడలు పెట్టి తినిపించేవారు. అప్పుడప్పుడు "ఆంధ్రజ్యోతి" మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎల్.ఎన్.ప్రసాద్‌గారు ఏదో మాట్లాడడానికి నార్లగారి దగ్గరికి వచ్చేవారు. నార్లగారు అలా కూర్చుని ఉంటే, ముందటే ఆయన నిలబడి వచ్చిన పని చెప్పి మాట్లాడి వెళ్ళేవారు. ఎప్పుడోగాని నార్లగారి ముందు కూర్చునేవారు కాదు. అప్పట్లో అలా ఉండేది ఎడిటర్ హోదా. యజమానివస్తే లేచి నిలబడాలనే జ్ఞానం కూడా నాకు అప్పట్లో లేని వయస్సు. ఎప్పుడైనా నిలబడే ప్రయత్నం చేస్తే "కూర్చో, నీ పని నీవు చేసుకో" అనేవారు నార్లగారు.

ఇక్కడి నుంచి–అటెన్షన్ "ఎన్నార్" (నండూరి రామమోహనరావు) అని ఎడిటోరియల్ రెండు–మూడు టేకలలో పంపితే, అక్కడ విజయవాడలో నండూరి వారే

పట్ల మక్కువ ఎక్కువ ఉండేది. కాని ఆయన ఇంగ్లీషు జర్నలిజంలోకి వెళ్ళలేకపోవడం, ఒక దశలో ఆర్థికపరిస్థితుల దృష్ట్యా ఉపాధ్యాయుడు కావాలనుకుని దురదృష్టం కొద్దీ కాకుండా పోవడం, తెలుగు జర్నలిజం చేసుకున్న అదృష్టమైంది.

నార్లగారు "నేను కమాల్‌పాషాను అయితే" శీర్షికన వ్రాసిన తొలి వ్యాసం ప్రచురణ తర్వాత రచనా వ్యాసంగంవైపే ఆయన మొగ్గిపోయారు. ఆ తర్వాత కాంగ్రెసు ఆంధ్రపత్రిక, భారతి, కృష్ణాపత్రికలలో వివిధ సమకాలీన సమస్యలపై వ్రాసిన తెలుగు వ్యాసాలు 'జన్మభూమి' లాంటి పత్రికల్లో ప్రచురితమైన ఇంగ్లీషువ్యాసాలు నార్లగారి ఆలోచనలకు పట్టిన దర్పణాలైనాయి.

తొలుత బందరు నుంచి ప్రచురితమైన 'ప్రభ', తర్వాత "జ్యోతి' ఒకటి రెండు సంచికలు ఎడిట్ చేసిన నార్లగారు 'కృష్ణాపత్రిక'లోను రెండు మాసాలపాటు తాత్కాలికంగా ఉపసంపాదకుడుగా చేరాడు. కొంతకాలం తీవ్రవాదుల "స్వతంత్రభారత్" అండర్‌గ్రౌండ్ పత్రికకు వ్రాశారు. 'స్వరాజ్య', 'జనవాణి', 'ప్రజామిత్ర'లకు పనిచేశారు.

1938 ఆగస్టు ఒకటిన "ఆంధ్రప్రభ"లో చేరడంతో నార్లగారి జీవితమే ఒక కొత్త మలుపు తిరిగింది. 1942లో అప్పటి వరకు న్యూస్ ఎడిటర్‌గా ఉన్న నార్లగారు ఎడిటర్ అయ్యారు. వాడుకభాషా ప్రయోగంలో, శైలిలో, వార్తలకు తగిన శీర్షికలు పెట్టడంలో, పేజీలను ఆకర్షణీయంగా మేకప్ చేయడంలో నార్లగారు తనదైన ముద్రవేశారు. పాఠకులను ప్రేరేపించే సంపాదకీయాలు వ్రాసి, వినూత్న ఒరవడిని తీర్చిదిద్దారు. నార్లగారి సంపాదకత్వంలో "ఆంధ్రప్రభ" సర్క్యులేషన్ 2,700 ప్రతులనుంచి 60 వేలకు పెరిగింది. 'ఆంధ్రప్రభ' విధానం విషయంలో యజమాని రామనాథ్‌గోయంకా పూర్తి అధికారం నార్లగారి చేతిలో పెట్టడం వల్ల ఆ పత్రికకు నార్లగారి హయాం స్వర్ణయుగమై భాసించింది.

ప్రజలనోళ్ళలోని భాషనే ప్రామాణీకరించి నార్లగారు ఆంధ్రరాజకీయ రంగాన్ని, ఆంధ్రజన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేశారు. "ఆంధ్రప్రభ" సచిత్రవారపత్రికను 1952 ఆగస్టులో ప్రారంభించారు. మొత్తంమీద నార్లగారు దాదాపు 16 సంవత్సరాలు ఆంధ్రప్రభలో పనిచేశారు.

నార్లగారు తన అభిప్రాయాలను శషభిషలు లేకుండా, సూటిగా పాఠకుడికి స్పష్టంగా అర్థమయ్యేరీతిలో వ్యక్తపరిచేవారు. ప్రకాశం పంతులు మొదలు నీలం సంజీవరెడ్డి, కాసుబ్రహ్మానందరెడ్డి, కేంద్రంలో ఇందిరాగాంధీ ప్రభృతుల నిర్ణయాల్లో ప్రజావ్యతిరేకమెంతో కొంత ఉన్నా నార్లగారి కలాన్ని తప్పించుకోలేకపోయింది.

గారిదో పోల్చుకోవడంలో పొరపాటున నండూరి గారి సంపాదకీయాలు నార్లగారివని ప్రస్తావించిన సందర్భాలు ఒకటారెండా ఎన్నో ఉన్నాయి.

అయినప్పటికీ నార్లగారు వ్రాసిన సంపాదకీయాలు ఆరేడువేలు, ప్రత్యేక వ్యాసాలు, గ్రంథ సమీక్షలు, ఇతర రచనలు అన్నీ కలుపుకుంటే హీనపక్షం ఇరవైవేల పేజీల దాకా విస్తరించవచ్చు. కాని వాటిలో దొరకని వాటిని వదిలేసి, సేకరించిన వాటిని బాగా వడబోసి, చరిత్ర రచనకు ఏవి ముడిపదార్థాలో అలాంటి వాటినే ప్రచురించాలని నార్లగారు భావించారు.

సంపాదకీయం "అప్పుడే వండి వార్చి వడ్డించిన అన్నం లాంటిదని నార్లగారు చెప్పేవారు. వంట చేతకాక, దీన్ని సరిగా ఇగరనివ్వకపోయినా, తోప చేసినా, మాడ్చినా అది గొంతు దిగదని నార్లగారు అనేవారు. నేర్పుగా వండితే, మెతుకు మెతుకు ఒక మంచి ముత్తెంలా మిలమిలా మెరుస్తుంది. ఆవిరులు కక్కుతూ నోరూరిస్తుంది" అని కూడా వారే చెప్పారు.

భారతీయ సంపాదకులలో ముట్నూరి కృష్ణారావు ఖాసా సుబ్బారావు, బ్రిటిష్ సంపాదకులలో–థామస్ బార్న్జ్, జె.ఎ.స్పెండర్, డబ్లియు.హెచ్.మ్యాసింగమ్, సి.పి.స్కాట్‌లను నార్లగారు ఆదర్శంగా తీసుకునేవారు. వారు పాటించిన జీవితపు విలువలను చివరిదాకా ఆచరించడానికే నార్లగారు కృషిచేశారు. ముఖ్యంగా లండన్ 'టైమ్స్' ఎడిటర్‌గా పనిచేసిన బార్న్జ్‌లాగా–పత్రికల కర్తవ్యం ప్రభుత్వ భజన కాదని నార్లవారు నమ్మారు. ప్రజాభిప్రాయాన్ని పత్రికలు వ్యక్తం చేయాలనీ, ప్రజల యోగక్షేమాలను కాపాడాలని కాంక్షించారు. అవసరమైతే ఆయన లాగా సంపాదకీయాల్లో తీవ్ర పదజాలాన్ని వాడారు. పరిస్థితులు మారినప్పుడు, అంతకుముందు తాను వెల్లడించిన అభిప్రాయాలకు విరుద్ధమైన వాటిని సంపాదకుడు వెల్లడించవచ్చుననీ, అది చపలచిత్తం, అవకాశవాదం కాదని, ఏనాటి పరిస్థితిని ఆనాడు చిత్తశుద్ధితో ఎడిటర్ పరిశీలించాలని నమ్మినవాడు నార్లగారు. ఈ నేపథ్యంలో ఒకవేళ నిలకడలేని వాడన్న నిందకు భయపడకుండా, న్యాయమైనదిగా తాను నమ్ముతున్నదాన్ని నిర్భీకంగా వ్రాయాలన్నది నార్లమాట, బాట. ఈ లక్ష్యాలే జర్నలిస్టులకు శిరోధార్యాలు.

1908 డిసెంబర్ ఒకటిన జబల్‌పూర్‌లో పుట్టిన నార్లకు తన ఏడవయేట కృష్ణాజిల్లా కవుతరం వచ్చేదాకా తెలుగుభాషే తెలిసేదికాదు. ఆ తర్వాత ఇక్కడే చదువుకున్న నార్లకు తెలుగు బాగా పట్టుబడింది. వివిధ పత్రికలలో రచనలు చేస్తే వచ్చిన డబ్బుతో ఇంటర్మీడియెట్, బి.ఏ.పూర్తిచేసిన నార్లకు తెలుగు జర్నలిజం కన్నా, ఇంగ్లీషు జర్నలిజం

ఎక్కువ జీతం ఇస్తామని, మళ్ళీ వచ్చి చేరవలసిందిగా యాజమాన్యం ఎరచూపినా నార్లగారు ససేమిరా అంగీకరించలేదు.

ఆ తర్వాత 1960లో నార్లగారి అభిమానుల చొరవతో నార్లగారికోసం "ఆంధ్రజ్యోతి" దినపత్రిక ప్రారంభమైంది. 1960 జూలై 2వ తేదీ ప్రారంభ సంపాదకీయం "నమస్కారం"లో "ఆంధ్రజ్యోతి" ఆశయాల గురించి నార్లగారు వివరించారు. పారతంత్ర్యాన్ని ప్రతిఘటించడం, సర్వత్రా, సర్వవిధాల స్వాతంత్ర్యానికి ప్రోదిచేయడం ప్రధానాశయంగా పేర్కొన్నారు. స్వాతంత్ర్యానికి రాజకీయ స్వాతంత్ర్యంగా పరిమితార్థాన్ని చెప్పుకొనక, ఆర్థిక సాంఘికాది సమస్త జీవిత రంగాలకు పరిపూర్ణంగా దాన్ని విస్తరింపచేయడానికి కృషి చేయడం రెండో ఆశయమన్నారు. వ్యక్తికి, సమిష్టికి విధిగా స్పర్ధలుండకనక్కరలేని నవసమాజ నిర్మాణం కోసం జరిగే ప్రతి సత్ ప్రయత్నాన్ని సమర్థించడం మూడవ ఆశయంగా చెప్పారు. పాతను అది పాతదన్న కారణంగానే హర్షించక, కొత్తను అది కొత్తదన్న కారణానే నిరసించక, కొత్తపాతల మేలుకలయిక" ద్వారా నవనవోన్మేషమైన సజీవ సంస్కృతిని రూపొందించడానికి సర్వశక్తులను వినియోగించటం–నాల్గవ ఆశయంగా వివరిస్తూ–బహుళ జనాభ్యుదయాన్ని "ఆంధ్రజ్యోతి" కాంక్షిస్తున్నదనీ స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాలు దీని దృష్టిలో ఒకదానికొకటి ఎంతమాత్రం తీసిపోని పరమలక్ష్యాలుగా నార్లగారు స్పష్టంచేశారు.

"ఆంధ్రజ్యోతి"ని నార్లగారు లోగడ తాను పెంచిన పెద్దచేసిన ఆంధ్రప్రభ కంటే విభిన్నరీతిలో తీర్చిదిద్దారు. సాహిత్యానుకళలకు, వైజ్ఞానిక శాస్త్రాలకు, సంఘసంస్కరణాది విషయాలకు ఇచ్చిన ప్రాధాన్యత గ్రామీణ వార్తలకు ఇచ్చారు. జిల్లాలపై ప్రత్యేక సంచికలు తెచ్చారు. వ్యవసాయరంగానికి, మహిళారంగానికి సంబంధించిన ప్రత్యేక శీర్షికలు పెట్టారు. సంపాదకీయ గ్రంథ సమీక్షలకు ఓం ప్రథమంగా "ఆంధ్రజ్యోతి"లో శ్రీకారం చుట్టారు. ఈ ప్రయోగం రచయితలు, విమర్శకుల ఆదరణ పొందింది. ఆయా ప్రచురణకర్తలకు తెలుగులో వచ్చిన సమీక్షతాలూకు ఇంగ్లీషు తర్జుమా వెంటనే పంపించే పద్ధతి ప్రవేశపెట్టడంతో దేశంలోని ఆయా ప్రముఖ రచయితలు, ప్రసిద్ధ ప్రచురణ కర్తల నుంచి విశేష స్పందన వచ్చింది.

నార్లగారిలో రాగద్వేషాలు ఎక్కువగా ఉండేవి. ఉదాహరణకు – విశ్వనాథ సత్యనారాయణ సాహిత్యాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారు. ఈ అత్యాధునిక యుగంలో అభ్యుదయం లేకపోగా సనాతన వాదంతో కులవిషబీజాలను నాటే ఛాందస హైందవ అహంకారాన్ని బట్టబయలు చేసే విశ్వనాథ సాహిత్యం సమాజానికి హితం చేసేది ఎంతమాత్రం కాదని ఖండించేవారు.

రాజగోపాలాచారి రాజకీయాలకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రిగా ప్రకాశంపంతులు గారికి నార్లగారు మద్దతు ఇచ్చారు. తిరిగి ప్రకాశం పంతులు మంత్రివర్గంలోని అవినీతిని ఐదు వ్యాసాల్లో వివరిస్తూ ధ్వజమెత్తారు.

మద్రాసుతో కూడిన ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహార దీక్షను నార్లగారు ఖండించారు.

అలాగే ప్రకాశంపంతులు ఆంధ్రకు రాజధానిగా కర్నూలును ఖాయపరిచినప్పుడు నార్లగారు తగదని దుయ్యబట్టారు.

నందికొండప్రాజెక్టు (నాగార్జునసాగర్) నిర్మాణ ఉద్యమాన్ని నార్లగారు ఎంతగానో ప్రోత్సహించారు.

ఎన్నికల సందర్భంగా కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా ఎన్నో సంపాదకీయాలను నార్లగారు ఆయుధాలుగా సంధించారు.

ఎప్పటికప్పుడు ఇంగ్లీషులో వాడుకలో కొచ్చే కొత్త కొత్త పదాలకు తెలుగు పత్రికలకు కావలసిన తర్జుమా వెంటనే చేసుకోవలసి ఉంటుంది. బహువిషయ పరిజ్ఞానం అధ్యయనశీలం గల నార్లగారు అలా అనేక పదాలు తెలుగులో ఖరారు చేశారు. ఉదాహరణకు–'యునైటెడ్ నేషన్స్'కు ఐక్యరాజ్య సమితి' అని తొలుత నార్లగారు వాడారు. "నాన్ ఎలైన్డ్"కు అలీన అని కూడా నార్లవాడుకలోకి తెచ్చారు. కొందరు దీన్ని "తటస్థ" అనీ, మరికొందరు–" విబంధ" అని వాడినా చివరికి నిలిచింది "అలీన" అనేదే. నార్లగారు "అలీన" అనే పదం ఎందుకు సరైనదో వివరిస్తూ సంపాదకీయమే వ్రాశారు. అలాగే "రెఫ్యూజీ"కి "కాందిశీకులు" అని, "సమిట్"కు "శిఖరాగ్రం" అని, "రిట్రీట్"కు "తిరోగమనం" అని ఆయనవాడి వాడుకలోకి తెచ్చారు. అలాగే–విశాఖపట్నం ఓడరేవులో కొత్తగావచ్చిన "డ్రెడ్జర్"ను అక్కడి కూలీలు "తవ్వోడ" అని వ్యవహరించిన పదాన్నే రూఢిచేస్తూ, కార్మికుల గుండెలోతుల్లోంచి వచ్చిన ఆ పదం ప్రాముఖ్యత వివరిస్తూ ఒక సంపాదకీయం వ్రాశారు.

ఇలా చెబుతూపోతే ఇంకా ఎన్నో ఎన్నెన్నో అంశాలున్నాయి.

రాష్ట్రాన్ని అతలాకుతలం చేసే వరదలు కరువు పరిస్థితులు సంభవించినప్పుడు బాధితుల సహాయార్థం పత్రికాముఖంగా విరాళాలు సేకరించే ప్రక్రియకు నార్లవారు శ్రీకారంచుట్టారు.

అయితే 1958–59లో కార్మిక వివాదం కారణంగా కార్మికుల పక్షాన నిలిచి నార్లగారు తన ఉద్యోగానికి రాజీనామా చేసి "ఆంధ్రప్రభ" నుంచి బయటకు వచ్చారు.

అని పురాణంగారు చమత్కరించారు. (నార్లగారు ఇంగ్లీషు పాఠకులకు వి.ఆర్.నార్లగా పరిచితులు)

భారతీయ సాహిత్య నిర్మాతలు పరంపరలో "గురజాడ"పై కేంద్ర సాహిత్య అకాడమీకి నార్లగారు మోనోగ్రాఫ్ వ్రాశారు. ఈ సందర్భంగా గురజాడ డైరీలను, నోటు పుస్తకాలను నార్లగారు పరిశీలించారు అవసరాల సూర్యారావు గురజాడ ఇంగ్లీషను తలకెక్కించుకోలేక తప్పులు రాశాడని నార్లగారు గుర్తించారు. ఈ సామాగ్రినంతా పురాణంగారికి అప్పగించి, దాన్ని సక్రమంగా అధ్యయనం చేసి ఎలా వ్రాయాలో నార్లగారు చెప్పి 'ఆంధ్రజ్యోతి'లో పురాణంగారి గొలుసువ్యాసాలను ప్రచురించారు. ఈ వ్యాసాలు సాహితీలోకంలో సంచలనం సృష్టించాయి. అయితే కమ్యూనిస్టులకు మాత్రం నార్లగారంటే కడుపులో మంట కలిగింది. దీన్ని నార్లగారు లెక్కచేయలేదు.

నార్లగారి పట్టువిడుపులకు మరొక ఉదాహరణ.

ఒకసారి మద్రాసుకు ఎం.ఎన్.రాయ్. ఎలెన్‌లు వచ్చారు. వారి రాకను పురస్కరించుకుని ప్రసిద్ధరచయిత గోపీచంద్ పత్రికా ప్రతినిదుల సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటికే ఈ ఇరువురు రాక రహస్యాల్ని వింగడిస్తూ "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" లో ప్రముఖ సంపాదకుడు ఖాసా సుబ్బారావు ఒక వ్యంగ్య రచన చేశారట. అది చూసిన ఎం.ఎన్.రాయ్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇలాంటి రాతలు వ్రాసిన వారికి దండన అవసరమంటూ కోపంతో ఖాసావారి మీదిమీదికి వచ్చారట. దానికి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పత్రికల వారంతా రాయ్ సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్ళిపోయారట. ఇక ఆనాటి నుంచి తన పత్రికలో రాయ్ వార్తలు ప్రచురించకూడదని ఆర్డర్ వేశారు. రాయ్ నిర్యాణం చెందిన నాటికి అదే ధోరణితో నార్లగారు వ్యవహరించారు. అన్ని పత్రికలు ఎం.ఎన్.రాయ్ మరణానికి తీవ్ర సంతాపాలు వ్యక్తం చేశాయి. కాని నార్లగారు దీనిపై స్పందించలేదు. దీనిపై ఆవుల గోపాలకృష్ణమూర్తిగారు కలుగజేసుకుని ఒక సభలో ఎవరో ఊరు పేరు లేని వాడు పోతే "ఒక వట వృక్షం కూలిపోయింది, ఒక తార రాలిపోయింది" అని ఉత్తేజకరమైన సంపాదకీయం వ్రాసే నార్లగారికంటికి ఎం.ఎన్.రాయ్ ఆనలేదేమిటని ప్రశ్నించారట.

అంతే ఎం.ఎన్.రాయ్ సాహిత్యమంతా తెప్పించి అధ్యయనం చేసి నార్లగారు సంపాదకీయం వ్రాశారు. ఆయన భావధారను ఇష్టపడి తాను మానవతావాదినేనని చెప్పుకున్నారు, "రాయిస్టు"గా మారిపోయారు.

అలాగే పలుమార్లు డి. హెచ్.లారెన్స్‌ను మక్కికి మక్కీ అనుకరించి, బెర్ట్రాండ్ రస్సెల్ "మ్యారెజ్ అండ్ మారల్స్" ప్రభావానికి గురైన గుడిపాటి వెంకట చలం-వారిని ప్రస్తావించకపోవడం అపరాధమనేవారు" దేవుడిచ్చిన భార్య "ఏదో ఆంగ్ల నవలకు అనుసరణమని కొట్టిపారేసేవారు.

శ్రీశ్రీ "దేశచరిత్రలు" గేయంలోని తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" లాంటి పలుపంక్తులపై ప్రసిద్ధ జర్మన్ కవి బెర్తోల్‌బ్రెఖ్ట్ రచించిన "ఎవర్కర్ రీడ్స్ హిస్టరీ" గేయం ప్రభావం ఉందని, ఆ విషయాన్ని శ్రీశ్రీ చెప్పలేదనేవారు. శ్రీశ్రీ కవిత్వంలో అగ్ని పర్వతం లావా ఉన్నప్పటికి, అతని లాగే ఆయన కవిత్వంలో కూడా లోతులేదనేవారు. అతనిని ఉన్నత మానవుడిగా పరిగణించలేననీ, గొప్ప మేధావిగాను గుర్తించలేనన్నారు.

వాఙ్మయ మహోధ్యక్ష బిరుదు గ్రహీత వడ్లమూడి గోపాలకృష్ణయ్య పేరు చెబితేనే తోకత్రొక్కిన త్రాసులా బుస్సున లేచి, ఆయన బండారాన్ని బయటపెట్టేవారు.

దిగంబర కవులు కవులేనా? అనేవారు. ఒకసారి నార్లగారిని సంప్రదించకుండా "ఆంధ్రజ్యోతి"లో దిగంబరకవుల ఇంటర్వ్యూచేసి సీనియర్ జర్నలిస్టు ఎ. హెచ్. వి. సుబ్బారావుగారు సుదీర్ఘవ్యాసం ప్రచురించడంతో సంపాదవర్గాన్ని నార్లగారు ఉతికిపారేశారు.

వీరెవరి గురించి వ్రాయాలన్నా అంతా బెదిరేవారు

ఇంత ప్రస్ఫుటంగా నార్లగారు రాగద్వేషాలు వ్యక్తం చేస్తున్నా, ఒక్కొక్కసారి ఆయనకు ఏమాత్రం గిట్టని అంశాలు "ఆంధ్రజ్యోతి" సచిత్రవార పత్రికలో పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు ప్రచురించిన, నార్లగారి ఆగ్రహానికి గురయ్యేవారు.

నార్లగారికి ఎంతో ఇష్టుడైన విద్వాన్‌విశ్వంగారు 'ఆంధ్రప్రభ' వారపత్రిక ఎడిటర్‌గా ఉండేవారు. నార్లగారు "సీతజోస్యం" వీరికి అంకితమిచ్చారు. వారంటే నార్లగారికి ఇష్టం. "మాణిక్యవీణా" అనే శీర్షిక వారంవారం విద్వాన్ విశ్వం జనరంజకంగా వ్రాసేవారు. ఎందుచేతనోగాని ఆయనను, ఆ శీర్షికను వెక్కిరిస్తూ పురాణంగారు "ఆంధ్రజ్యోతి"లో "గాణిక్యవీణ" అని వ్రాశారు.

దీనిపై పురాణంగారిని విజయవాడ నుంచి హైదరాబాద్ పిలిపించి నార్లగారు నానా చివాట్లు పెట్టారు. ఇంత జరిగిన తర్వాత నార్లగారి దగ్గర నుంచి రాగానే "ఏమైందండీ!" అని పురాణంగారిని ఎవరో ప్రశ్నించారు. "ఏముంది! 'జ్యోతి'కి నార్లగారు కదా ఎడిటర్. ఆయన పాలసీనే పాటించాలి కదా? అందుకని ఇకపై "We are marla's"

నార్లగారు ఈ విషయాన్ని 1977 ఏప్రిల్ 3వ తేదీ "ఆంధ్రజ్యోతి" దినపత్రికలో "కృతజ్ఞతతో సెలవు" శీర్షికన ప్రకటించారు. తనను సంప్రదించకుండా ఇంత జరిగిన తర్వాత "ఆంధ్రజ్యోతి"లో తనకు స్థానం లేదని, అందులో కొనసాగడం తగదని తోచిందన్నారు. అయితే కొన్ని ప్రత్యేక కారణాల వల్ల తన నిర్ణయాన్ని అమలు పరచడం ఇప్పటి వరకు సాధ్యపడలేదన్నారు. ఇందుకు విచారిస్తున్నాను అన్నారు. ఇకమీదట ఎడిటర్‌గా పనిచేసినా, చేయకపోయినా ఊపిరి ఉన్నంత వరకు తాను నమ్మిన, నమ్ముతున్న జీవితపు విలువలకై పోరాడగలనని మనవి చేశారు.

"నేను ఆస్తికుడను కాను, నాస్తికుడిని కాను. నాది 'యాగ్నాస్టిక్ "దృక్పథం" అనేవారు. తాను హిందువుగా జన్మించినా హిందువుగా భావించుకోననీ, మానవహేతన మతమన్నారు. పూర్వజన్మలో, పునర్జన్మలో తనకు విశ్వాసం లేదనీ, హేతువాదాన్ని శాస్త్రీయతను అభిమానిస్తానన్నారు. దీనికి పరిమితులున్నా, హేతువాద పరీక్షకు నిలవలేనిదాన్ని సత్యంగా ఆయన స్వీకరించలేదు.

ఎక్కడ తప్పుకన్పించినా, దాన్ని సంస్కరించాలనే అభిలాష ఆయనకుండేది.

"సంప్రదాయాలు" శీర్షికన వ్రాసిన సంపాదకీయంలో సాధారణంగా పెండ్లి శుభలేఖలు-శ్రీమతి, శ్రీ..ల పేరున ముద్రిస్తున్నారు. కాని పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం ముందు పేర్కొనవలసింది-" మిస్టర్‌నే అనీ "మిసెస్"ని కాదని సోదహరణంగా తెలిపారు. పోతే శుభలేఖలలో "సౌభాగ్య" అనే మాటను సౌ అని కుదిస్తున్నారు. ఇంగ్లీషులో "Sow" అంటే వయస్సులో ఉన్న ఆడపంది అని అర్థం చెప్పారు.

ఇదేవిధంగా "చిరంజీవి" అనే పదాన్ని "చి"(Chi) అని కుదించడం కూడా అపసవ్యమైందన్నారు. 'Chi' అనే వర్ణక్రమాన్ని "ఛీ" అని కూడా ఉచ్చరించడానికి వీలున్నదని గమనించమన్నారు.

అలాగే సంభాషణ సందర్భంలో "నామిసెస్, మీ మిసెస్" అనడం కూడా శుద్ధ తప్పన్నారు. "మైవైఫ్, "యువర్‌వైఫ్" అని పేర్కొనాలన్నారు. ఈ సంపాదకీయం "మూడు దశాబ్దాలు"లో చేర్చలేదు.

ఇలా ఇంకా ఎన్నో చెప్పవచ్చు.

"ఆంధ్రజ్యోతి" ఎడిటర్ నార్లగారంటే కాసు బ్రహ్మానందరెడ్డికి సింహస్వప్నం. ఆయన పత్రికా స్వేచ్ఛను అణచడానికి తెచ్చిన బిల్లును చీల్చిచెండాడారు. "ఆంధ్రజ్యోతి"ని బ్లాక్‌లిస్టులో పెట్టిన ప్రవాహానికి ఎదురీదారు. "బ్రహ్మంగారి తత్వాలు" అనే ప్రత్యేక శీర్షిక పెట్టి ప్రభుత్వం దిగివచ్చేట్లు చేశారు.

"పత్రికొకటున్న పదివేల సైన్యము, పత్రికొక్కటున్న మిత్రకోటి, ప్రజలకు రక్షలేదు పత్రిక లేనిచో పత్రికేనియంత, పక్కలో బల్లెము, పత్రికేప్రజాళి పట్టుగొమ్మ, ప్రభుత్వ వక్రమౌను పత్రికలేనిచో-నవయుగాల బాట నార్లమాట" అన్న నార్లగారు. తన సమ్మతి లేకుండా, తనకు తెలియకుండా అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ రెండో కుమారుడు సంజయ్‌గాంధీ గుంటూరు రాక సందర్భంగా "ఆంధ్రజ్యోతి" స్థానిక సంపాదకుడు, దాని అన్య నిర్వాహకులు ప్రత్యేక సంచిక వెలువరించారనీ, అతడిని ప్రశంసిస్తూ సంపాదకీయం వ్రాశారని నార్లగారు రాజీనామా చేశారు. తాను నమ్మిన జీవిత విలువలకు కట్టుబడే


ఆంధ్ర సారస్వత పరిషత్తు
Andhra Saraswatha Parishath.
Tilak Road, Hyderabad - 500 001
NO PARKING


డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం